# 1. సాంఘిక శాస్త్ర స్వభావం - బోధనా లక్ష్యాలు

సాంఘిక శాస్త్రం అంటే !

భూగోళ, చరిత్ర, పౌర, ఆర్థిక శాస్త్రాల సమగ్ర అధ్యయనమే సాంఘిక శాస్త్రం.

**.... సెంకండరీ విద్యా కమీషన్**

"ఒక వ్యక్తి వివిధ విషయాల్లో అనగా, భాష , రసాయన శాస్త్రం, గణితం, సాంకేతిక పరిజ్ఞానం మొదలైన విశిష్టతలు ఎన్ని ఉన్నా తన పొరుగువారి పట్ల, సమాజం పట్ల సరియైన వైఖరి కలిగి ఉండకపోతే అతడు సమాజంలో పౌరునిగా ఇమడలేదు". "జీవించడం ఒక కళ! సాంఘిక శాస్త్రం ఆ కళ గురించిన శిక్షణ ఇస్తుంది."

**- యం.పి. ముఫట్**

"సాంఘిక శాస్త్రం ప్రత్యేకమైన శాస్త్రం". ఇది భౌగోళికంగా, చారిత్రకంగా, ఆర్థికంగా, రాజనీతి పరంగా వివిధ సమాజాలలోని విషయ సంబంధం, అంతర్ సంబంధాల అధ్యయనము. ఇది వ్యక్తుల, పిల్లల భావిజీవితానికి అవసరమైన సంపూర్ణ, మూర్తిమత్వాన్ని అందిస్తుంది. భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలలో జరిగిన పరిణామాల గురించి వివరిస్తూ, జరగబోయే పరిణామాల పట్ల అవగాహన కలిగించి, వాటి మధ్య సంబంధాన్ని తెలియజేస్తుంది.

విద్యార్థికి స్థానిక పరిసరాలు, వ్యక్తులు, సామాజిక సంస్థలు, అట్లాగే ప్రపంచములోని వివిధ ప్రాంతాలలో మానవుల, జీవ వైవిధ్యం, జీవన విధానం, సంస్కృతి. వాతావరణం మొదలైన అంశాలకు సంబంధించిన జ్ఞానం అందిస్తుంది. ప్రస్తుత సమాజ నేపథ్యం, రాబోయే తరాలవారు, వారి సామాజికస్థితిగతులను అవగాహన చేసుకుని, 'మార్పుకు' అనుగుణంగా సాంఘిక వైఖరులు, నైపుణ్యాలు పెంచుకొనుట, మన పూర్వీకులు వారి సామాజిక పరిస్థితులకు తగిన వైఖరులు, నైపుణ్యాలు ఎలా కలిగి ఉండేవారో, ఇప్పటితరం వారు కూడా, సమర్థవంతమైన జీవనం సాగించుటకు అవసరమైన, సానుకూల మార్పుల పట్ల అవగాహన కలిగిస్తుంది.

సాంఘిక శాస్త్రం మానవునికి జీవ, భౌతిక, సాంఘిక పరిసరాలతో గల అవినాభావ సంబంధాన్ని వివరిస్తూ, వాటి మధ్య అనుగుణ్యత (Equilibrium), ఆవశ్యకత (Importance) లను తెలియజేస్తుంది. మానవ సంబంధాలు తద్వారా మంచి వైఖరులు (Attitudes), నైపుణ్యాలు, భావనలు ఏర్పరచి, విలువలు గల ఉత్తమ వ్యక్తులుగా, పౌరులుగా విద్యార్థులను తీర్చి దిద్దుతుంది.

* సాంఘిక శాస్త్రం అనగా నేమి?
* ఏఏ అంశాలు సాంఘిక శాస్త్రం వివరిస్తుంది?
* సాంఘిక శాస్త్ర పఠనం వల్ల కలిగే ప్రయోజనమేమి?
* సాంఘిక శాస్త్ర అధ్యయనం ద్వారా విద్యార్థుల్లో ఆశించిన మార్పులేవి?
* సాంఘిక శాస్త్ర స్వభావాన్ని వివరించండి?

* "సాంఘిక శాస్త్రం ఇతర శాస్త్రాలకన్నా భిన్నమైనది" వివరించండి?
* సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుని లక్షణాలు తెలపండి?

స్వభావ రీత్యా సాంఘిక శాస్త్రము. "సంఘజీవనానికి పునాది" సామాజిక బాధ్యతల పట్ల వ్యక్తిని "అప్రమత్తుణ్ణి' చేస్తుంది. వివిధ తరాల వారి సామాజిక స్థితిగతులను, వాటి ఆద్యంతాలను అవగాహన పరుస్తుంది. పరిణామ క్రమాన్ని తెలుపుతుంది. రాబోవు తరాల పట్ల వ్యక్తి బాధ్యతను గుర్తు చేస్తూ "సామాజిక స్పృహ" ను కల్పిస్తుంది.

## అంతస్సంబంధాలు

వివిధ విషయాలు అనగా చరిత్ర. భూగోళం, రాజనీతిశాస్త్రం, ఆర్థిక శాస్త్రం మొదలగు వాటితో సాంఘిక శాస్త్రం ఏర్పాటైంది. ఐతే వీటిలో ప్రతి విషయం దానికి చెందిన ప్రత్యేకమైన పద్ధతులను, దృక్పథాలను కలిగిఉన్నది. ఆయా ప్రత్యేకతలను గౌరవిస్తూనే, ఆయా విషయాల మధ్య అంతర్గత సంబంధం ఉన్న విధానాన్ని అభివృద్ధి పరచడం ద్వారా వివిధ సామాజికాంశాల నేపథ్యాలను సమగ్రంగా, వివిధ సబ్జెక్టుల మధ్య అంతర్గత సంబంధం ఉండే విధాన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, వివిధ అంశాలను జోడిస్తూ రూపొందించాలని ప్రతిపాదన చేసింది.

## సమగ్రత

సాంఘిక శాస్త్రంలోని విభిన్న విభాగాల మధ్య సంబంధం ఏర్పడటానికి ముందుగా ఆయా విషయాలను మొత్తంగా అర్థం చేసుకోవడం అవసరం. సాంఘిక శాస్త్రం మానవ జీవితంలో జరిగే వివిధ సామాజిక దృగ్విషయాలను వివిధ కోణాలలో అర్థం చేసుకోవడానికి కూడా ఉపకరిస్తుంది. అందువల్ల సాంఘిక శాస్త్ర అధ్యయనం ద్వారా ఏమి పెంపొందించాలను కుంటామో వాటి నుండి దూరం కాకుండా ఉండటానికి వీలుకలుగుతుంది. ఇదే సందర్భంలో సామాజిక విషయాలను అర్థం చేసుకోవడటంతో పాటు ప్రపంచాన్ని విస్తృత దృష్టితో చూడటాన్ని నేర్పుతుంది. సున్నితంగా ఆలోచించడం, సహానుభూతి కల్గిఉండటాన్ని పెంపొందిస్తుంది.

## లక్ష్యాత్మకం

సాంఘిక శాస్త్రం సమాజాన్ని ఖచ్చితమైన పద్ధతుల ద్వారా అధ్యయనం చేస్తుంది. ఇది పరిణామాత్మకంగా, గుణాత్మకంగా ఉంటుంది. పరిణామాత్మక విధానంలో వివిధ అంశాలను అధ్యయనం చేసిన తరువాత సాంఖ్యక శాస్త్ర పద్ధతులను ఉపయోగించి నిర్దిష్టమైన, విశ్వసనీయమైన ఫలితాలను, సాధారణీకరణాలను సృష్టించడం ద్వారా పరిణామాత్మకమైన ఆధారాలతో సామాజిక దృగ్విషయాలను అధ్యయనం చేస్తారు. గుణాత్మక విధానంలో సామాజిక దృగ్విషయాలను ప్రత్యక్ష పరిశీలనల ద్వారా, వ్యక్తి తన ప్రత్యక్ష, పరోక్ష ప్రతి చర్యల ద్వారా, నివేదికలను, ముద్రిత సామగ్రిని విశ్లేషించడం ద్వారా అధ్యయనం చేస్తారు.

## పద్ధతులు

సాంఘిక శాస్త్ర అధ్యయనం చేయడానికి ఉపయోగించే పద్ధతులలో సర్వేలు– విభిన్న వర్గాలకు చెందిన పరస్పర విశ్లేషణలు, అధ్యయనాలు పెద్ద మొత్తంలో నమూనాలు సేకరించి, ప్రతి విభాగాన్ని లోతుగా, నిశితంగా విశ్లేషించడం, కాలానుగుణంగా వస్తున్న మార్పులను పోల్చుకోవడం, సమకాలీన అంశాలను పర్యవేక్షణ చేయడం, చారిత్రక డాక్యుమెంట్ల ద్వారా వాస్తవాలను రాబట్టడం ముఖ్యమైనవి. ఈ విధమైన పద్ధతులన్నీ సాంఘిక శాస్త్ర విద్యా ప్రణాళికలలో చోటు చేసుకున్నాయి.

## విశాల దృక్పథం

సాంఘిక శాస్త్రాలు కోరిన విధంగానే ఉండేలా చేయడము (Determinism), మూసతత్వం, ఒకే రకంగా ఉండటాన్ని (Typification) తరతరాలుగా ప్రోత్సహించింది. భౌగోళికంగా ఉండటం లేక ఆర్థికంగా ఒకే విధంగా ఉండటం (Geographic determinism) సమాజాలను మరియు దేశాలను మూసపోసిన విధంగా తయారు చేయడం సాంఘిక శాస్త్ర బోధనలో ప్రత్యేకమైన అధికారమైన ముద్రగా (Hallmark) ఉంటుంది. దీనిని తొలగించాల్సిన అవసరం ఉంది. దీని స్థానంలో విశాల దృక్పథాన్ని, బహుళ సకారణాత్మక భూగోళ శాస్త్రంలోని విషయంగానే చర్చించాలి. తప్ప దానిని చారిత్రక, పౌరసంబంధ, ఆర్థిక అంశాల దృష్టిలో చూడడం కాని, విశ్లేషించడం గానీ జరగకూడదు. అందువల్ల విస్తృతంగా ఆలోచించడానికి వీలుగా సాంఘిక శాస్త్ర విభాగాల మధ్య ఉన్న అడ్డుగోడలు ఛేదించాలి. సమన్వయ పరిచే చర్యలకు శ్రీకారం చుట్టాలి.

సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన మరొక కీలకమైన విషయ మేమిటంటే సామాజికంగా జరిగే మానవ ప్రతిచర్యలను బహుళ దృష్టి కోణాలలో చూడాలి తప్ప, ఏదో ఒక కోణంలో మాత్రమే చూడడానికి అర్థం చేసుకోవడానికి వీలులేదు. ఇది ప్రజాస్వామ్య నియమాలకు లోబడి జరగాలి. బహుళ దృక్పథ విధానాలు సమగ్రంగా, అర్థవంతంగా ఉంటాయి. ఇవి వివిధ వనరులను గుర్తించడానికి, వినియోగించడానికి తోడ్పడతాయి. విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా ఆలోచనలను వృద్ధి పరుస్తాయి.

ఏ సాంఘిక దృగ్విషయమైన వ్యక్తుల పైన వివిధ రకాలుగా ప్రభావాన్ని చూపుతుంది. ఇది వ్యక్తి సమాజంలో తాను ఉన్న స్థానంపై ఆధారపడి ఉంటుంది. ఉదా: ద్రవ్యోల్బణం అయితే దాని ప్రభావం ఆయావర్గాలపై వేరు వేరు రకాలుగా ఉండటాన్ని గుర్తిస్తాం. అందువల్ల విభిన్న దృష్టికోణాలలో ఆలోచించడం, బహుళ రీతుల్లో ప్రతిస్పందించడం అవసరం. సంపూర్ణమైనదిగా ఉండి, వివిధ వనరులను సమన్వయపరుచుకొని విశ్లేషించడానికి, విమర్శనాత్మకంగా ఆలోచించడానికి సాంఘికశాస్త్రం ఉపయోగపడుతుంది.

## అనుషంగిక విషయాల సహసంబంధం

సాంఘిక శాస్త్ర వివిధ అంశాలను మరింతగా, లోతుగా విచారించినప్పుడు మాత్రమే సాంఘిక శాస్త్ర విషయ స్వభావాన్ని నిశితంగా పరీక్షించడానికి, దాని స్వరూపానికి ఒక స్పష్టత చేకూర్చడానికి వీలుకలుగుతుంది. అంటే సాంఘిక శాస్త్రాలను సంస్కరించడమనేది ఆయా సాంఘిక శాస్త్ర విభాగాల చారిత్రక మూలాలను అర్థం చేసుకోవడం, తులనాత్మకంగా విశ్లేషించడం, తద్వారా వివిధ సాంఘిక శాస్త్ర విభాగాల మధ్య సంబంధాన్ని బలపరచడానికి ఒక విషయాన్ని అన్ని విభాగాల దృష్టి కోణంలో చర్చించుటకు వీలుకలుగుతుంది.

సాంఘిక శాస్త్రంలోని విభిన్న విభాగాలు అన్నీ సహసంబంధం కలిగి, ఉమ్మడి లక్షణాలను పొందినప్పుడు ఒక దాని

కొకటి సంబంధం కలిగిన అంశాలుగా మారినప్పుడు, విభిన్న బోధనా పద్ధతులు, బోధనావ్యూహాలు అభివృద్ధి చెందుతాయి. ఈ విధంగా సాంఘిక శాస్త్రం అనే పేరు మీద అందులోని విభిన్న విభాగాలను సమన్వయపరచడం, నూతనంగా వర్గీకరించడం ద్వారా సాంఘిక శాస్త్రాన్ని కొత్త కోణంలో చూడడానికి, వినియోగించడానికి వీలు కలుగుతుంది.

**సాంఘిక శాస్త్ర బోధనా లక్ష్యాలు**

1. సామాజిక నేపథ్యంలో కారణాలు చెప్పడం, కారణాలను అన్వేషించే నైపుణ్యాలను పెంపొందించడం.
2. తక్షణ సామాజిక అభివృద్ధి అంశాలను ప్రపంచ పోకడలతో పరస్పరం అన్వయించడం.
3. స్థల, కాల సంబంధాలకు చెందిన విభిన్న మానవ అనుభవాలను అర్థం చేసుకోవడం.
4. సామాజిక ప్రపంచాన్ని పలుకోణాలలో చూసి అర్థం చేసుకోవడం.
5. విభిన్న వర్గాల ప్రజలపై సామాజిక దృష్టాంతాల ప్రభావాన్ని అర్థం చేసుకోవడం.
6. పొందిన సమాచారం, పరికల్పనలు, ఊహాత్మక అంశాలను మూల్యాంకనం చేసే నైపుణ్యాలను పెంపొందించడం.
7. ముద్రిత అంశం, డేటా, చిత్రాలు (ఉదా. వివిధ పద్ధతులలోని సమాచారం జ్ఞానాన్ని చిత్రాల రూపంలో పేర్కొనడం / అన్వయించడం/దార్శనికతను ప్రదర్శించడం) మొదలగు వాటిని నిర్వహించే నైపుణ్యాలు పెంపొందించడం.
8. సామాజిక, రాజ్యాంగ విలువలతో మమేకమవడం.

**చరిత్ర**

1. సమాజంలో వచ్చే మార్పు ప్రక్రియలను అర్థం చేసుకోవడం.
2. సమాజం ఎందుకు ఎలా మార్పులకు లోనవుతుందో అవగాహన చేసుకోవడం
3. సమాజంలో వచ్చే మార్పులు, వివిధ సామాజిక వర్గాల వారిని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవడం.
4. మనం గుర్తింపు పొందిన విధానాలలో భాగంగా చరిత్రను అధ్యయనం చేయడం ఎలా? అనే అంశాన్ని అర్థం చేసుకోవడం.
5. చరిత్ర నిర్మాణంలో గుర్తింపు పొందే విధానం ఏ విధమైన ప్రభావం చూపుతుందో అర్థం చేసుకోవడం.
6. చరిత్రలో మానవ వ్యవస్థ పరిధి, ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం.
7. వనరుల సహాయంతో చరిత్రను అర్థం చేసుకోవడానికి, విమర్శనాత్మక, నిశిత పద్ధతులను అవలంబించడం.
8. చరిత్ర, సామాజిక సందర్భ రచన, గతాన్ని పునర్నిర్మించడం, దానిని అందించే పద్ధతిని ప్రభావితం చేస్తుందని అర్థం చేసుకోవడం.

**భూగోళ శాస్త్రం**

1. మానవ సమాజాలు, సహజ పరిసరాల మధ్య ఉన్న గతిశీల సంబంధాన్ని అర్థం చేసుకోవటం.
2. అంతరిక్ష, భౌతిక క్రమం, సహజ ప్రాంతాలుగా మారడాన్ని అర్థం చేసుకోవడం, సమాజాలు వాటిని ఏ విధంగా మార్చి, ఉపయోగించాయో తెలుసుకోవటం.

3. సామాజిక, క్షేత్రీయ సంబంధాలు అంటే కాలనీ మరియు మహానగర, పట్టణ ముఖ్య ప్రాంతాల వంటి వాటి మధ్యగల సంబంధాలను అర్థం చేసుకోవడం
4. ప్రపంచ వ్యాప్తంగా విస్తృత, విభిన్నతతో కూడిన మానవ అనుభవాలను పిల్లల ముందు బహిర్గతం చేయడం, అదే సమయంలో మానవుల మధ్య సహచర భావనను పెంపొందించడం.
5. భౌగోళిక పరిశోధనలో సాంఘిక, చారిత్రక సందర్భాన్ని అర్థం చేసుకోవడాన్ని అభివృద్ధి పరచడం.
6. స్కేలు, వర్షమాపని, థర్మామీటరు మొదలగు పరికరాలను ఉపయోగించి పటాలను రూపొందించడం, వాటిని చదవటం వంటి నైపుణ్యాలను అభివృద్ధి పరచడం, భూగోళ శాస్త్ర పరిణామ క్రమంలో వీటి పాత్రను అర్థం చేసుకోవటం.

**సాంఘిక, రాజకీయ జీవన బోధనా లక్ష్యాలు.**

1. సామాజిక, ఆర్థిక విశ్లేషణా పద్ధతులకు ఉపోద్ఘాతాన్నివ్వడం.
2. మౌళిక రాజ్యాంగ విలువలు, లక్ష్యాలను పిల్లలకు పరిచయం చేయడం.
3. ప్రజాస్వామిక పాలన, చట్టం లోని నిబంధనలపై అవగాహనను పెంపొందించడం.
4. క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవాన్ని, సాధారణ లేదా ఆదర్శ స్థితిని పోల్చేపద్ధతిని అభివృద్ధి చేయడం.
5. వివిధ జీవన విధానాల నుండి మానవ అనుభవాల విభిన్నతపై విస్తృత అవగాహనను ఏర్పరచడం.
6. వివాదాస్పద అంశాలను పక్కన పెట్టకుండా ఆదరించడం, పరిగణలోనికి తీసుకోవటం.

**1986 జాతీయ విద్యా విధానం – 10 మౌళిక సూత్రాలు:**

1. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర
2. మన రాజ్యాంగ కర్తవ్యాలు
3. మన జాతీయతను పెంపొందించడానికి తోడ్పడే అంశాలు
4. భారతదేశ సాంస్కృతిక సంపద.
5. సమానత్వం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం
6. స్త్రీ పురుష సమానత్వం
7. పరసరాల సంరక్షణ
8. సామాజిక అవరోధాల తొలగింపు
9. చిన్న కుటుంబ భావన
10. శాస్త్రీయ ధోరణి


## ౨. పాఠ్యపుస్తకాల పరిచయం - తాత్వికాంశాల పరిశీలన

"ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరునిగా రూపు దిద్దుకోవాలి. అందుకు అవసరమయ్యే ఉన్నత ప్రమాణాలు గల విద్యను ప్రతిపిల్ల (వాని) కి అందజేయాలి".

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దృక్పథం

పిల్లలందరూ గుణాత్మక విద్యను పొంది, ఇతరుల పట్ల స్పందించే వైఖరిని కలిగియుండి బాధ్యతాయుతమైన పౌరులుగా రూపొందాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. పిల్లలు తాము విన్నదానిని అవగాహన చేసుకొని దాని గురించి మాట్లాడగలగాలి. విశ్లేషణతో కూడిన ప్రశ్నలు వేయగల్గాలి. పిల్లలు స్వేచ్ఛగా ప్రశ్నించి సందేహాలను తీర్చుకోగలిగే వాతావరణం ఏర్పరచాలి. స్నేహపూరితంగా, ఇతరులతో, సమయస్కులతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చి జ్ఞాన నిర్మాణం చేసుకోవాలి. మనం సమాచారం ఇవ్వడం జ్ఞానం అని భావించరాదు. పిల్లలు, సమాజం తనదిగా భావించి స్పందించడానికి వీలుగా నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించడం జరిగింది.

* నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పన యొక్క ఆవశ్యకత.
* ఈ పాఠ్యపుస్తకాలు ఏయే మార్గదర్శక సూత్రాలపై ఆధారపడి రూపొందించడం జరిగింది?
* జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005 (NCF-2005) నిర్దేశించిన మౌలిక సూత్రాలేవి?
* నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం - 2009 (RTE-2009) లో పేర్కొన్న ప్రధానాంశాలేవి?
* రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం - 2011 (APSCF-2011) - కీలకభావనలు ఏవి?
* APSCF-2011, సాంఘిక శాస్త్ర ఆధారపత్రం పేర్కొన్న అంశాలు ఏవి?
* నూతన సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి?




1.1 భాష -భాషాబోధన - ఆధారపత్రం

1.2 ఆంగ్ల బోధన - ఆధారపత్రం

1.3 విజ్ఞానశాస్త్రవిద్య-ఆధారపత్రం

1.4 గణిత విద్య - ఆధారపత్రం

1.5 సాంఘిక శాస్త్ర విద్య - ఆధారపత్రం

1.6 పరిసరాలు-అభ్యసనం-ఆధారపత్రం

1.7 కళావిద్య - ఆధారపత్రం

2.1 విద్యాలక్ష్యాలు - ఆధారపత్రం

2.2. వ్యవస్థాపక సంస్కరణలు - ఆధారపత్రం

2.3. ఉపాధ్యాయ విద్య - ఉపాధ్యాయ వృత్తిపర అభివృద్ధి - ఆధారపత్రం

2.4 అభ్యసన కొరకు మూల్యాంకనం - ఆధారపత్రం

2.5. విద్యాసాంకేతిక - ఆధారపత్రం

2.6. విద్యా ప్రణాళికలు - పాఠ్యపుస్తకాలు - ఆధారపత్రం

3.1. విభిన్న వర్గాల విద్య - ఆధారపత్రం

3.2 ఆరోగ్య - వ్యాయామ విద్య - ఆధారపత్రం

3.3 బాల్యారంభవిద్య - ఆధారపత్రం

3.4. పని మరియు విద్య - ఆధారప్రాంతం

3.5 నైతికత - విలువలు - మానవహక్కులు - ఆధారపత్రం

## నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పన ఎందుకు?

మారుతున్న సామాజిక, ఆర్థిక రాజకీయ నేపథ్యంలో పాఠ్యపుస్తకాలను కూడా మార్చుకోవలసిన అవసరం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలానుగుణంగా పాఠ్యపుస్తకాలను మార్చే ఆనవాయితీ ఉంది.

గత పాఠ్య పుస్తకాలు అధిక సమాచారంతో నిండి విద్యార్థుల అంతర్గత శక్తుల అభ్యసనకు, జ్ఞాననిర్మాణానికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఉన్నాయి. విద్య కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయబడి, ప్రపంచ అవగాహనకు, విమర్శనాత్మక ఆలోచనలకు వాటిలో స్థానంలేదు. అంతేగాక ఏది మంచి ? ఏది చెడు? అనే విషయాలకు కూడా స్థానం లేకుండా పోయింది. ఈ పరిస్థితి తప్పుడు నమ్మకాలకు, ఊహాజనితాలకు దారితీస్తుంది. అందువల్ల ఇటువంటి విషయాల్లో పాఠ్యపుస్తకాల పాత్ర ఎంత ముఖ్యమైందో మనం తెలుసుకోవాలి. పాఠ్యపుస్తకాల ద్వారా ఏయే విలువలు పిల్లలలో కలిగించాలి? పిల్లలకు చాలా ఉపయోగకరంగా పాఠ్యపుస్తకాలను ఎలా తయారుచేయాలి? అనేవి చాలా కీలకమైన విషయాలు. ఈ విషయాలను గురించి విద్యా ప్రణాళిక స్పష్టతను ఇస్తుంది. విద్యా ప్రణాళికలను అమలు జరిపే సాధనాలలో పాఠ్యపుస్తకం కూడా ఒకటి. విద్యా లక్ష్యాలను సాధించడంలో, బోధనాభ్యసన ప్రక్రియలకు మార్గనిర్దేశనం చేయడంలో పాఠ్యపుస్తకాలు ప్రముఖ పాత్రను నిర్వహిస్తాయి. అందుకే నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించే అవసరం ఏర్పడింది.

**ఆధారాలు :**

నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పనకు ప్రధానంగా దోహదపడిన ఆధారాలు మూడు. అవి

1. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం–2005
2. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం - 2009
3. రాష్ట్ర విద్యాప్రణాళిక చట్రం - 2011.

ఇవేగాక భారత రాజ్యాంగంలోని 73,74 వ సవరణలు, "భారంలేని విద్య" అనే భారతప్రభుత్వ నివేదిక, జాతీయ విజ్ఞాన కమీషన్ ప్రతిపాదనలు, ఉపాధ్యాయ విద్య జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2010 ఆధారంగా ఉన్నాయి.

### 1. జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005 లోని మౌలిక సూత్రాలు :

* బడి బయటి జీవనానికి జ్ఞానాన్ని అనుసంధానం చేయడం
* బట్టీ పద్ధతుల నుండి అభ్యసనమును దూరం చేయడం
* పాఠ్యపుస్తక కేంద్రంగా కాకుండా పిల్లల్లో సమగ్ర వికాసానికి పాఠ్యప్రణాళికను పరిపుష్టం చేయడం.
* పరీక్షలను మరింత సరళం చేసి తరగతిగది జీవనానికి అనుసంధానం చేయడం
* దేశ ప్రజాస్వామిక నియమాలకు లోబడి పిల్లల ఆసక్తులు, అభినివేశాలను అభివృద్ధి చేయడం.

## 2. ఉచిత నిర్భంద విద్యా హక్కు చట్టం – 2009 (RTE -2009) :

ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేంతవరకు 6–14 సం॥ల వయస్సు పిల్లలకు నిర్భంధఉచిత విద్య పొందేహక్కును ఉచిత నిర్భంధ విద్యా హక్కు చట్టం – 2009 కల్పించింది (ఇది ఏప్రిల్ 1, 2010 నుండి అమలులోనికి వచ్చినది). విద్యను పొందే హక్కుతో పాటు విద్యానాణ్యతపై కూడా RTE దృష్టి పెట్టింది. ఎలిమెంటరీ విద్యలో గుణాత్మకత సాధనకు అవసరమైన నియమావళిని RTE చట్టంలోని 5వ భాగంలో పేర్కొనడం జరిగింది. ప్రభుత్వం నిర్ధేశించిన అకడమిక్ యంత్రాంగం పాఠ్యప్రణాళిక, మూల్యాంకన పద్ధతులను రూపొందించింది. పాఠ్యప్రణాళిక, మూల్యాంకన పద్ధతులను రూపొందించుటలో అకడమిక్ యంత్రాంగం దృష్టిలో పెట్టుకోవాల్సిన అంశాలు.

* రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలు.
* పిల్లవాని సమగ్ర అభివృద్ధి.
* పిల్లల్లో జ్ఞానాన్ని, శక్తులను, నైపుణ్యాలను నిర్మాణం చేయడం.
* పూర్తిస్థాయిలో పిల్లల శారీరక, మానసిక సామర్థ్యాల అభివృద్ధి.
* స్నేహపూరిత, శిశుకేంద్రీకృత విధానంలో కృత్యాలు, పరిశోధన, అన్వేషణల ద్వారా అభ్యసన.
* వీలైనంత వరకు మాతృభాషలో బోధన.
* పిల్లల మనసులు గాయపరచకుండా పిల్లలను నిర్భయంగా ఆంధోళన, ఒత్తిళ్ళు లేకుండా చేసి స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేసేలా చూడడం.
* పిల్లల జ్ఞాన అవగాహననూ, జ్ఞానాన్ని వినియోగించే సామర్థ్యాన్ని సమగ్రంగా నిరంతరం మూల్యాంకనం చేయడం.
* ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేంతవరకు ఏ పిల్ల (వాడు) ఎలాంటి బోర్డు పరీక్షకు హాజరు కావలసిన అవసరం లేదు.
* ఎలిమెంటరీ విద్య పూర్తిచేసే ప్రతి పిల్ల (వాని) కి ఒక ధృవపత్రాన్ని అందజేయడం.

భారత రాజ్యాంగంలోని 73, 74 సవరణలలోని స్థానిక సంస్థలు – పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, జాతీయ విజ్ఞాన కమీషన్ ప్రతిపాదనలైన పాఠశాలల నిర్వహణ, పాఠశాల విద్యాశాఖ పరిపాలనలో జవాబుదారీ తనం పెంచడం, గుణాత్మకత పెంపుదలపై మానిటరింగ్, పాఠశాల కార్యకలాపాలపై సామాజిక తనిఖీ, ఉపాధ్యాయవిద్య–జాతీయ విద్యా ప్రణాళికా పరిధి పత్రం –2010లోని వృత్తిపూర్వ –వృత్యంతర ఉపాధ్యాయుల వృత్తిపర అభివృద్ధి వ్యూహాలు, విద్యా ప్రణాళికల అమలుపై పరిశోధనలు, మూల్యాంకనంపై అధ్యయనాలకు ప్రాధాన్యత కల్పించడం, వృత్తిపర, నైతికత, ఉపాధ్యాయుని తయారీ లాంటి అంశాలను కూడా పరిగణనలోనికి తీసుకోవడం జరిగింది.

### 3. రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం – 2011 :

2011 సంవత్సరానికి ముందు మన రాష్ట్రంలో రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం లేదు. జాతీయ విద్యా ప్రణాళికా చట్రం ఆధారంగానే మనం పాఠ్యపుస్తకాలను తయారు చేసుకునే వాళ్ళం. అయితే మొదటిసారిగా రాష్ట్ర విద్యాపరిశోధనా శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో వివిధ ఫోకస్ గ్రూప్‌ల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం 2011ను రూపొందించడం జరిగింది.

**APSCF-2011 లోని కీలకాంశాలు :**

* పిల్లల అభ్యసనాశక్తులపై దృష్టి కేంద్రీకరించడం.
* పాఠశాలకు పిల్ల(వాడు) వచ్చేటప్పటికీ కలిగి ఉన్న భాష మొదలైన పరిజ్ఞానాన్ని గౌరవించడం.
* బడి బయటి ప్రపంచానికి జ్ఞానాన్ని అనుసంధానం చేయడం. పాఠశాలలో నేర్చుకునే విద్యతో తమ జీవితానికి ఎటువంటి సంబంధం లేదు అని విద్యార్థులు అనుకునేలా ఉండకూడదు.
* బట్టీపద్ధతులకు దూరంగా అభ్యసన ఉండాలి. ప్రతి చర్యలతో కూడిన అభ్యసనానికి ప్రాజెక్టు పనులకు, విశ్లేషణకు ప్రాధాన్యత ఇవ్వడం.
* పాఠ్యపుస్తక కేంద్రంగా కాకుండా, పిల్లల్లో సమగ్రాభివృద్ధికి దోహదపడేలా విద్యాప్రణాళికను పరిపుష్టిచేయడం.
* పరీక్షలను సరళీకృతం చేసి తరగతి గదికి అన్వయించడం. 'అభ్యసనను మాపనం చేయడం' కాకుండా 'అభ్యసన కోసం మాపనం చేయడం' పై దృష్టిపెట్టడం.
* సామాజిక నిర్మాణాత్మక వాదం (Social Constructivism), అంశాలవారి పాఠ్యప్రణాళికను (Issue based curriculum), పాఠ్యాంశాల్లో విమర్శనాత్మక బోధనను (Critical Pedagogy) వృద్ధి పరచాలి.
* పాఠ్యప్రణాళికలో భాగంగా వృక్ష, జంతుజలాన్ని పరీక్షించడం, జీవ వైవిధ్యతను, సాంఘిక భిన్నత్వాన్ని, పనిని గౌరవించడం.
* పిల్లల భాష, సంస్కృతులను తరగతి గది ఆచరణల్లో భాగం చేయడం.

పైన పేర్కొన్నవాటి నుండి మౌలిక సూత్రాలను పరిగణనలోకి తీసుకొని సబ్జెక్టులు, సహపాఠ్య అంశాలకు గాను రాష్ట్ర విద్యాపరిశోధనా శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో 18 ఆధార పత్రాలను రూపొందించారు. ఈ 18 ఆధార పత్రాలలోని విద్యా విషయక ఆధారపత్రాలలో 5వది సాంఘిక శాస్త్ర ఆధారపత్రం.

NCF – 2005, RTE - 2009, APSCF - 2011 ప్రకారం రూపొందించిన సాంఘిక శాస్త్ర ఆధారపత్రంలో మారుతున్న సమాజం – సాంఘిక శాస్త్రం బోధన, సాంఘిక శాస్త్ర విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాలు విశ్లేషణ, స్వభావం, బోధన –సమ్మిళిత విధానం, బోధనా లక్ష్యాలు, ఇతర సబ్జెక్టులతో సంబంధం, బోధన విధానాలు – మూల్యాంకనం, ఉపాధ్యాయుల సంసిద్ధత పేర్కొనబడ్డాయి. వీటి గురించి వివరంగా తెలుసుకుందాం.

## 4. సాంఘిక శాస్త్ర ఆధారపత్రం :

సాంఘికశాస్త్ర ఆధారపత్రంను జాతీయ విద్యా ప్రణాళిక చట్రం – 2005, సిలబస్, దీని ఆధారంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలు, జాతీయ విద్యా ప్రణాళిక చట్రం ఉపాధ్యాయ విద్య – 2010, పిల్లల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం – 2009 ప్రతిపాదనల ఆధారంగా రూపొందించారు. ఈ ఆధార పత్రంలో తొమ్మిది అధ్యాయాలు, రెండు అనుబంధాలు ఉన్నాయి.

ఒకటో అధ్యాయంలో మారుతున్న సమాజం నేపథ్యంలో సాంఘిక శాస్త్రాల అధ్యయనం, ఆవశ్యకత, దాని పరిధిని చర్చించారు. శాస్త్ర సాంకేతిక రంగాలలోని మార్పులు, ప్రపంచీకరణ పరిస్థితులు, ఎదురవుతున్న సవాళ్ళ గురించి ప్రస్తావించారు. సవాళ్ళను ఎదుర్కోవడానికి విద్య ఒక కీలక సాధనంగా 'ఉపకరించే' విధానం గురించి, పిల్లలు తమ జీవిత అనుభవాల ద్వారా అర్థం చేసుకునే తీరు గురించి, అవసరమైన సామాజిక విశ్లేషణ నైపుణ్యాల పెంపుదల ఆవశ్యకతను గురించి చర్చించారు. మన రాష్ట్రంలోని భౌగోళికంగా, సాంస్కృతికంగా, ప్రాంతీయంగా ఉన్న వైవిధ్యాల నేపథ్యంలో విద్యాప్రణాళిక రూపకర్తలు ప్రాంతీయ అంశాలకు ప్రాధాన్యం ఇస్తూనే సమగ్రమైన, విస్తృతమైన లక్ష్య సాధన దిశగా సాంఘికశాస్త్రం ఎదగాల్సిన ఆవశ్యకతను చర్చించారు.

రెండో అధ్యాయంలో సాంఘిక శాస్త్ర ప్రస్తుత విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాల విశ్లేషణ గురించి విశ్లేషించారు. యశ్‌పాల్ కమిటీ పాఠ్యపుస్తకాలను వివరణాత్మక సమాచారంతో నింపడానికి బదులు సామాజిక, రాజకీయ సత్యాలను విశ్లేషించడంలో పిల్లల సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలని చేసిన ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నారు. చాలాకాలంగా సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పనలో విశేష కృషి జరుగుతున్నప్పటికీ ఇవి సమాజంలోని కుల, మత, లింగ వివక్షత రూపుమాపడాన్ని, సమాజాన్ని పిల్లలు విమర్శనాత్మకంగా అర్థం చేసుకోవడాన్ని సాధించలేక పోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తకాలు, మూల్యాంకన విధానాలను పూర్తిగా సంస్కరించాల్సిన అవసరం ఉందని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల తయారీ ఉండాలని, మూల్యాంకన విధానాలు మారాలని, పాఠశాలలో తగినన్ని వనరులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

మూడో అధ్యాయంలో సాంఘికశాస్త్ర స్వభావం గురించి చర్చించారు. సాంఘికశాస్త్రం వివిధ సబ్జెక్టులతో ఏర్పాటయింది. అయితే ప్రతి సబ్జెక్టు దానికి చెందిన ప్రత్యేకమైన పద్ధతులను దృక్పథాలను కలిగి ఉన్నప్పటికీ వాటిని గౌరవిస్తూనే వివిధ సబ్జెక్టుల మధ్య అంతర్గత సంబంధం ఉండే వినియోగ విధానాన్ని ప్రోత్సహిస్తూ వివిధ అంశాలు రూపొందించాలని సూచించారు. సాంఘికశాస్త్ర అధ్యయనం పరిమాణాత్మక, గుణాత్మక విధానాలతో కూడి ఉంటుందని సాంఘికశాస్త్రాల బోధనలో ఇది అంతర్భాగం కావాలని తెలిపారు. సాంఘిక శాస్త్రాలు మూసతత్వాన్ని, ఒకే రకంగా ఉండడాన్ని తరతరాలుగా ప్రోత్సహించింది. ఈ మూస విధానాలను విడనాడి విశాల దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. ఏ విషయాన్నైనా బహుళ దృష్టి కోణాల్లో చూడాలేతప్ప ఒకే దృష్టితో చూడరాదని పేర్కొన్నారు. సాంఘికశాస్త్ర అంశాలను లోతుగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకతను తెలిపారు.

చరిత్ర, భూగోళశాస్త్రం, సామాజిక రాజకీయ జీవనం, మొదలగు సబ్జెక్టులు పాఠశాల స్థాయిలో సమ్మిళిత విధానంలో అంతర్గత సంబంధాలను కలిగి ఉండే రీతిలో అభ్యసించినప్పటికీ హయ్యర్ సెకండరీ స్థాయిలో వీటిని వేర్వేరుగా అధ్యయనం చేయవచ్చని సూచించారు.

నాలుగో అధ్యాయంలో సాంఘికశాస్త్రాల బోధన, సమ్మిళిత విధానం గురించి చర్చించారు. ఈ విధానాన్ని 8వ తరగతి వరకు కొనసాగించవచ్చని, 9వ తరగతి ఆ పైనుండి విభాగాల వారీగా అధ్యయనం చేయవచ్చని తెలిపారు.

ఐదో అధ్యాయం సాంఘికశాస్త్ర బోధన, దానికి చెందిన విస్తృత లక్ష్యాల గురించి చర్చించింది. ప్రధానంగా సమాజాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి వీలుగా సామాజిక నేపథ్యంలో కారణాలు చెప్పడం, కారణాలు అన్వేషించే నైపుణ్యాలు పెంపొందించడం, తక్షణ సామాజికాభివృద్ధి అంశాలను ప్రపంచపు పోకడలతో అన్వయించడం, విభిన్నకోణాలలో అర్థంచేసుకోవడం, సమాచార నైపుణ్యాలు పెంపొందించడం, సామాజిక రాజ్యాంగ విలువలతో మమేకమవడం వంటి విస్తృత లక్ష్యాలు సాధించాలని సూచించారు.

ఆరో అధ్యాయంలో సాంఘిక శాస్త్రానికి ఇతర సబ్జెక్టులతో గల సంబంధాన్ని చర్చిస్తూ, భాషా నైపుణ్యాలు అట్లే గణితం, విజ్ఞానశాస్త్రాలతో గల సంబంధాలను పేర్కొన్నారు.

ఏడో అధ్యాయంలో సాంఘికశాస్త్ర బోధన విధానాల గురించి తెలిపారు. సాంఘికశాస్త్ర బోధన పాఠ్యపుస్తకాల్లోని సమాచారాన్ని అందించడానికి, బట్టీ విధానాలకు పరిమితం కాకుండా జ్ఞాన నిర్మాణానికి దోహదపడాలని సూచించారు. ఈ క్రమంలో నిర్మాణాత్మక అభ్యసనానికి గల ప్రత్యేక స్థానం గురించి ప్రస్తావిస్తూ పిల్లలు మేధోపరమైన కృత్యాలలో పాల్గొనాలని, తమ అనుభవాలను పంచుకోవాలని, వీటిని నిత్య జీవితంలో అన్వయించాలని తెలిపారు. బోధనావిధానాలు, సమ్మిళిత విద్య, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. బోధన పాఠ్యపుస్తకాల పరిధిని దాటి పిల్లలకు సవాలు విసిరే వైవిధ్యమైన వనరులను సూచించాలని తెలిపారు. బోధనావ్యూహాలలో బహుభాషా నేపథ్యంలో ప్రధానంగా పిల్లల భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఎనిమిదో అధ్యాయంలో RTE - 2009 ప్రతిపాదించిన విధంగా మూల్యాంకనం నిరంతరం సమగ్రంగా జరగాలని తెలిపారు. సెకండరీ స్థాయిలో పుస్తకాధారిత పరీక్షలు ప్రవేశపెట్టాలని సూచించారు.

చివరి అధ్యాయం ఉపాధ్యాయ విద్య గురించి, ఉపాధ్యాయ తయారీలో చోటుచేసుకోవాల్సిన అంశాల గురించి ప్రస్తావించారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలు పెంపొందించడానికి సబ్జెక్టు ఫోరంలు ఏర్పాటు చేయాలని, వారి సామర్థ్యాలను అభివృద్ధి పరచాలని స్పష్టంగా తెలిపారు.

ఆధునిక సాంకేతిక ప్రంపంచీకరణ నేపథ్యంలో ఎదురవుతున్న సవాళ్లను అధికమించేలా సమగ్రమైన, విశాలమైన బహాళ దృక్పథాన్ని పిల్లలలో పెంపొందింప చేయడానికి రాజ్యాంగ, మానవతా విలువలు కలిగిన వారుగా పిల్లలు ఎదగడానికి సాంఘికశాస్త్ర విద్యాప్రణాళికకు ఈ ఆధారపత్రం ఒక నూతన దృక్పథాన్ని అందిస్తుంది.

నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పనలో NCF – 2005, RTE - 2009, APSCF - 2011, సాంఘిక శాస్త్ర ఆధారపత్రాలను పరిగణనలోనికి తీసుకున్నారు.

**నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పనలో అనుసరించిన ప్రత్యేక విధానాలు :**

* సమ్మిళిత విధానం
* నిత్యజీవిత అనుభవాలకు, పాఠ్యాంశాలకు అనుసంధానం
* బట్టీ విధానానికి దూరం – అర్థవంతమైన అభ్యసనానికి అనుకూలం.
* ఉపాధ్యాయులు – విద్యార్థుల మధ్య చర్చ.
* విద్యార్థులు ప్రశ్నించుట
* విద్యార్థులు సొంతగా చదివి, విషయాలను అర్థం చేసుకోవడం.
* స్వీయ మూల్యాంకనానికి అవకాశం
* ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులే నిర్వహించేటట్లుగా ప్రయోగాలు, ప్రాజెక్టులు ఇవ్వడం.
* సొంతంగా మరింత అభ్యసనం కొరకు లక్ష్యాలు నిర్దేశించడం.
* పాఠ్యాంశాలను సులభంగా అర్థంచేసుకొనే విధంగా తీర్చిదిద్దడం
* ఇతర సబ్జెక్టులతో అనుసంధానం
* నిరంతర సమగ్ర మూల్యాంకనం

**సమ్మిళిత విధానం :**

భౌగోళిక ప్రాంతాల విస్తృతిని గుర్తించడం, వివిధ రకాల పటాలుగీసి వివరించడం, పటాలను చదవడం లాంటి నైపుణ్యాలు భూగోళశాస్త్ర విద్య అందిస్తుంది. పటాలను కేవలం భౌగోళిక సమాచారం ఇచ్చేసాధనాలుగానే గాక సామాజిక సందర్భాలలో చారిత్రక పటాలు గీయటంలో కూడా ఉపయోగించగలగాలి.

చరిత్ర బోధనలో స్థానిక, ప్రాంతీయ, ఉపఖండ, ప్రపంచ విషయాల మధ్య సమతుల్యతను పాటించాలి. విద్యార్థులు సామాజిక పరిస్థితులను, చరిత్రను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలి. ఇవి వివిధ సామాజిక శ్రేణుల, సంస్కృతి, శాస్త్ర సాంకేతిక, జానపదాల, రాజనీతి, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల వంటి వాటి చర్చకు దోహదం చేయాలి.

భావి పౌరులుగా కాబోయే బడిపిల్లలకు తాముజీవించే ప్రపంచ సామాజిక, ఆర్థిక , రాజకీయ విషయాలను అందజేయడం సాపేక్షంగా విద్యాప్రణాళిక భావన. ఈ ప్రణాళికలో సామాజిక శాస్త్రం, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రాలు కలిసి ఉంటాయి.

సామాజిక శాస్త్రాలు అనేక విభాగాలుగా ఉన్నాయి. ఒక విభాగంతో మరొక విభాగం అంత: సంబంధాన్ని కల్గి ఉంది. అందువల్ల ఈ సంబంధాలను గుర్తెరిగి మనం సమన్వయాన్ని పాటించడం జరిగింది.

ఒక విభాగం బహుళ విభాగాలతో సంబంధం కల్గి ఉన్నందున ఉపాధ్యాయుడు కుటుంబం, వ్యవసాయం, చరిత్ర , భూగోళం వంటి విభిన్న అంశాలను భోధించేటప్పుడు ఆయాకాలాల సమకాలీనతలను తెలుసుకోవాలి. గతంలో వ్యవసాయం, పరిశ్రమలు, జనాభా పాఠాలను భూగోళ శాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ చర్చించేవారు. అదే విధంగా పరిపాలన సంబంధ వ్యవహారాలు, చట్టం, న్యాయం, సంస్కృతి, కళలువంటి అంశాలను చరిత్ర, పౌరశాస్త్రం లోనూ చర్చించేవారు కొన్నిసార్లు ఒకే పాఠ్యాంశం రెండు సామాజిక శాస్త్రాలలోను చెప్పబడేది. కాని నూతన పాఠ్యపుస్తకాల తయారీలో పదే పదే అదే పాఠ్యాంశాన్ని రెండింటిలో చర్చించే వీలులేకుండా సమ్మిళిత విధానాన్ని అనుసరించారు.

ఎందువలనఅంటే భౌతికశాస్త్రంలోని అంశాలకు, ఆర్థిక శాస్త్రంలోని అంశాలకు చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. అలానే చరిత్ర, రాజనీతిశాస్త్ర అంశాలకు కూడా అదేవిధమైన దగ్గరి సంబంధం ఉంటుంది. అందువల్ల 6 నుండి 8 వ తరగతి సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాలలో విభాగాలుగా పాఠ్యాంశాలను రూపొందించలేదు. తద్వారా ఒక పాఠం ఏ శాస్త్ర పరిధిలోకి వస్తుందనే దాని కంటే పాఠ్యాంశాలలోని అన్ని విషయాలను కూలంకషంగా తెలుసుకునే విధంగా సమ్మిళిత విధానంలో రూపొందించబడ్డాయి.

భూగోళశాస్త్రం, చరిత్ర, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం విడివిడిగా కాకుండా సమ్మిళితంగా పాఠ్యాంశాలను రూపొందించారు. సమ్మిళితవిధానం రెండు రకాలుగా కనిపిస్తుంది.

మొదటిది ఏదైనా ఒక ప్రాంతం గురించి తెలియజేసేటప్పుడు ఆ ప్రాంతపు భౌగోళిక పరిజ్ఞానం, చారిత్రక విషయాలు, పరిపాలనా సంబంధ వ్యవహారాలు, ఆర్థిక పరమైన విషయాలు చర్చించడం.

రెండోది ఒక పాఠ్యాంశంలో నాలుగు భాగాలకు సంబంధించిన విషయాన్ని కలిపి ఒకేసారి చెప్పడం.

ఉదా: - 8వ తరగతి పాఠ్యపుస్తకంలో 4వ పాఠం. ధృవప్రాంతాలు. ఈ పాఠాన్ని పరిశీలిస్తే భౌగోళిక అంశాలైన టండ్రాలో కాలాలు, వేసవి, వృక్షజాలం, సమాజ శాస్త్ర అంశాలైన టండ్రాప్రాంత ప్రజలు, సామూహిక జీవనం, మతపరమైన నమ్మకాలు, ఆర్థిక అంశాలైన వేట, చేపలు పట్టడం, రాజనీతి అంశాలైన బయటి ప్రపంచంతో సంబంధాలు, సాంస్కృతిక అంశాలైన బట్టలు, కళలు అన్నింటికి సంబంధించిన వివరణలున్నాయి.

అంతేకాక పైన పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే ఇదీ ఫలానా సామాజిక శాస్త్రానికి చెందినదని చెప్పడం కూడా కష్టమే అవుతుంది. 6 నుండి 8 తరగతులలో 6 ఇతివృత్తాల ఆధారంగా పాఠాల రూపకల్పన జరిగింది. 9,10 తరగతి పాఠాల రూపకల్పనకు అంశాల పద్ధతిని ఉపయోగించడం జరిగింది.

# సాంఘిక శాస్త్రం - 6 నుండి 8 తరగతుల ఇతివృత్తాలు

| క్ర.స. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| 1. | భూమి–వైవిధ్యం | అ) ప్రపంచవ్యాప్త వైవిధ్యాలను కింది అంశాల ఆధారంగా తెలుసుకొనుట<br>– శీతోష్ణస్థితి మండలాలు<br>– భూ స్వరూపాలలో విభిన్నతలు<br>– అభివృద్ధి చెందే మండలాలు<br>ఆ) ప్రకృతి అంశాల మధ్యన ఉండే సంబంధాలను అర్థం చేసుకొనుట<br>ఇ) మానవ సమాజాలు ఈ విభిన్నతలను ఉపయోగించుకుని మార్పు చెందిన క్రమాన్ని అర్థం చేసుకొనుట<br>ఈ) పటాన్ని చదివి అర్థం చేసుకోవడం, అన్వయించుకోవడం మొదలైన పట నైపుణ్యాలను పెంచుకొనుట<br>ఉ) పోల్చడం, చిత్రాలను, సంభాషణలను చదివి అర్థంచేసుకోవడం మొదలైన నైపుణ్యాలను పెంచుకొనుట |
| 2. | ఉత్పత్తి, వినిమయం మరియు జీవనాధారాలు | అ) వివిధ ఉత్పత్తులను, జీవనాధారాలను అవగాహన చేసుకొనుట<br>ఆ) ఉత్పత్తులు మరియు జీవనాధారాలపై జాతీయకరణ, ప్రత్యేకీకరణ, భూస్వామ్య విధానం, పారిశ్రామికీకరణ, వలస విధానం, ప్రపంచీకరణల ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట<br>ఇ) అనాదిగా అభివృద్ధిలో శ్రామికుల పాత్రను ప్రశంసించుట<br>ఈ) వినిమయము మరియు మారక ప్రక్రియలను మరియు సంస్థలను అర్థంచేసుకొనుట<br>ఉ) ఛార్టులు, రేఖాచిత్రాలు, పట్టికలను చదువుట, మార్పులను అర్థం చేసుకొనుట మొదలైన నైపుణ్యాలను పెంపొందించుకొనుట.<br>ఊ) నటన ద్వారా, చిత్రాలను గీయడంద్వారా, మట్టితో నమూనాలను తయారు చేయడం ద్వారా అవగాహనను వ్యక్త పరచుట |

| క్ర.స. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| 3. | రాజకీయ వ్యవస్థలు –పరిపాలన | అ) చారిత్రకంగా వృద్ధి చెందుతూ వస్తున్న రాజకీయ సంస్థలు, నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజల పాత్రలను అర్థం చేసుకొనుట<br>ఆ) ఆచరణలో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రజాస్వామిక పరిపాలనా సూత్రాలను అర్థం చేసుకొనుట<br>ఇ) నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ప్రజాస్వామిక సంస్థలు పని చేస్తున్నాయా లేదా అనే విషయాన్ని అంచనా వేయుట.<br>ఈ) సర్వే మరియు ఇంటర్వ్యూలను నిర్వహించుట, పోల్చుట, సామాజిక అనుభవాల వినియోగము మొదలైన నైపుణ్యాలను అభ్యాసము చేయుట<br>ఉ)) చారిత్రక వనరుల అన్వయము మరియు వార్తాపత్రికల ద్వారా అనాదిగా వస్తున్న మార్పుల గుర్తింపు మరియు వివరించగలిగే నైపుణ్యాలను పెంచుకొనుట. |
| | 4. సామాజిక వ్యవస్థీరణ మరియు అసమానతలు | అ) సామాజిక మరియు సాంస్కృతిక వైవిధ్యాలను అర్థం చేసుకొనుట మరియు ప్రశంసించుట<br>ఆ) లింగ, కుల వర్గ, సామాజిక, ప్రాంతాల ఆధారంగా చూపబడే వివిధ రూపాల అసమానతలు, వివక్ష మరియు సామాజిక బహిష్కరణలను అర్థంచేసుకొనుట<br>ఇ) సమాజాన్ని ఒకటిగా, సమన్యాయంతో ఉండే విధంగా దృక్కోణాన్ని ఏర్పరచుకొనుట<br>ఈ) సామాజిక ఆదర్శాలు, నీతికి సంబంధించిన విషయాలను అవగాహన చేసుకొనుట<br>ఉ) అల్ప సంఖ్యాక, అల్పాదాయ సమాజాల మరియు వర్గాల అభివృద్ధిని ప్రభావితం చేస్తున్న అంశాల గురించి అవగాహనచేసుకొనుట<br>ఊ) అణగారిన, అల్పాదాయ, సమాజానికి దూరంగా ఉంచబడిన వర్గాల రక్షణ కోసం చేపట్టిన చర్యలను, వాటి ప్రభావాన్ని అంచనా వేయుట<br>ఋ) సర్వేను, ఇంటర్వ్యూలను చేపట్టుట, వార్తాపత్రికలలో వచ్చిన సమాచారాన్ని సేకరించుట, ముఖ్యపత్రాలలోని అంశాలను అవగాహన చేసుకొనుట మొదలైన నైపుణ్యాలను అభ్యాసం చేయుట |

| క్ర.స. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| | 5. మతం–సమాజం | అ) వివిధ మతాల విశ్వాసాలు, అలవాట్లు, ఆచరణలలోని విభిన్నతలను ప్రశంసించుట<br>ఆ) మతాచారాలు మరియు ఆదర్శాలను అర్థం చేసుకొనుట –అనాదిగా వస్తున్న సామాజిక మార్పులకు అనుగుణంగా వివిధ మతాచారాలలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొనుట<br>ఇ) మతాలు వివిధ ఆలోచనలను ఇచ్చి పుచ్చుకుంటాయని, వాటిని ఆచరించే ప్రజలు వివిధ మతాల విశ్వాసాలను తమ జీవనంలో భాగంగా మలచుకుంటారని అవగాహన చేసుకొనుట<br>ఈ) వివిధ మతాల మధ్య గొడవలు రావడానికి కారణాలను, ప్రస్తుత కాలంలో మత తత్వవాదం ఏర్పడిన విధానాన్ని అవగాహన చేసుకొనుట |
| | 6. సంస్కృతి– సమాచారం | అ) భారతదేశ సంస్కృతి లోని విభిన్నతలు, గొప్పతనాన్ని ప్రశంసించుట<br>ఆ) జానపద, సాంప్రదాయ, ప్రాంతీయ సంస్కృతులు మరియు ఉపఖండేతర సంస్కృతుల ప్రభావంతో అనాదిగా భారతీయ సంస్కృతి వృద్ధి చెందడాన్ని అవగాహన చేసుకొనుట<br>ఇ) సంస్కృతీ ఆవిర్భావం మరియు సంస్కృతిలో వచ్చే మార్పులను అర్థంచేసుకొనుట, సామాజిక, రాజకీయ పరిస్థితుల ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట<br>ఈ) కళల పోషణ వలన కళలపై కలిగే ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట<br>ఉ) స్థానిక కళలు, కట్టడాల సంస్కృతిని, నిర్మాణాన్ని అధ్యయనం చేయుట<br>ఊ) చిత్రాలు చదివి అర్థం చేసుకొనుట, పోల్చుట, సామాజిక అనుభవాలను వినియోగించుట మొదలైన నైపుణ్యాలను అభ్యసించుట |

పై పట్టిక 6 నుండి 8 తరగతుల సాంఘిక శాస్త్ర సిలబస్‌ను తెలుపుతుంది. మొత్తం సిలబస్‌ను 6 ఇతివృత్తాలుగా (Themes) విభజించటం మీరు పరిశీలించి వుంటారు. NCF-2005, APSCF - 2011 లు సాంఘిక శాస్త్ర విషయంలో తెలిపిన అంశాల ఆధారంగా పై ఆరు ఇతి వృత్తాలను ఎన్నుకోవటం జరిగింది.

- **నిత్యజీవిత అనుభవాలకు అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన :**

విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమాజంలోని నిజజీవిత అంశాల ఆధారంగా పాఠ్యాంశాలున్నాయి. పిల్లలలో ఉన్న ఆయా అంశాల పూర్వ భావనలను మరింత బలోపేతం చేస్తూ వాటికి సంబంధించిన తరగతి స్థాయి అంశాలను పాఠ్యాంశాలుగా ఇవ్వడం జరిగింది. పిల్లలు బడికిరాకముందే సమాజంలోని అనేక అంశాలపై అవగాహన కలిగి ఉంటారు. వారికి సమాజంలోని వివిధ జ్ఞాన వ్యవస్థలపై అవగాహన ఉంటుంది.

ఉదా:- 8వ తరగతిలో ద్రవ్యం – బ్యాంకింగ్ పాఠంలోని స్వయం సహాయక సంఘాలు, ప్రజారోగ్యం – ప్రభుత్వంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో జరిగే కార్యాకలాపాలను పాఠ్యాంశాలకు అనుసంధానం చేసి విద్యార్థి సరిచూస్తాడు.

9వ తరగతిలోని భారతదేశ వ్యవసాయం పాఠంలోని వివిధరకాల పంటలలో తమ ప్రాంతాలలో పండే పంటలను, ధరలు–జీవనవ్యయం అనే పాఠంలో వారి వారి కుటుంబ బడ్జెట్‌ను తరగతిగదిలో చదివిన పాఠ్యాంశాలకు అనుసంధానం చేసే విధంగా రూపొందించబడ్డాయి.

- **బట్టీ విధానానికి దూరం–అర్థవంతమైన అభ్యసనానికి అనుకూలం :**

బట్టీ విధానాలకు అతీతంగా అర్థవంతమైన అభ్యసనాన్ని చేకూర్చేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఇవ్వబడ్డాయి. పాఠ్యాంశాలలోని ప్రశ్నలు ఆలోచింపజేసేవిగా, బట్టీ పట్టడానికి అవకాశం లేకుండా అర్థం చేసుకున్న పాఠ్యాంశాన్ని నిత్యజీవిత అనుభవాలకు అనుసంధానం చేసేటట్లుగా ఉన్నాయి. పాఠం చివరలో ఇచ్చిన "మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి" లోని అంశాలకు పాఠంలో నేరుగా జవాబులు ఉండవు. ఒకే ప్రశ్నకు విద్యార్థులు విభిన్న సమాధానాలు పేర్కొనే వీలుంది. వారి స్వీయ అనుభవాలద్వారా ఇవ్వబడిన కృత్యాలు, ప్రాజెక్టులను పూర్తిచేసే అవకాశం ఉంది.

ఉదా: 8వ తరగతిలోని సాంఘిక, మత సంస్కరణోద్యమాలు పాఠంలో "మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి" లోని రెండవ ప్రశ్నను పరిశీలిద్దాం.

సంస్కరణ ఉద్యమం బలోపేతం కావడంలో ముద్రణాయంత్రం ప్రాముఖ్యత ఏమిటి?

ఈ ప్రశ్కకు విద్యార్థులు సాంఘిక, మత సంస్కరణోద్యమాలు పాఠం మొదటి పేజీలోని బాక్స్‌లో వున్న సమాచారాన్ని చదివి సాంఘిక, మత సంస్కరణోద్యమాలకు మధ్యగల సంబంధాన్ని విశ్లేషించుకొని సమాధానాన్ని తెలపాల్సి ఉంటుంది. ఈ సమాధానం కూడ ప్రతి విద్యార్థికి వేరువేరుగా ఉండే అవకాశం ఉంది.

9వ తరగతి లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికాలలో వలసవాదం అనే పాఠంలో 3వ ప్రశ్న" వలస ప్రాంతాలుగా మార్చటంలో వ్యాపారం పోషించిన పాత్ర ఏమిటి?

ఈ ప్రశ్నకు విద్యార్థి జవాబును చెప్పాలంటే పాఠం అంతాచదివి అర్థంచేసుకుంటేనే గాని చెప్పలేడు. ఇలా ప్రతి ప్రశ్న ప్రతి పని, ప్రాజెక్టులు, కృత్యాలు, విద్యార్థి బట్టీపట్టి పాఠంలో ఉన్నదున్నట్టు చెప్పడానికి, రాయడానికి వీలులేకుండా రూపొందించబడ్డాయి. ఈ విధంగా విద్యార్థిని బట్టీ విధానం నుండి దూరం చేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులను అర్థవంతమైన అభ్యసనానికి దగ్గర చేసింది.

- **ఉపాధ్యాయులు - విద్యార్థుల మధ్య చర్చకు అవకాశం :**

ప్రతిపాఠం ప్రారంభంలో, మధ్యలో అనేక చిత్రాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు ఉన్నాయి. ఈ అంశాలపై చర్చజరగాలి. పిల్లలు ఆలోచించేటట్లు ఉపాధ్యాయులు ప్రశ్నించడం, విద్యార్థులు తమ అనుభవాలు పంచుకోవడం, విద్యార్థులమధ్య చర్చ జరగాలి.

ఉదా: 1. 8వ తరగతి ఖనిజాలు –గనులు తవ్వకం పాఠంలోని 6.1, 6.2, 6.3, చిత్రాలపై చర్చలను నిర్వహించుట.

2. 9వ తరగతి భారతదేశంలో సేవా కార్యకలాపాలు పాఠంలోని కేస్‌స్టడీ–2 తర్వాత బాక్స్‌లో ఇచ్చిన ఒక ప్రశ్నను పరిశీలిద్దాం.

* కొత్త వైద్య విద్యా సంస్థలను ప్రభుత్వరంగంలో నెలకొల్పవచ్చా లేక ప్రైవేట్ రంగంలోనా? ఎందుకు?

3. 8వ తరగతి హక్కులు–అభివృద్ధి పాఠంలోని ప్రశ్న "ఒక రోడ్డు లేదా ఇళ్ళ నిర్మాణానికి సంబంధించిన సమాచారాన్ని గుత్తేదారులు ఎలా నిర్వహిస్తున్నారో చర్చించండి?"

- **విద్యార్థులు ప్రశ్నించగలగాలి :**

పాఠ్య పుస్తకంలోని వివిధ అంశాలు అభ్యసించేందుకు ఉపాధ్యాయులు చెబితే వినడం కాకుండా విద్యార్థులు ప్రశ్నించి విషయాలు తెలుసుకోవాలి. బోధనాభ్యసన ప్రక్రియలో అన్ని సందర్భాలలో విద్యార్థులకు ప్రశ్నించే అవకాశాన్నిచ్చే రకంగా ఇవ్వబడింది.

ఉదా : * గనుల తవ్వకం వల్ల కలిగే లాభనష్టాలు తెలుసుకొనుటకు సంబంధిత వ్యక్తులను ఇంటర్వ్యూ చేయుటకు ప్రశ్నలు రూపొందించుట.

* బ్యాంకును సందర్శించే సమయంలో బ్యాంకు సిబ్బందిని బ్యాంకు పనితీరును అడిగి తెలుసుకొనుటకు ప్రశ్నలను రూపొందించుకొనుట.

- **విద్యార్థులు సొంతంగా చదివి విషయాలను అర్థం చేసుకోగలగడం :**

పాఠ్యపుస్తకాన్ని విద్యార్థులు సొంతంగా చదువుకొని విషయాలను అర్థం చేసుకునేట్లుగా వాడుకపదజాలంలో భాష, పాఠ్యాంశాలు, చిత్రాలు, ఉదాహరణలు, కృత్యాలు ఇవ్వబడ్డాయి. నిఘంటువులు, పదకోశాల అవసరం లేకుండా విద్యార్థులు అన్ని పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలరు.

ఉదా : సాంఘిక శాస్త్రం 9వ తరగతి 23వ పాఠం విపత్తుల నిర్వహణ, ఈ పాఠంలో మానవుల కారణంగా ఏర్పడే వైపరీత్యాలు, ప్రమాద సంబంధిత వైపరీత్యాలు, ట్రాఫిక్ నియమాలు తెలుసుకోవడం, రైలు, విమాన, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చేయవలసిన , చేయకూడని వాటిని తెలుసుకోవడం, చివరకు ఉగ్రవాదం ముప్పు గురించి కూడా విద్యార్థులు చిత్రాల ద్వారా , టేబుల్స్ ద్వారా సులభంగా సొంతంగా నేర్చుకునే రకంగా రూపొందించడం జరిగింది. ఇదే విధంగా ప్రతిపాఠంలోనూ ప్రశ్నలు, బాక్స్‌లు, గ్రాఫులు, టేబుల్స్, రంగు రంగుల చిత్రాలు, ఆలోచింపజేసే బొమ్మలు, కార్టూన్లు, కల్పిత కథలు, యదార్థ గాథలు, కేస్‌స్టడీలు, ప్రాజెక్టుల ద్వారా విద్యార్థి స్వీయ అభ్యసనాన్ని పెంపొందించే విధంగా పాఠ్యపుస్తకాలు రూపొందించబడ్డాయి.

- **స్వీయ మూల్యాంకనానికి అవకాశం :**

ఒక పాఠం పూర్తయ్యాక ఏఏ అంశాలలో విద్యార్థికి అవగాహన కలిగిందో సొంతంగా తెలుసుకొనుటకు వీలుగా ప్రతిపాఠం చివర స్వీయ మూల్యాంకన అంశాలు ఇవ్వబడ్డాయి. అదే విధంగా ఎప్పటికప్పుడు పాఠం మధ్యలోని ప్రశ్నలుకూడా విద్యార్థి తాను ఏ స్థాయిలో ఉన్నాడో తెలుసుకొనుటకు అవకాశం ఇచ్చునట్లుగా పాఠ్యాంశాలన్ని స్వీయ మూల్యాంకనానికి అనుకూలంగా ఉన్నాయి.

ఉదా:- 9వ తరగతి 9వ పాఠంలో నియత, అనియత రుణాలు : ఎవరు, ఏం పొందుతారు? అనే భావనను అధ్యయనం చేసి విద్యార్థులు సొంతంగా మూల్యాంకనం చేయగల్గుతారు.

- **ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులే నిర్వహించేటట్లుగా ప్రయోగాలు, ప్రాజెక్టులు :**

విద్యార్థులు సొంతంగా సామగ్రిని సేకరించుకొని, రూపొందించుకొని కృత్యాలు, ప్రయోగాలు, ప్రాజెక్టులు, పరిశోధనల వంటివి ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో నిర్వహించేటట్లుగా ఇవ్వబడ్డాయి. విద్యార్థులు ఉపాద్యాయ మార్గదర్శకత్వంలో నిర్వహించడం, నిర్వహించిన అంశాల పరిశీలనలపై చర్చించడం, తద్వారా అర్థవంతమైన అభ్యసనం జరుగునట్లుగా అన్ని పాఠ్యాంశాలున్నాయి.

ఉదా: 8వ తరగతిలోని 7వ పాఠం ద్రవ్యం - బ్యాంకింగ్ లో ఇవ్వబడిన ప్రాజెక్టు.

* బ్యాంకుకు వెళ్లండి లేదా బ్యాంకు అధికారిని మీ బడికి ఆహ్వానించి ఈ క్రింది విషయాలు తెలుసుకోండి.

17వ పాఠం పేదరికం - అవగాహనలో ఇవ్వబడిన ప్రాజెక్టు.

* మీ ప్రాంతంలోని చౌకధరల దుకాణాన్ని సందర్శించి ఈ దిగువ విషయాలు తెలుసుకోండి.

ఉదా 9వ తరగతి లోని 2వ పాఠం - భూమి - ఆవరణములు

* వివిధ వార్తా పత్రికలు, మ్యాగజైన్స్ ద్వారా భూకంపాలు, అగ్నిపర్వతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఒక క్రమంలో అమర్చండి. ఇవి ఏ విధంగా ఏర్పడతాయి ? మానవ జీవనాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?

* 12వ పాఠం – యూరప్‌లో మారుతున్న సాంస్కృతిక సంప్రదాయాలు (1300–1800) లో ఇచ్చిన పునరుజ్జీవనం కాలంనాటి ప్రముఖ కళాకారుల చిత్రాలను సేకరించి, వాటిని ఒక పుస్తకంలో అంటించండి.

- **సొంతంగా, మరింత అభ్యసనం కొరకు లక్ష్యాలు నిర్దేశించడం :**

పాఠ్యపుస్తకంలో ఇచ్చిన కృత్యాలు, చర్చనీయాంశాలు, క్షేత్ర సందర్శనలు, సమాచార సేకరణ, ప్రాజెక్టు పనుల వంటి వాటి ద్వారా పాఠ్యాంశాలకు సంబంధించి, సొంతంగా మరిన్ని అంశాలను తెలుసుకొనుటకు అవకాశం ఉండునట్లుగా పాఠ్యాంశాలున్నాయి. ఒక పాఠ్యాంశానికి సంబంధించి మరింత జ్ఞానం సొంతంగా పొందుటకు వీలుగా అన్ని పాఠ్యాంశాలున్నాయి.

ఉదా: 8వ తరగతి – ద్రవ్యం – బ్యాంకింగ్

* చెక్కుల ద్వారానే కాకుండా డ్రాఫ్టులు/ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా కూడా డబ్బులు బదిలీ చేయవచ్చు. ఆ వివరాలు తెలుసుకోండి.

9వ తరగతి – జీవావరణం

* అంతరించి పోతున్న అడవులను ఎలా సంరక్షించుకోవచ్చు.

- **పాఠ్యాంశాలను సులభంగా అర్థ చేసుకునే విధంగా తీర్చిదిద్దడం :**

పాఠ్యాంశాలలో ఇచ్చిన రంగురంగుల బొమ్మలు, చిత్రాలు, నిజజీవిత సన్నివేశాల నుండి సేకరించిన ఫోటోలు, ఉదాహరణలు, చిన్న చిన్న అభ్యాసాలు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవడానికి తోడ్పడుతాయి. అదే విధంగా, పాఠాల సంఖ్య, అక్షరాల పరిమాణం, పుస్తక పరిమాణం, నాణ్యత, పేజీలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, భాష, ముందు వెనుక పేజీలు, లోగోలు వంటివి అనేకం ఇందుకు దోహదపడతాయి.

ఉదా:– 8వ తరగతి

* పటాల అధ్యయనం పాఠంలోని చిత్రం 1.1 ఆఫ్రికా, యూరప్, అమెరికాలను చూపే ఫోటో.
* బ్రిటీష్ , నిజాంల పాలనలో భూస్వాములు, కౌలుదార్లు పాఠంలో కార్టూన్లు ఉపయోగించడం జరిగింది.
* భారత రాజ్యాంగం పాఠంలో ఇచ్చిన భారత ప్రభుత్వ చిహ్నం (లోగో).

9వ తరగతి

* ప్రజాస్వామిక జాతీయవాద విప్లవాలు –19వ శతాబ్దం పాఠంలో చిత్రం 14.1 ఆలోచనాపరుల బృందం.
* మానవ హక్కులు, ప్రాథమిక హక్కులు పాఠంలోని మానవహక్కుల లోగో, ఇదే పాఠంలోని బాలల హక్కులపై గోడపత్రిక.

భారతదేశంపై వలసవాద ప్రభావం పాఠంలోని చిత్రం (18.9) : 1931లో ఇంగ్లాండులోని లాంక్‌షైర్‌లో మిల్లు కార్మికులు గాంధీజీని కలిసి భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. (నిజ జీవిత సన్నివేశం)

- **ఇతర సబ్జెక్టులతో అనుసంధానం :**

భాష, గణితం, ఆరోగ్యం, పర్యావరణం వంటి అనేక సబ్జెక్టులతో పరిసరాలను అనుసంధానం చేస్తూ పాఠ్యాంశాలున్నాయి. ఏ పాఠం అయినా పరిపుష్టిం కావాలంటే ఇతర సబ్జెక్టులపై ఎంతో కొంత ఆధారపడక తప్పదు.

ఉదా: 8వ తరగతి

* సూర్యుడు – శక్తి వనరు అనే పాఠంలో ఉష్ణోగ్రతలను కొలవడం, నమోదుచేయడం, వీటి ఆధారంగా గ్రాఫులు తయారు చేయడంలో భౌతిక, గణిత శాస్త్ర సబ్జెక్టులతో అనుసంధానం అవసరమవుతుంది.

9వ తరగతి

* జీవావరణం పాఠంలోని అంశాలను బోధించుటకు జీవశాస్త్రంలోని అంశాలను తెలుసుకోవాల్సి ఉంటుంది.

- **పటనైపుణ్యాలను పెంపొందించడం – చిత్రాలను పరిశీలింపజేయడం :**

నూతన సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలోని పాఠ్యాంశాలు విద్యార్థులలో చక్కటి పటనైపుణ్యాలను పెంపొందించే విధంగా రూపొందించబడ్డాయి. గత పాఠ్యపుస్తకంలో మాదిరిగా కేవలం పటాలలో ప్రదేశాలను గుర్తించడమే కాకుండా, పటాలను తయారుచేయడం, పటాలను చదవడం వంటి విషయాలను కొత్తగా పరిచయం చేయడం జరిగింది.

ఉదా: 8వ తరగతి

* అడవులు – వినియోగం, సంరక్షణ (5వ పాఠం) 55వ పేజీలోని "అడవులు" పటాన్ని పరిశీలించండి. "ఆంధ్రప్రదేశ్ – అడవులు" పటాన్ని పరిశీలించి ఏ ఏ జిల్లాలలో / జిల్లాలలో అత్యధికంగా అడవులు ఉన్నాయో పేర్కొనండి.

9వ తరగతి

* యూరప్‌లో మారుతున్న సాంస్కృతిక సాంప్రదాయాలు 1300–1800 (12వ పాఠం) 155వ పేజీలోని ప్రపంచపటాన్ని చదవండి.

ప్రశ్న : సముద్ర మార్గాలలో జరిపిన వివిధ అన్వేషణల జాబితా తయారు చేయడి.

- **చిత్రాల ద్వారా కూడా పాఠాలలోని భావాలను మరింత సులభంగా అర్థం చేసుకునే రకంగా పాఠ్యాంశాలు రూపొందించారు:**

చిత్రాలు విద్యార్థులలో అవగాహనకు ఉపయోగపడటమే గాకుండా వారిలో నూతన ఆలోచనలు రేకెత్తించే రకంగా, సహజసామర్థ్యాలను వెలికితీసే రకంగా, సృజనాత్మకతను పెంపొందించే రకంగా రూపొందించబడ్డాయి.

ఉదా: 8వ తరగతి

* అడవుల–వినియోగం, సంరక్షణ (5వ పాఠం) 53వ పేజీలోని నాలుగు చిత్రాలను పరిశీలించి ఆ చిత్రాల ద్వారా పరిసరాలు – మానవుడికి మధ్య వున్న సంబంధాన్ని విద్యార్థులు విశ్లేషించుకుంటారు.

9వ తరగతి

* ప్రజాస్వామిక జాతీయవాద విప్లవాలు –19వ శతాబ్దం (14వ పాఠం) 180 పేజి నుండి బిస్మార్క్ చిత్రం.

ఈ వ్యంగ్యచిత్రాన్ని వివరించండి. బిస్మార్క్‌కీ, ఎన్నికైన పార్లమెంటు డిప్యూటీలకీ మధ్య సంబంధాన్ని ఇది ఎలా చూపిస్తోంది? ప్రజాస్వామిక ప్రక్రియల గురించి చిత్రకారుడు ఏం వ్యాఖ్యానించదలుచుకున్నాడు?

- **పిల్లల్లో ఊహాత్మకశక్తిని, ఆలోచించే నైపుణ్యాలను పెంపొందించే రకంగా రూపొందించబడ్డాయి :**

నూతన సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాలలో పిల్లలలో వివిధ సన్నివేశాలను, జరగబోయే పరిస్థితులను, ఫలితాలను ఊహించే రకంగా ప్రశ్నలు ఇవ్వబడ్డాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఉన్నత ఆలోచనలను పెంపొందించే రకంగా ప్రశ్నలు రూపొందించబడ్డాయి. పిల్లలలో సమైఖ్య ఆలోచన ప్రజ్ఞను , విభిన్న ఆలోచన వారిలో సృజనాత్మకతా శక్తిని పెంపొందిస్తాయి. ఇలా పిల్లలలో వివిధ రకాల ఆలోచనలను పెంపొందించే రకంగా పాఠ్యాంశాలు రూపొందించడం జరిగింది. 8,9వ తరగతులలో ఇవ్వబడిన కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం.

ఉదా: 8వ తరగతి

* కొత్త పాఠశాలలు, కళాశాలలను నెలకొల్పటానికి అనువైన ప్రాంతాన్ని ఎంచుకోవాలనుకుంటున్న వ్యక్తికి ఏఏ పటాలు అవసరమవుతాయి? జాబితా తయారు చేయండి? (8వపేజి)
* భూమిలేని కౌలు రైతుల స్థితిగతులను ఊహించి ఒక వ్యాసం రాయండి. (116 వ పేజి)
* ఉప్పు సత్యాగ్రహం తన ఉద్దేశాలలో ఏ మేరకు విజయవంతం అయ్యింది? మీ అంచనా ఏమిటి? (139 వ పేజి)
* రైతాంగ సమస్యలు పరిష్కరించడం ఒక్కటే తెలంగాణ సాయుధ పోరాట ఉద్దేశమా, ఇంకేమైనా ఉన్నాయా? (147వ పేజి)
* "దున్నేవానిదే భూమి" అన్న నినాదంతో కౌలుదారులకు భూమి లభిస్తుంది. మరి కూలికి పనిచేసే వ్యవసాయ కూలీల పరిస్థితి ఏమిటి? (185వ పేజి)
* ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరచడానికి మరికొన్ని సూచనలు చేయండి. (201 పేజి)
* బాలికల విద్య, సంఘసంస్కరణల మీద మీ అభిప్రాయాన్ని తెల్పండి. (222 పేజీ)
* క్రికెట్టు వాణిజ్య క్రీడగా మారటం వల్ల సంభవించిన పరిణామాలపై ఒక కరపత్రం తయారు చేయండి. (253వ పేజి)

9వ తరగతి

* చంద్రుడి మీద జీవనం ఎందుకు సాధ్యం కాదో ఊహించండి. (37వపేజి)
* అంతరించిపోతున్న అడవులను ఎలా సంరక్షించుకోవచ్చు? (58వ పేజి)
* నూలు వడకడం, ఖద్దరు నేయటానికి మహాత్మాగాంధీ ఎందుకు ప్రాధాన్యతనిచ్చారు? (78వ పేజి)

* వ్యాట్ వస్తువులపై పన్ను ఎగవేతను ఏ విధంగా తగ్గిస్తుంది? (142 పేజి)
* బైబిలును ముద్రించడం ద్వారా దేవుడు, చర్చిపై భావనలు ఎలా ప్రభావితం మయ్యాయి? (158వ పేజి)
* "సార్వజనీన హక్కుల ప్రకటన వైరుధ్యాలతో కూడుకుని ఉందన్న" అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా? వివరించండి? (170 వ పేజీ)
* బ్రిటీషు పారిశ్రామికీకరణను ప్రోత్సహించిన 18వ శతాబ్ధం నాటి బ్రిటన్, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల పరిణామాలను చర్చించండి (186వ పేజి)
* మన్రో సిద్ధాంతం లాటిన్ స్వాతంత్ర్యాన్ని ఏ విధంగా కాపాడింది? ఇది వాటి స్వాతంత్ర్యాన్ని పరిమితం కూడా చేసిందా? (210 వ పేజి)
* భారతదేశ వివిధ ప్రాంతాలలో ఆదివాసీల తిరుగుబాటులను తెలియజేసే కాల పట్టిక తయారు చేయండి. ఆదివాసీల తిరుగుబాటులు ఎక్కడెక్కడ జరిగాయో తెలుసుకొని ఆ ప్రదేశాలను భారతదేశ పటంలో గుర్తించండి.

- **నిరంతర సమగ్ర మూల్యాంకనానికి వీలుగా రూపొందించబడ్డాయి :**

పాఠం ప్రారంభానికి ముందు, పాఠం మధ్యలో, ప్రతి కొత్త "భావన" పరిచయం చేయునప్పుడు, పాఠం పూర్తయ్యే సమయంలో, కృత్యాలు, ప్రాజెక్టులు, ప్రయోగాలు, పరిశోధనల వంటిచోటా, ఇలా ప్రతి సందర్భంలో నిరంతర మూల్యాంకనం చేయడానకి వీలుగా, "అభ్యసనం కొరకు మూల్యాంకనం" అనే విధంగా పాఠ్యాంశాలు ఉన్నాయి. ఆయా సందర్భాలలో విద్యార్థుల ప్రతిస్పందనను బేరీజు వేసే విధంగా 'సమగ్ర' మూల్యాంకన ప్రక్రియకు దోహదం చేసేటట్లుగా పాఠ్యాంశాలన్నీ ఉన్నాయి. స్వీయ మూల్యాంకనం, "అభ్యసనాన్ని మెరుగు పరుచుకుందాం" వంటివి కూడా నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా ప్రతిపాఠంలో చేర్చబడ్డాయి.

**ముగింపు :**

పిల్లలు తరగతి గదిలో విన్న దానిని అలాగే జ్ఞాపకం ఉంచుకొని పరీక్షల్లో రాయడాన్ని ప్రోత్సహించకూడదు. నేర్చుకున్న అంశాన్ని నిత్య జీవిత సంఘటనలతో అనుసంధానం చేసికొని సమస్యలను పరిష్కరించుకోవాలి. సమకాలీన అంశాలను పాఠ్యాంశాలకు జోడించుకొని వాటిపై ప్రశ్నించగల్గాలి. భూగోళ, చరిత్ర, సామాజిక, రాజకీయ జీవనం, ఆర్థికశాస్త్రం అంశాలను విడిగా శాస్త్రం కోసం చదవకుండా మానవసంబంధాలు-వాటిపై ప్రభావం అనే దృష్టితో బోధన చేయడానికి వీలుగా నూతన పుస్తకాలు రూపొందించారు. ఇతి వృత్తాలను కూడా మానవ జీవనానికి సంబంధం ఉండేలా స్థిరపరుస్తూ ఇవ్వడమైనది. ఉత్తమ పౌరనిర్మాణానికి అవసరమైన తాత్విక భావనలను దృష్టియందు ఉంచుకొని పాఠాలను రాయడం జరిగింది. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని అవగాహన చేసకుని తరగతిలో బోధనాభ్యసన కృత్యాలు కొనసాగించాలి.

## 3. నూతన సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాల రూపకల్పన - విశ్లేషణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ NCF – 2005 మార్గదర్శకాలు, RTE – 2009 ల ప్రకారం రాష్ట్రంలో అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల మార్పునకు శ్రీకారం చుట్టింది. పాఠ్యపుస్తకాలు సమగ్రంగా మారాల్సిన అవసరాన్ని గుర్తించి, అర్థవంతమైన పాఠ్యపుస్తకాల రూపకల్పన కోసం విషయాలవారీగా ఆధార పత్రాలను APSCF - 2011 ఆధారంగా రూపొందించింది.

### పాఠ్యపుస్తకాల రూపకల్పన – మార్గదర్శకాలు

* పాఠ్యపుస్తకాలు పిల్లల ఆలోచనలకు, సహజశక్తి సామర్థ్యాల వినియోగానికి దోహదపడాలి.
* పాఠ్యపుస్తకాలు, బరువైన సమాచారంతో ఉండకుండా, పిల్లలే సమాచారాన్ని సేకరించేలా, విశ్లేషించేలా, నిర్ధారించేలా అవకాశం కల్పించాలి.
* పిల్లల జ్ఞాన నిర్మాణానికి పాఠ్యపుస్తకాలు తోడ్పడాలి. నిత్య జీవితంలో వినియోగానికి అవకాశం ఉండాలి.
* పిల్లలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం గాకుండా, అదనపు అభ్యసనం కోసం, సంప్రదింపు గ్రంథాలు, మ్యాగజైన్లు, పత్రికలు, సామాగ్రి, సమాజ సభ్యులతో పరస్పర ప్రతిచర్యలు జరిగేలా పాఠ్యపుస్తకాల్లో చోటు కల్పించాలి.
* పాఠ్యపుస్తకాల్లోని భాష సరళంగా ఉండాలి. బహుభాషత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.
* పాఠ్యాంశాలు లింగ, వర్ణ, వర్గ వివక్షతకు అవకాశమీయరాదు. పిల్లల ఆత్మవిశ్వాసం పెంచేలా, ఆలోచింపజేసేలా, మానవ హక్కుల పట్ల అవగాహన పెంచేలా ఉండాలి.
* పాఠ్యాంశాలు ఆలోచనా నైపుణ్యాలు అనగా ప్రతిస్పందించుట (Reflection), విమర్శనాత్మకంగా ఆలోచించడం (Critical Thinking), బహుకోణాల్లో ఆలోచించడం (Dialectical Thinking), సృజనాత్మక ఆలోచన (Creative Thinking) మరియు భావప్రసార నైపుణ్యాల (Communication Skills) ను పెంపొందించాలి.
* పాఠ్యాంశాలు ఆశించిన విద్యా ప్రమాణాలు సాధించడానికి అనువైన అభ్యాసాలు పొందుపరచాలి.
* కృత్యాలు, ప్రాజెక్టుపనులు, అన్వేషణలు, ప్రయోగాలు బహువిధాలైన సమాధానాలు వచ్చే ప్రశ్నలు, ఆలోచింపజేసే అభ్యాసాలు ఉండాలి.

### సాంఘిక శాస్త్ర నూతన పాఠ్యపుస్తకాలు – ఎలా రూపుదిద్దుకున్నాయి?

సాంఘికశాస్త్ర ఆధారపత్రంననుసరించి సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణా సంస్థ (APSCERT) పిల్లల అనుభవాలను, వారి వైవిధ్యనేపథ్యాలను, భాషలను దృష్టి యందుంచుకొని పాఠ్యపుస్తకాల రచనను వికేంద్రీకృతం చేసి రూపొందించింది. ఈ యత్నంలో రాష్ట్రంలోని పలుప్రాంతాలలో విశ్వవిద్యాలయాల, విద్యాసంస్థల, మేధావుల,

విద్యావేత్తల, ఉపాధ్యాయుల, సామాజిక కార్యకర్తల, ఉపాధ్యాయ సంఘాల, స్వచ్ఛందసంస్థలతో సమావేశాలు ఏర్పాటుచేసింది. వారి సుసంపన్న అనుభవాల ఆధారంగా విస్తృత చర్చలు జరిపి, సూచనలు పరిగణనలోకి తీసుకుంది. పాఠ్యపుస్తకాల రచనా బాధ్యతను, వాస్తవ దృక్పథంలో పాఠ్యాంశాల ఎంపిక, రచనా కార్యక్రమాలను పరస్పర సహకారంతో, జట్లతోచేపట్టిందేకాని, కేవలం విషయ నిపుణులతో కాదని గుర్తించాలి. పాఠ్యాంశాల నవీకరణలో పిల్లల అనుభవాల ఆధారంగా, వాటి కాఠిన్యాలను, అవగాహన పటిమ, తరగతి వాస్తవికతలను, ఉపాధ్యాయుని సంసిద్ధతను దృష్టియందుంచుకొని పాఠ్యాంశాలు రూపొందించడం జరిగింది.

* సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలలో విపరీతమైన సమాచారాన్ని చొప్పించడం ద్వారా పిల్లలపై కలుగుతున్న ఒత్తిడిని తగ్గించడానికి, 6,7,8 తరగతులలో గత పాఠ్యపుస్తకాలలోని నాలుగు విభాగాలైన భూగోళం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రాలను సమన్వయ పరిచి, సమ్మిళిత ప్రణాళికను ఆరు ఇతి వృత్తాలతో (Themes) రూపొందించడం జరిగింది. 9వ తరగతిలో భూగోళం, అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం అంశాలతో పాటు మానవ హక్కులు, మహిళా రక్షణ చట్టాలు, విపత్తుల నిర్వహణ, రోడ్డు భద్రత విద్య పాఠ్యాంశాలతో అంశాలవారీగా పాఠ్యపుస్తకాన్ని రూపొందించడం జరిగింది.

**పాఠ్యాంశ పరిచయము :**

* ప్రతి పాఠ్యాంశ పరిచయం / ఉపోద్ఘాతం సన్నివేశం, సంఘటన, చిత్రం, కథనాలు, మేథోమథనం, ఆలోచింపజేసే ప్రశ్నలతో ఆరంభించడం జరిగింది.

  ఉదా: 8వ తరగతిలోని 5పాఠం అడవులు – వినియోగం, సంరక్షణ పాఠ్యాంశ పరిచయం పూర్వజ్ఞానాన్ని పరీక్షించే, ఆలోచింపజేసే ప్రశ్నలతో ప్రారంభించడం జరిగింది. 9వ తరగతిలో 1వ పాఠం 'భూమి–మనం' పాఠ్యాంశ ప్రారంభాన్ని చిత్రం చూపించి, ప్రశ్నించడం, చర్చించడం ద్వారా పరిచయం చేయడం గమనించవచ్చు.

  8వ తరగతిలో 6వ పాఠం 'ఖనిజాలు, గనుల తవ్వకం', మన ఇంట్లో ఖనిజాలు ఉపశీర్షికతో ఇండ్లలో /స్థానిక వనరులను ఆయా అంశాలను గురించి మాట్లాడుతూ పాఠ్యాంశ పరిచయాన్ని చేయడం జరిగింది.

**భాష :**

* పాఠ్యాంశాలలో వాడిన భాష పిల్లలకు అర్థమయ్యే, సరళమైన, వ్యావహారిక భాషతో, బహుభాషత్వాన్ని దృష్టియందుంచుకొని వ్రాయబడినది.

**భావనల వివరణ :**

* ప్రతి పాఠ్యాంశం నందు బోధనాంశాలు, భావనలు చిన్న చిన్న పేరాలుగా విభజింపబడి ఉపశీర్షికలతో పొందుపరచడం జరిగింది.

**భిన్న కోణాలలో ఆలోచనలు రేకెత్తించే అంతర్గత ప్రశ్నలు :**

* పాఠ్యాంశ బోధనాభ్యసనప్రక్రియలో అంతర్భాగంగా ప్రతి ఉపశీర్షికలో, పాఠం మధ్యలో ఆలోచింపజేసే అదనపు సమాచార బాక్సులు, అభ్యసనాంశాలు, ఎంతవరకు అవగాహన పొందారో తెలుసుకునేందుకు ప్రశ్నలబాక్సులు ఇవ్వబడి నిరంతర సమగ్ర స్వీయ మూల్యాంకనానికి దోహద పడ్డాయి. 'తెలుసుకోండి' వంటి ప్రశ్నలు పిల్లలు బహుకోణాల్లో ఆలోచించడానికి, ప్రతిస్పందించడానికి, స్థానికాంశాల అన్వయానికి, అనుభవాల వ్యక్తీకరణకు దోహదపడతాయి.

ఉదా: 8వ తరగతి 13వ పాఠం 'భారత రాజ్యాంగం' పాఠ్యాంశంలో తెలుసుకోండి, భిన్న కోణాల్లో ఆలోచించే ప్రశ్నల బాక్స్‌లు, అదనపు సమాచారం కోసం రాజ్యాంగ తొలి ప్రతులు, మహాత్మాగాంధీ, డా. బి. ఆర్. అంభేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహనీయుల సందేశాలు, 'రాజ్యాంగ పీఠిక' పై అదనపు సమాచారం పొందుతారు. 12 వ పాఠంలోని 'తెలంగాణ పోరాటంలో మహిళలు' వంటి అదనపు సమాచార బాక్స్‌లు చదవడానికి విద్యార్థులలో ఆసక్తిని పెంచుతాయి

**స్వీయ అభిప్రాయాలను విద్యార్థులు వెలిబుచ్చే అవకాశం :**

పాఠ్యాంశాలలో స్వీయ అభిప్రాయాలను, సమకాలీన అంశాలను వ్యక్తం చేసే అవకాశం కల్పించబడి, చర్చలో పాల్గొనడం ద్వారా అవగాహన పెంపొందించడం జరిగింది. ఉదా : 8వ తరగతి పాఠ్యాంశం12 'హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్యోద్యమం' లో ప్రశ్నల బాక్స్‌లలో ఇవ్వబడిన మీ ప్రాంతములో ఏఏ భాషలు మాట్లాడతారు? బోధన అంతా మాతృభాషలోనే ఉండాలన్నది మీ అభిప్రాయమా? వంటి ప్రశ్నలు విద్యార్థుల మెదళ్ళకు పదును పెడతాయి.

**కేస్ స్టడీలుగా స్థానిక అంశాల వివరణ :**

* ప్రతి పాఠ్యాంశం ఏదో ఒక నూతనత్వాన్ని ప్రతిబింబించే విధంగా రూపకల్పన జరిగింది. ఉదా: 8 వ తరగతితో 17వ పాఠ్యాంశం 'పేదరికం–అవగాహన' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి శీర్షికలో రామాచారి, చంద్రయ్య కేస్ స్టడీలు (ఉదంతాలు) కళ్ళకు కట్టినట్లు వర్ణించబడ్డాయి. ఇలాంటి వారు తమ ప్రాంతాల్లోను ఉంటే వారి గురించి విద్యార్థులు ఆరా తీసి తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు.

* ఇంకా 8వ తరగతి 18వ పాఠం 'హక్కులు–అభివృద్ధి'లో పవన్ అనే బాలుడి 9వ తరగతిలో 22వ పాఠం 'మహిళా రక్షణచట్టాలు' ఆప "బడి" న 'బాల్య వివాహం – ఒక విజయగాథ' శీర్షిక ద్వారా రావిరాళ్ళ కవిత వివాహాన్ని ఆపడానికి మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్ (MVF) చేసిన కృషిని, బాల్యవివాహాలు చట్ట విరుద్ధమనే వాస్తవాలను గ్రహిస్తారు.

**గ్రాఫ్‌ల వినియోగం :**

* సందర్భానుసారంగా పాఠ్యాంశాలలో గ్రాఫ్‌ల ద్వారా విషయాలను పరిచయం చేయడానికి ప్రయత్నించడం జరిగింది. ఉదా: 8వ తరగతిలోని 8వ పాఠం 'జీవనోపాధులు–సాంకేతిక విజ్ఞాన ప్రభావం' పాఠ్యాంశంలో కమ్మీగ్రాఫ్‌లు, సమాచార

పట్టికలు, వృత్తరేఖాచిత్రాల ద్వారా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఉపాధిపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో విస్తృత అవగాహన చేసుకోవడానికి దోహదపడతాయి.

అదేతరగతిలో 9వ పాఠ్యాంశం "ప్రజారోగ్యం – ప్రభుత్వం" నందు కుటుంబ, ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వశాఖ వివిధ విభాగాలను ఫ్లోచార్టు ద్వారా ప్రదర్శించడం–పిల్లల అభ్యసనను మెరుగు పరుస్తుంది. ఆసుపత్రి ఖర్చులను సమకూర్చుకునే ఆర్థిక మార్గాలను వృత్త రేఖా పటముల ద్వారా, పరిమాణాత్మక వర్ణనలతో వివరించడం జరిగింది.

**విజయగాథలద్వారా విద్యార్థులలో ప్రేరణ :**

* 8వ తరగతిలోని 23వ పాఠం 'క్రీడలు, జాతీయత, వాణిజ్యం' లో జి. హెచ్. విహారితో జరిపిన ఇంటర్వ్యూ–విజయగాథ ద్వారా క్రికెట్ కున్న ప్రజాదరణ, మిగతా ఆటలకు లేక పోవడం, జాతీయ సమైక్యత, భావాల వృద్ధికి, భారతదేశ ఖ్యాతిని పెంచడానికి, విద్యార్థుల్లో ప్రేరణ కల్గించి సమాచారాన్ని సేకరించే నైపుణ్యాన్ని వృద్ధి పరుస్తుంది.

**చిత్రాల ద్వారా విషయ అవగాహన :**

* 8, 9వ తరగతి పాఠ్యపుస్తకాలలోని, పాఠ్యాంశాలలో అనేకరకాల చిత్రాలు ఇవ్వబడినాయి. అన్ని చిత్రాల కింద చిత్రాన్ని గురించిన వాక్యం చదవండి. ఉదా. 8వ తరగతిలోని 8వ పాఠం 'జీవనోపాధులు – సాంకేతిక విజ్ఞాన ప్రభావం' లోని 8.1, 8.6 చిత్రాల్ని పరిశీలించండి. రెండు చిత్రాలు అల్లికలు చేసే మహిళల్ని చూపుతాయి. ఇద్దరు స్త్రీలు చేసే పని, స్థాయిని వారి జీవితాలను పోల్చండి. ఇలాంటి చిత్రాలు పిల్లల్లో ఆసక్తిని రేపి, ఆలోచింపజేసి తమ భావాలను ప్రకటిస్తారు. ఇదే తరగతి లోని II-B పాఠ్యాంశంలో గాంధీజీ మూడు బొమ్మలున్నాయి. వీటిలో ఏవి ఫోటోలు, ఏవి చిత్రాలో తెల్పండి. ఇవి గాంధీజీ గురించి ఏమి తెల్పుతాయి. ఇవి గాంధీజీ గురించి ఏ సమాచారాన్ని ఇస్తాయి? ఇదే పాఠంలో నెహ్రూజీ ఎర్రకోట నుండి మాట్లాడుతున్న ఫోటో ఉంది. ప్రతి ఆగస్టు 15 నాడు మన ప్రధాని ఎర్రకోట నుండి ప్రజల నుద్దేశించి మాట్లాడుతాడని తెలుసు. 1947 స్వాతంత్ర్య సంబరాలకు, ప్రస్తుతం నిర్వహించే స్వాతంత్రదినోత్సవ సంబరాలకు మధ్యనున్న మార్పులు ఏవి? అవి ఎందుకు చోటుచేసుకున్నాయి?

**కార్టూన్లు :**

* నూతన పాఠ్యపుస్తకాలలో సందర్భోచితంగా అనేక కార్టూన్లు పొందుపరచడమైంది. ఇవి ఫోటోలకు ఏ విధంగా భిన్నమైనవో, వాటి ఉపయోగాలను చర్చించండి. వివిధ కార్టున్లు ప్రత్యేకమైన విషయాన్ని పరిచయం చేయడానికి, వ్యాఖ్యలతో పాటు పొందుపరచడం జరిగింది. ఉదా: 9వ తరగతి 20వ పాఠంలో "ప్రజాస్వామ్యం– రూపుదిద్దుకుంటున్నభావన" ఇవ్వబడిన కార్టూన్ల నుండి పిల్లలు ఏమి గ్రహిస్తారు ? ఏ అనుభవాలు పొందుతారు ? విమర్శనాత్మకంగా కార్టున్ల ద్వారా తమ అభిప్రాయాలు ప్రకటిస్తారు. 8వ తరగతిలో 10వ పాఠం 'బ్రిటిషు, నిజాంల పాలనలో భూస్వాములు, కౌలుదార్లు' నందు గీయబడిన కార్టూన్లు, వాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వర్ణించాయి. వాటిలో వ్యక్తుల భావాలు వ్యాఖ్యలతో ప్రకటించబడినాయి.

**ప్రాజెక్టులు :**

* భూ సంస్కరణలపై 8వ తరగతి 16వ పాఠం 'జమీందారీ వ్యవస్థ రద్దు' ద్వారా విద్యార్థులు భూ సంస్కరణలపై ప్రాజెక్టు పనిని చేపట్టి పెద్దల సహకారంతో సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, ప్రదర్శనకోసం నివేదికను తయారు చేయడం ద్వారా, వారిలో సహకారభావం, అభిప్రాయాలు గౌరవించడం, పంచుకోవడం, వ్యక్తంచేయడం, సమిష్ఠి నిర్ణయాలు తీసుకోవడం వంటి సామర్థ్యాలు పెంపొందుతాయి.

**కీలకపదాలు :**

* ప్రతి పాఠ్యాంశం చివరన ముఖ్య భావనలు కీలకపదాలుగా ఇవ్వబడినాయి. వీటి అర్థాలు తెలుసు కోవడటం ద్వారా పాఠ్యాంశంలోని సందేహాలు నివృత్తి చేయబడి, పదజాలాభివృద్ధి పెంపొందును.

**మూల్యాంకనం ద్వారా మెరుగుకానున్న విషయ అవగాహన :**

* మూల్యాంకనం కోసం ఇవ్వబడిన 'మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి' శీర్షిక కిందనీయబడిన ప్రశ్నలు ఆశించిన విద్యాప్రమాణాలు సాధించడానికి అనువుగా రూపొందించబడినాయి. ఇవి విద్యార్థి బట్టీ పట్టి సమాధానాలు చేప్పేవి కాకుండా, చర్చించి, ఆలోచించి, విభిన్న కోణాల్లో సొంత మాటల్లో, అనుభవాల ప్రాతిపదికగా సమాధానాలు ఇచ్చేవిధంగా పొందుపరచడం జరిగింది. ఇందులో వ్యక్తిగత, జట్టు కృత్యాలు, ప్రాజెక్టు పనులు కూడా పాఠ్యాంశాల ననుసరించి పాఠాల్లో పొందుపరచడం జరిగింది.

**గత పాఠ్యాంశాలు, నూతన పాఠ్యాంశాల రూపకల్పనల్లో వచ్చిన మార్పులు :**

* ఈ విద్యా సంవత్సరం నందు ప్రవేశపెట్టబడుతున్న 8,9 తరగతుల నూతన పాఠ్య పుస్తకాలు, గత పాఠ్యపుస్తకాలలో పొందు పరచిన పాఠ్యాంశాలను పరిశీలిద్దాం. గత 9వ తరగతి అర్థశాస్త్రంలోని ద్రవ్యం మరియు బ్యాంకింగ్ పాఠ్యాంశాన్ని 8వ తరగతిలో 'ఉత్పత్తి వినిమయం, జీవనాధారం' ఇతి వృత్తం (Theme) లో ద్రవ్యం – బ్యాంకింగ్ పాఠ్యాంశం ప్రవేశపెట్టడం జరిగింది. ఈ రెండు తరగతులలో పాఠ్యాంశాలను పరిచయం నుండి పాఠ్యాశం చివర ఇచ్చిన 'మీ అభ్యసనాన్ని మెరుగు పరచుకోండి' వరకు బోధనాభ్యసన ప్రక్రియల్లో ఏ విధానాలు అవలంబించారో నిశితంగా పరిశీలిద్దాం.

**నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పన :**

**8వ తరగతి నూతన పాఠ్యాంశం 'ద్రవ్యం – బ్యాంకింగ్' కథనాలు, సంఘటనల ద్వారా పాఠ్యాంశ పరిచయం**

వివిధ కథనాలను, ఉదాహరణలను మోహన్, శ్యామల పాత్రలు, శ్రీకాకుళం జిల్లాల్లో జరిగే వ్యాపారం, వ్యవసాయదారులు, వృత్తుల వారి మధ్య అవసరాలు తీర్చడానికి వస్తు మార్పిడి విధానం దైనందిన వ్యవహారాలలో ఉపయోగించినట్లు విద్యార్థులకు పాఠ్యాంశాన్ని పరిచయం చేయడమైనది. విద్యార్థులు తమ నిజజీవిత అనుభవాలను చెప్పే విధంగా, బాక్స్‌నందు పాఠ్యాంతర

ప్రశ్నలను (Inbuilt questions) చర్చించడం ద్వారా అభ్యసన ప్రక్రియ మరింత మెరుగుపరచడమైనది. చిత్రాల ద్వారా వస్తుమార్పిడి వలన కలుగు ఇబ్బందులను విద్యార్థులు చర్చించడానికి అవకాశం ఉంది.

**వివిధ భావనల అవగాహన :** పాఠ్యాంశాన్ని వివిధ ఉపశీర్షికల ద్వారా భావనల అవగాహనకోసం చిన్న చిన్న పేరాలుగా పొందుపరచడమైంది.

**పాత్రాభినయం ద్వారా వివరణ :**

డబ్బుతో జరుపు లావాదేవీలను గోపాల్, సీతమ్మల పాత్రాభినయం ద్వారా చర్చించడం జరిగింది. అదనపు సమాచారం కోసం బాక్స్ నందు హరి, ఎరువుల వ్యాపారి మధ్య జరిగిన లావాదేవీలు స్థానికంగా ఏమైనా జరుగుచున్నాయో విద్యార్థుల చర్చకు వదిలిపెట్టడమైనది.

**ఉదాహరణలతో వివరించుట :**

ధాన్యం, పశుసంపద, లోహాలు మారకంగా ఎలా ఆమోదించబడినాయో ఉదాహరణలతో చర్చించడం జరిగింది. వివిధ కాలాలలో ఆమోదించబడిన వివిధ నాణేల చిత్రాలను విద్యార్థులచే పరిశీలింపజేసి లోతుగా చర్చించడానికి అనువుగా పొందుపరచడమైనది. అభ్యసన ప్రక్రియలు అర్థవంతంగా జరగడానికి నిరంతర మూల్యాంకనంలో భాగంగా బాక్స్‌లలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడానికి ప్రశ్నలను పొందుపరచడం జరిగింది.

**బాక్స్ ఐటమ్స్ ద్వారా అదనపు సమాచారం ఇవ్వడం :**

సమకాలీన అంశాలతో చర్చకు అవకాశం, బ్యాంకుల ఏర్పాటుకు దారి తీసిన పరిస్థితులు, కాలానుగుణంగా వచ్చిన మార్పులను ఉదాహరణలు, కల్పిత పాత్రలతో,'ఆమ్‌స్టర్‌డాం' బ్యాంకు పనితీరులను చర్చించడం జరిగింది. అదనపు సమాచారం కోసం 'ప్లాస్టిక్ లేదా పాలిమర్ బ్యాంక్‌నోట్లు' శీర్షికతో బాక్స్ ద్వారా కాగితపు నోట్ల వలన కలిగే సమస్యలు పేర్కొనడమైంది. భారతీయ రిజర్వ్‌బ్యాంక్ లోగో (చిహ్నం) ను కూడా ముద్రించి, విధానాలను, విధులను విద్యార్థులు ఆలోచించే విధంగా విద్యార్థుల కోసం ఇవ్వడం జరిగింది. పాఠ్యాంతర ప్రశ్నల బాక్స్ నందు బ్యాంకుల ఆవిర్భావంలో ఎదురైన సమస్యలు, సమకాలీన అంశాలతో కూడిన ప్రశ్నల ద్వారా అభ్యసనాన్ని మెరుగు పరచడానికి విద్యార్థుల కోసం ఇవ్వబడినవి.

**విద్యార్థుల భాగస్వామ్యానికి అవకాశం :**

బ్యాంకింగ్ పరిచయానికి ప్రశ్నల బాక్స్ లోని ప్రశ్నలను విద్యార్థులను ప్రశ్నించడం, చర్చించడం ద్వారా బ్యాంక్‌ల భౌతిక లక్షణాలు, ఉద్యోగుల విధి నిర్వహణ, లావా దేవీలు నిర్వహిస్తున్న ఖాతాదారుల గురించి విస్తృత సమాచారాన్ని తరగతిలో చర్చించడం వలన అవగాహన పెంపొందించడం ద్వారా పాఠ్యాంశం వైపు విద్యార్థులను సంసిద్ధులను చేయడం ప్రధాన ఉద్దేశ్యం.

**ప్రత్యక్ష అనుభవాలను కల్పించుట :**

ఖాతాల నిర్వహణ, డబ్బులకు బదులుగా ఆర్థిక లావాదేవీలకు ఉపయోగించే చెక్కులు, చెక్కులు ఎలా రాయాలో సుజాతకు, నరేష్ ఇచ్చిన నమూనా చెక్కు చిత్రం పొందుపరచడమైంది. చెక్కులగురించి మరింత అవగాహన కల్పించడానికి, ప్రశ్నల బాక్స్ (inbuilt questions) లోని ప్రశ్నలు విద్యార్థులు చర్చించడానికి పొందు పరచడం జరిగింది. బ్యాంకులు లావా దేవీలు జరుపు విధానాన్ని బ్యాంకు కౌంటర్లు, ఖాతాదారుల చిత్రాలు మరింత సమాచారం తెల్సుకోవడానికి విద్యార్థుల పరిశీలనార్థం ఉంచడం జరిగింది.

**పాఠ్యాంశాన్ని updated గా పొందుపరచడం :**

ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలతో నిర్వహించే ATM, Debit Card, Credit Card, Net Banking, Phone Banking, Online సేవలు పరిచయం చేయడమైంది. Online సేవల ద్వారా రఘు అను ఖాతా దారు ఫోన్ బిల్లును Online లో ఎలా చెల్లించాడో, ఆర్థిక లావాదేవీలు ఎలా సులభతరం అయ్యాయో విద్యార్థులతో సోదాహరణంగా చర్చించడం జరిగింది. అభ్యసన ప్రక్రియలు ఎంతవరకు ఫలవంత మయ్యాయో తెలుసుకొనుటకు Box లలో ఇచ్చిన ప్రశ్నలను చర్చించజేయడం ATM - నుండి డబ్బులు పొందే చిత్రం వంటి వాటిపైన విద్యార్థుల్ని చర్చింపజేసి, ఎలా వినియోగించవచ్చో, అవగాహన పెంపొందించడం జరిగింది.

**నిజజీవిత సన్నివేశాలతో వివరణ :**

మనస్విని కథనం ద్వారా డబ్బు ఎలా పెరుగుతుందో, డిపాజిట్లపై వడ్డీ ఎలా చెల్లిస్తారో వంటి విషయాల గురించి చర్చించడం జరిగింది. ప్రశ్నల బాక్స్ ద్వారా డిపాజిట్ల నిర్వహణ, వడ్డీవివరాలు, అత్యవసర సమయాలలో ఇవి ఎలా లాభదాయకమో ప్రశ్నలతో చర్చించడం జరిగింది.

**కథనాలు / ప్రాజెక్టు పనితో పాఠ్యాంశ వివరణ :**

అప్పులు – రకాలు అంశం నందు బ్యాంకులు నిర్వహించే ప్రధాన విధులలో అప్పులు ఇవ్వడం ముఖ్యమైన విధి. సేకరించిన డిపాజిట్లను వివిధ సంస్థలు, వ్యక్తులకు అప్పులు ఇచ్చే కథనాలను రహీం (రైతు), లీల (ఉద్యోగి), శాంత (SHW స్వయం సహాయక సంఘం) పాత్రల ద్వారా వివిధ రకాల అప్పులు, విధించే వడ్డీ వంటి వివరాలను చర్చించడం జరిగింది. వాణిజ్య బ్యాంకుల పనితీరుపై విద్యార్థులకు కృత్యాన్నిచ్చి, సమాచార సేకరణపై అవగాహన పెంపొందించడానికి ప్రశ్నల బాక్స్ పొందు పరచడం జరిగింది.

**కీలక పదాలు** ఇవ్వడం ద్వారా పాఠ్యాంశంలోని ముఖ్యభావనలపై మరింత సమాచారం ఇవ్వబడినది. వీటి అర్థాన్ని తెలుసుకోవడం ద్వారా పాఠ్యాంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. పదజాలాభివృద్ధి ద్వారా నూతన సందర్భాలలో వినియోగించుకొనే అవకాశం ఉంటుంది.

**విద్యాప్రమాణాల సాధనకు అవకాశం :**

**మీ అభ్యసనాన్ని మెరుగు పరచుకోండి** అనే శీర్షిక ద్వారా పాఠ్యానంతరం విద్యార్థిలో ఆశించిన విద్యా ప్రమాణాలు ఎంతవరకు సాధించబడినాయో తెలుసుకొనుటకు ఆరు విద్యా ప్రమాణాలతో ప్రశ్నలు రూపొందించి ఇంటిపనిగా నిజ జీవిత అన్వయం, స్వీయ భావ వ్యక్తీకరణ ప్రధానంగా ప్రశ్నలు పొందుపరచడం జరిగింది.

**క్షేత్ర పర్యటనలు నివేదికల తయారీ – ప్రదర్శన :**

పాఠ్యాంశ విషయాలైన బ్యాంకులు నిర్వహించే విధులు, ఖాతాలు, చెక్కులు, పనితీరు, ఆన్‌లైన్ లావాదేవీలు, వడ్డీ శాతం మొదలైన సమాచార వివరాలతో ప్రాజెక్టు పని నిర్వహించి, నివేదిక రూపొందించడం వలన విద్యార్థులకు సమాచార సేకరణ, పట్టికల తయారీ, విశ్లేషణ వంటి విద్యా ప్రమాణాల సాధనతోపాటు, భాగస్వామ్య అధ్యయనం, సహకారభావం పెంపొందించడం జరుగుతుంది.

**గత పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశం రూపకల్పన – విశ్లేషణ :**

గత విద్యా సంవత్సరం 9వ తరగతి సాంఘికశాస్త్ర పాఠ్యాంశాలలో అర్థశాస్త్రంలో 'ద్రవ్యం మరియు బాంకింగ్' పాఠ్యాంశం ఏ విధంగా రూపొందించబడిందో పరిశీలించినట్లయితే.

**ఉదాహరణల ద్వారా వివరణ :**

**పాఠ్యాంశ పరిచయం :** తొలి దశలో ప్రజలు దైనందిన జీవితావసరాలు తీర్చుకొనుటకు వస్తు మార్పిడి విధానాన్ని కొనసాగించినట్లు మేకలు–బంగాళా దుంపలు' ఆధారంగా, వస్తుమార్పిడిలో ఉన్న సమస్యలు నాణెముల ఆవిర్భావానికి దారితీసినట్లు నేటి కాగితపు ద్రవ్యంగా అభివృద్ధి చెందినట్లు వివరించారు. విద్యార్థుల భాగస్వామ్యానికి అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం ఇవ్వలేదు.

**నిర్వహణ – వివరణలతో భావనల ప్రదర్శన :**

ద్రవ్యం నిర్వచనాన్ని, ద్రవ్యం నాలుగు విధులు నిర్వహిస్తుందని, నేటి బ్యాంకులు నిర్వహించే విధులను వ్యావహారిక భాషలో పేర్కొనక పోవడం, భాషలో సరళతలేక పోవడం, విద్యార్థులకు వివరించి చెప్పడానికే ప్రాధాన్యతనీయబడింది. విద్యార్థి చర్యలలో పాల్గొనే అవకాశం పరిమితం చేయబడి, పాఠ్యాంశం సమాచారంతో నింపబడింది. విద్యార్థి ఆలోచనలకు, అభిప్రాయాలకు, స్పందించేందుకు అవకాశం తక్కువగా ఉంది.

**సాంకేతిక పదాలతో వివరణ :**

ద్రవ్యం వర్గీకరణ అంశం నందు ద్రవ్యం రకాలు చెప్పిన క్రమంలో న్యాయాత్మక టెండరు, ఐచ్ఛిక వంటి పదాలు సరళంగా లేకపోవడం వలన అర్థం చేసుకోవడానికి ఉపాధ్యాయుడే వివరించే అవసరం ఏర్పడింది. స్థాయికి మించిన భావనలు డిబెంచర్లు, బాండులు, బిల్లు ఆఫ్ ఎక్చేృంజ్, వంటివి విద్యార్థులు స్వీయ అభ్యసనానికి కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.

**అభ్యసనలో విద్యార్థి భాగస్వామ్యం లేదు :**

రిజర్వ్ బ్యాంకు నిర్వహించే విధులు సులభ గ్రాహ్యంగా ఉన్నప్పటికీ విద్యార్థులు చర్చలో పాల్గొనే కృత్యాలు సన్నివేశాలు లేకపోవడంవల్ల  అభ్యసనా ప్రక్రియలకు పరిపూర్ణత చేకూర్చలేము.

**నిజ జీవిత సన్నివేశాలతో అనుసంధానం లేదు:**

బోధనాభ్యసన ప్రక్రియలో బ్యాంకుల విధులను ఛార్టు ద్వారా వివరించినప్పటికీ, నిత్య జీవిత సన్నివేశాలు, అన్వయానికి అవకాశాలు లేవు.

**చిత్రాలతో లేవు :**

విద్యార్థికి విషయ గ్రాహ్యానికి కావలసిన చిత్రాలు ఇవ్వబడలేదు. అందువలన విద్యార్థి స్వయంగా పాల్గొనేందుకు, వాటిద్వారా   కృత్యాల నిర్వహణకు అవకాశం లేదు.

**పాఠ్యాంతర ప్రశ్నలు లేవు :**

బ్యాంకులు రైతుల ఆర్థికవసరాలు తీర్చుటకు మూడు విధాలైన రుణాలు మంజూరు చేస్తున్నాయని సహకార వ్యవస్థ, నిర్మాణం చార్టు ద్వారా ప్రదర్శించడం జరిగింది. అదనపు సమాచారానికి  Box Items లేకపోవడం, విద్యార్థి స్వీయ అభ్యసనాకృత్యాలు, Inbuilt Questions కి స్థానం కల్పించబడలేదు.

**స్థానికాంశాలకు అవకాశం లేదు :**

సహకార బ్యాంకులు–వ్యవస్థ–నిర్మాణం, భూ అభివృద్ధి బ్యాంకులు గురించి, అవగాహన కల్పించినప్పటికి, స్థానికాంశాలకు, సన్నివేశాలకు చోటు కల్పించక పోవడం వలన విద్యార్థులు అభ్యసనపట్ల ఆశించినంత ఆసక్తిని కనబరచలేరు.

**క్షేత్ర అధ్యయనానికి అవకాశం కల్పించబడలేదు :**

గ్రామీణ బ్యాంకుల విధులు, డిపాజిట్ల సేకరణ, అప్పుల మంజూరు పరపతి సౌకర్యాల విషయాలు పొందు పరచకుండా కేవలం గ్రామీణ బ్యాంకుల వివరణకే పరిమితం చేయబడింది. అదనపు సమాచారంతో కూడిన Box Items  కి ఎలాంటి అవకాశం లేదు. విద్యార్థులు పాల్గొనేందుకు Case Study వంటి కృత్యాలకు స్థానం కల్పించబడలేదు. క్షేత్ర అధ్యయనానికి విస్తృత అవకాశాలున్నటికీ చొరవ చూపలేదు.

**సారాంశం ఇవ్వబడింది :**

పాఠ్యానంతరం చివరగా సంక్షిప్త సమాచారంతో కూడిన సారాంశం ఇవ్వబడింది. ఇది పాఠ్యాంశానికి చెందిన ప్రధాన భావనల సమాహారంగా భావించబడింది. ఇది విద్యార్థుల అభ్యసనను పరిమితం చేసింది.

**అభ్యసనలో కృత్యాలకు, ప్రాజెక్టులకు అవకాశం లేదు :**

పాఠ్యాంశానికి చెందిన లక్ష్యాలు ఏ మేరకు సాధించ బడినాయో తెలుసుకోవడానికి అభ్యాసాలు ఇవ్వబడినాయి. సమాచారం ఆశించే ప్రశ్నలు, ఖాళీలు, బహుళైచ్చిక ప్రశ్నల ద్వారా విద్యార్థి పొందిన సామర్థ్యాలు అంచనా వేయబడినవి. ప్రశ్నలన్నీ విద్యా ప్రమాణాలను (సామర్థ్యాలు) సాదించే అవకాశాలు లేకపోగా, సమాచారాన్ని పునరుక్తి చేయడానికి ఉద్దేశించిన విషయావగాహనకు చెందిన ప్రశ్నలు ఎక్కువగా ఇవ్వబడినాయి. సమాచార సేకరణ, సమకాలీన అంశాలతో కూడిన కృత్యాలకు, ప్రాజెక్టులకు అవకాశాలు కల్పించబడలేదు.

ఇప్పటి వరకు పై రెండు (గత, నూతన) పాఠ్యాంశాల రూపకల్పనలో పాఠ్యాంశ పరిచయం నుండి మూల్యాంకనం వరకు చదివారు గదా ! పై రెండింటిలో ఏ పాఠ్యాంశం అధిక సమాచారంతో నింపబడిందో, ఏ పాఠ్యాంశం నందు విద్యార్థుల భాగస్వామ్యం ఎక్కువగా ఉందో, ఏ పాఠ్యాంశం నందు స్థానికాంశాలకు, Case Study,క్షేత్రఅధ్యయనం, నిరంతర మూల్యాంకనం, స్వీయ అభ్యసనానికి, సమాచార సేకరణ నైపుణ్యాలు,నివేదికలు, కృత్యాలు, ప్రాజెక్టుపనుల తయారీకి అవకాశాలున్నాయో అవగాహన చేసుకొనే ఉంటారు. పై వాటిలో ఏ పాఠ్యాంశ ప్రదర్శన ద్వారా విద్యార్థులు ఆశించిన విద్యా ప్రమాణాలు నిర్దేశిత కాలంలో సాధిస్తారో ఒక నిర్ణయానికి వచ్చి ఉంటారు.

మనం పొందిన అభ్యసనానుభవాలను మరొకసారి కింది అంశాలను చర్చించడం ద్వారా పరిశీలిద్దాం :

1. 8, 9, తరగతుల నూతన పాఠ్య పుస్తకాలను గత పాఠ్య పుస్తకాలతో పోల్చి చర్చించండి.?
2. నూతన పాఠ్యపుస్తకాల కూర్పును సమగ్రంగా చర్చించండి?
3. ఏదేని నూతన పాఠ్యాంశాన్ని చదివి స్థానికాంశాలకు ఇచ్చిన ప్రాధాన్యతలను తెల్పండి?
4. బోధనాభ్యసన ప్రక్రియలో చిత్రాలు , ఫోటోగ్రాఫులు, రేఖాచిత్రాలు విద్యార్థికి ఏ విధంగా ఉపకరిస్తాయి?
5. ప్రాజెక్టు పనులు చేపట్టడం ద్వారా పాఠ్యపుస్తకం ఆధారంగా విద్యార్థుల్లో ఎలాంటి వైఖరులు, నైపుణ్యాలు వృద్ధిపొందుతాయి.

మాడ్యుల్‌లో వివరించబడిన ద్రవ్యం బ్యాంకింగ్ పాఠాల్ని చర్చించినట్లు, గత 9వ తరగతిలోని 'భారత రాజ్యాంగం' పాఠ్యాంశాన్ని నూతన 8వ తరగతిలోని 13వ పాఠం 'భారత రాజ్యాంగం' పాఠ్యాంశాన్ని అధ్యయనం చేసి పాఠ్యాంశ రూపకల్పనలో మీరు గమనించిన అంశాలను వివరంగా రాయండి.

## 4. సాంఘిక శాస్త్ర విద్యా ప్రమాణాలు - అవగాహన

* సాంఘిక శాస్త్రం ఎందుకొరకు బోధించాలి ? ఉద్దేశ్యమేమిటి?
* విద్యార్థుల నుండి మనం ఏమి ఆశిస్తున్నాము ?
* మనం ఆశిస్తున్నవాటిని ఎలా సాధించాలి?
* విద్యార్థులు వాటిని సాధించారా లేదా మనం తెలుసుకోవడమెలా?

సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాలు కేవలం సమాచారం అందించేవిగా కాకుండా పిల్లల్లో జ్ఞాననిర్మాణం చేయడానికి గానూ రూపొందించడం జరిగింది. బోధనాభ్యసన ప్రక్రియలో వ్యక్తిగత కృత్యాలు, జట్టు కృత్యాలు, చర్చలు, చిత్రాలు గీయడం, పట్టికలు చదవటం, విశ్లేషించటం వంటి వాటికి ప్రముఖ స్థానం ఇవ్వటం వలన తార్కిక ఆలోచన, విమర్శనాత్మక దృష్టి పెరుగుతుంది.

జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం - 2011, సాంఘికశాస్త్రం ఆధారపత్రం ప్రతిపాదనల ఆధారంగా విద్యా ప్రమాణాలను రూపొందించారు. సాంఘిక శాస్త్రంలో నిర్ధారించిన ఆరు విద్యా ప్రమాణాలను సాధించుటకు వీలుగా తరగతి గది సమయాన్ని ప్రణాళికా బద్ధంగా విభజించి బోధనాభ్యసన కృత్యాన్ని నిర్వహించాలి. తరగతిలో అన్నీ ఒకే విధమైన ప్రశ్నలు కాకుండా విద్యా ప్రమాణాలను దృష్టి యందుంచుకొని వివిధ కోణాలలో విద్యార్థి ఆలోచించి, సమాధానం చెప్పడానికి అవకాశం కల్పించే ప్రశ్నలు ఇవ్వాలి. ఒకే ప్రశ్న పిల్లలందరినీ అడిగినా, వారు ఒక ప్రశ్నకు అనేక కోణాల నుండి సమాధానాలు చెప్పడానికి తరగతిలో అవకాశం ఇవ్వడం వలన మనం ఏ ఉద్దేశ్యంతో విద్యా ప్రమాణాలు నిర్ధారించుకున్నామో ఆ ఉద్దేశ్యం నెరవేరుతుంది. అన్ని విద్యా ప్రమాణాలు తరగతి గదిలోనే సాధించాలనే నియమం లేదు. ప్రాజెక్టులు, క్షేత్ర పర్యటనల ఆధారంగా, ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పిల్లల్లో కల్పించాలి. సమాచార సేకరణ సమయంలో కూడా ఈ కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమౌతాయి. వీటన్నింటికీ అవసరమైన విద్యా ప్రమాణాలను విపులంగా తెలిసికొందాం.

విద్యా ప్రమాణాలు : (Academic Standards)

I. విషయావగాహన (Conceptual Understanding)

II. ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం
(Reading the text given, understanding and interpretation)

III. సమాచార నైపుణ్యాలు (Information gathering & processing Skills.)

IV. సమకాలీన అంశాలపై ప్రతిస్పందించుట - ప్రశ్నించుట.

(Reflection on Contemporary Issues and Questioning)

V. పటనైపుణ్యాలు (Mapping Skills)

VI. ప్రశంస / అభినందన – సున్నితత్వం. (Appreciation and sensitivity)

ఈ ఆరు విద్యా ప్రమాణాలను ఒక్కొక్కటి వివరంగా చర్చిద్దాం.

I. **విషయావగాహన :**

**విషయావగాహన ఎందుకోసం?**

పాఠ్యాంశాల్లోని కీలక పదాలు, కీలక భావనలు విద్యార్థులు అర్థం చేసికొని వారికి అర్థమయిన అంశాలను చెప్పగలగాలి. కారణాలు చెప్పడం, వర్గీకరించటం, ఉదాహరణలు ఇవ్వడం, పోలికలు, భేదాలు తెలియజేయడం, విశ్లేషించటం, ఊహించటం, వివరించటం వంటివన్నీ విషయావగాహన క్రిందికి వస్తాయి.

- తాను చూసిన సంఘటన గురించి గానీ, తాను చేసిన పనిని గురించి గానీ తన సొంత మాటల్లో వివరించగల్గాలి.
- ఇతరులు చెప్పే వాటిని వింటూ సహేతుకంగా ఆలోచించ గల్గాలి.
- తాను పరిశీలించిన వివిధ అంశాల మధ్య గల సంబంధాలను గుర్తించ గల్గాలి.
- తాను పరిశీలించిన అంశాల యొక్క లక్షణాల ఆధారంగా వాటిని వర్గీకరించ గల్గాలి. వాటి మధ్యగల పోలికలు, భేదాలు చెప్పగల్గాలి.
- ఉపాధ్యాయుడు చెప్పిన పాఠ్యాంశం యొక్క ముఖ్యాంశాలను సొంతమాటల్లో చెప్పగల్గాలి.

**విషయావగాహన ఎలా పెంపొందించాలి?**

పాఠ్యాంతర ప్రశ్నలను జట్లలో చర్చించటం ద్వారా పిల్లల్లో విషయావగాహన పెంపొందుతుంది.

ఉదా: 1. యుద్ధ సమయంలో సైన్యానికి పటాలు ఏవిధంగా ఉపయోగపడతాయి? (8వ తరగతి పేజి నెం. 8). పిల్లలు ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు చర్చించి రాస్తారు.

2. నీలగిరి చెట్లు – తేయాకు, తోటలకు – అడవికీ మధ్య ఏమైనా తేడాలున్నాయా? తరగతిలో చర్చించండి: (8వ తరగతి పేజి 57) చర్చతో బాటు ఈ దిగువ కృత్యాలను నిర్వహించటం ద్వారా విషయావగాహన కలిగించవచ్చు.

- చిత్రాలను పరిశీలించడం, చర్చించడం.
- చదివి భావనలను అర్థం చేసుకోవటం
- వివిధ కార్యాలయాలు

ఉదా: పోలీస్ స్టేషన్, న్యాయస్థానం వంటివి పరిశీలించి భావనలను అర్థం చేసుకోవటం.


- ప్రాజెక్టులు పూర్తిచేసి వాటి నివేదికను తరగతిలో సమర్పించటం.

**పిల్లలకు ఉపాధ్యాయుడు అందించాల్సిన సహాయం ఏమిటి? (ఉపాధ్యాయుని పాత్ర)**

* పిల్లలు సమాచారం కోసం ఉపాధ్యాయుని పై ఆధారపడే వాతారణం సృష్టించరాదు. స్వయంగా నేర్చుకొనేలా ప్రోత్సహించాలి.
* భావనలు అవగాహన పొందేలా బోధనాభ్యసన ప్రక్రియలుండాలి.
* పిల్లలు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. జట్టు పనులను, చర్చలను ప్రోత్సహించాలి.
* పిల్లల అభిప్రాయాలు అసంబద్ధమైనవిగా ఉన్నప్పుడు వారిని నిరుత్సాహపరచరాదు. సరియైన పద్ధతిలో ఆలోచించేలా సలహా లివ్వాలి. అవసరమైతే తాను ఆ గ్రూపులో కొద్దిసేపు పాల్గొనాలి.
* క్షేత్ర సందర్శనలు, ఇంటర్వ్యూ, ప్రాజెక్టు పనులు పూర్తయిన తర్వాత వారి అనుభవాలు, అభిప్రాయాలు, విశ్లేషణలు ఆధారంగా వారు తయారు చేసిన నివేధికలను తరగతి గదిలో చెప్పించి ప్రోత్సహించాలి.

ఉదాహరణలుగా కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దామా?

1. ఏడవ తరగతిలో మీరు భూమధ్య రేఖా ప్రాంతం గురించి చదివిన దాన్ని బట్టి ధృవ ప్రాంతంలో గల తేడాలు ఏమిటో చెప్పండి. (8వ తరగతి పేజి 48)
2. డబ్బు మార్పిడిని చెక్కులు ఏవిధంగా సులభతరం చేశాయి? (8వ తరగతి)
3. ప్రభుత్వం విధించిన భూమి శిస్తును గిరిజనులు కట్టలేక పోవడానికి గల కారణాలు ఏవి? (8వ తరగతి పేజి 58)
4. వివిధ భూ స్వరూపాలను తెలిపి వాటిని శ్రేణి వారీగా వర్గీకరించడం : (8వ తరగతి)
5. శాఖాహారి జంతువులకు ఉదాహరణలిమ్ము (8వ తరగతి)



విద్యార్థి memory లో Long memory, Short memory ఉంటాయి. Long memory లో ఉన్న విషయానికి Short memory ద్వారా మనం చర్చించే విషయాన్ని Connect చేయాలి. తరగతిలో చర్చించడం, విద్యార్థి భాగస్వామికావటం, Sharing ద్వారా జ్ఞాననిర్మాణం జరగటంవల్ల ఇది విద్యార్థి కేంద్రితమై అర్థవంతమైన అభ్యసనం (Meaningful learning) అనబడుతుంది. దీనిని Active Learning అని అంటారు. దీనిలో విద్యార్థి పూర్తిగా పాల్గొంటాడు.

II. **ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం:** పిల్లలు పాఠ్యాంశాన్ని చదివి, అందులోని విషయాన్ని అర్థం చేసుకొని వివిధ సందర్భాలలో పొందిన అనుభవం ఆధారంగా వ్యాఖ్యానం చేయగల్గాలి.

ఉదాహరణ :

1. ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఆహారధాన్యాల పంపిణీ (ప్రజా పంపిణీ వ్యవస్థ) ని ప్రభుత్వమే నిర్వహిస్తూ వాటికి సబ్సిడీని కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. మనం గతంలో చూసిన విధంగా పేదల ఆహార భద్రతకు ఇది చాలా కీలకమైనది". (9వ తరగతి పేజి 130)

* పేదలకోసం ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం సమంజసమేనా? ఎట్లు?

| |
|---|
| పిల్లలు తమ తమ అభిప్రాయాలను చెప్పే విధంగా ప్రోత్సహించాలి. ఇది ప్రశ్నకు జవాబివ్వడం అనేది కాకుండా వాస్తవస్థితులను అర్థం చేసికొని వ్యాఖ్యానించేలా చేయాలి. |

2. గాలి, నీరు, నేలలో విషపూరితమైన పదార్థాలు కలవటం మరొక ఉదాహరణ, అనేక పరిశ్రమలు లోహాలు, రసాయనాలు వినియోగిస్తాయి. వాటి నుంచి వ్యర్థాలు వాగులు, నదులలో కలుస్తాయి. దీనివల్ల నీటిలో ఇటువంటి రసాయనాల మోతాదు గణనీయంగా పెరిగిపోతుంది. నీటిలోని పాదరసం వంటి రసాయనాలు సూక్ష్మజీవుల శరీరాల్లోకి ప్రవేశిస్తాయి. ఈ సూక్ష్మజీవులను చేపలుతిన్నప్పుడు అవి చేపల శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఈ చేపలను మనుషులు తిన్నప్పుడు వాళ్ళ ఆరోగ్యం దెబ్బతినే స్థాయికి పాదరసం చేరుకునే అవకాశం ఉంది.

* పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థాల వల్ల ఇంకా ఏ ఏ అనర్థాలున్నాయో తెలియజేయండి. ఈ పేరాలోని విషయంతో మీరు ఏకీభవిస్తారా?

3. పేజి 99 మరియు 100 లలో (9వ తరగతి) గల అసీమ్ గురించి చదివిన తర్వాత మీకు కలిగిన అభిప్రాయమేమి? మీ సొంత మాటలలో రాయండి.

| |
|---|
| సాధారణంగా మనం వార్తా పత్రికల్లో వార్తలు చదివి, అర్థం చేసికొని వెంటనే దానిపై ఒక వ్యాఖ్య (Comment) చేస్తాం. అలాంటిదే ఈ విద్యా ప్రమాణం. |

**III. సమాచార నైపుణ్యాలు:**

1. సమాచార నైపుణ్యాలు ఎందుకోసం అవసరం?
2. సమాచార నైపుణ్యాలు ఎలా పెంపొందించాలి?

అవసరమైన సమాచారాన్ని సేకరించాలి. సేకరించిన సమాచారాన్ని పట్టికల రూపంలో నమోదు చేయాలి. (విశ్లేషించాల్సిన అంశాలను దృష్టియందుంచుకొని పట్టికలో కాలమ్స్ నిర్ణయించుకోవాలి. సమాచార పట్టికలను పరిశీలించి, విశ్లేషించి వాటి ఆధారంగా నిర్ధారణ చేసి నివేదికలు రూపొందించాలి. దీని ద్వారా ఇతరులతో మాట్లాడటం. అవసరమైన విధంగా ప్రశ్నించడం, జట్టులో కలిసి పనిచేయడం వంటి లక్షణాలు పిల్లలకు అలవడతాయి.

పిల్లలు సహజ వాతావరణములో తమంతట తాముగా అన్వేషించి, పరిశోధించి అవసరమగు సమాచారం సేకరించి ఒక విషయం పట్ల గానీ, అంశం పట్ల గానీ అవగాహన ఏర్పరచుకొని నిర్ధారణకు రావడానికి దోహదపడే కృత్యాలనే ప్రాజెక్టులు అని పిలుస్తారు.

సమాచార నైపుణ్యాలలోని సేకరణ, నమోదు, విశ్లేషణ, నివేదిక తయారీ, నివేదికను సమర్పించుట అనే అయిదు విషయాలు ఒక అంశానికి వర్తింపజేసిన అది ప్రాజెక్టుగా భావించాలి.

సమాచార నైపుణ్యాలలో దిగువ విధంగా చేయించవచ్చు.


ఉ॥ 1. Text to table 2. Table to questions 3. Table to Graph 4. Graph to Questions 5. Graph to table 6. Graph to Text 7. Text to Graph.. వీటిలో ఏది తగినది అనిపిస్తే దానికి సంబంధించిన కృత్యం ఇవ్వవచ్చు.

ఉదా: –

1. మీ ప్రాంతంలో పండే పంటల జాబితా తయారు చేసి వాటిని ఈ క్రింది పట్టికలో పొందుపరచండి.

| క్ర.సం. | పంటలు రకాలు | పంటలు |
|---|---|---|
| 1. | ప్రధాన పంటలు | |
| 2. | పప్పు ధాన్యాలు | |
| 3. | నూనె గింజలు | |
| 4. | ఆహారేతర పంటలు | |

## 2. ఆహార ధాన్యాల ఉత్పత్తి




**పై గ్రాఫ్ ను పరిశీలించి దిగువ ప్రశ్నలకు సమాధానం రాయండి.**

1. 2000–01 నుండి 2010–11 వరకు ఆహారధాన్యాల ఉత్పత్తి ఎన్ని మి.టన్నులు పెరిగింది?
2. ఏ దశాబ్దంలో పెరుగుదల శాతం ఎక్కువగా ఉంది?
3. 1950–51 నాటి ఉత్పత్తికి 2010 –11 నాటి ఉత్పత్తి దాదాపు ఎన్ని రెట్లు పెరిగింది?

ప్రశ్నలు అన్నీ ఒకే అంశాన్ని ప్రతిబింబించేలా ఉండకూడదు. విభిన్న కోణాలు స్పృశించేలా ప్రశ్నలుండాలి. విశ్లేషణకు అవకాశం ఇవ్వాలి.

## 3 చేనేత యూనిట్లలో మార్పు

| చేనేత యూనిట్లలో మార్పు | | |
|---|---|---|
| రాష్ట్రం | **1988** | **2009** |
| ఆంధ్రప్రదేశ్ | 5,29,000 | 1,24,700 |
| గుజరాత్ | 24,000 | 3,900 |
| కర్నాటక | 1,03,000 | 40,500 |
| మహారాష్ట్ర | 80,000 | 4,500 |
| మధ్యప్రదేశ్ | 43,000 | 3,600 |
| పంజాబ్ | 22,000 | 300 |
| తమిళనాడు | 5,56,000 | 1,55,000 |

పై పట్టికను పరిశీలించి దిగువ ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. ఏ రాష్ట్రంలో చేనేత యూనిట్ల సంఖ్య  గణనీయంగా తగ్గింది?

2. 1988లో అత్యధిక, అత్యల్ప యూనిట్లు గల రాష్ట్రాలేవి?

3. 2009 నాటికి ఏ రాష్ట్రంలోనూ యూనిట్ల సంఖ్య పెరుగలేదు.

ఎందుకో తెలుసా? విశ్లేషించుము.

## IV. సమకాలీన అంశాలపై ప్రతిస్పందించుట – ప్రశ్నించుట

* సమకాలీన అంశాలకు కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.
* సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలను సమకాలీన అంశాలతో ఎలా అనుసంధానించవచ్చు?
* సమకాలీన అంశాలపై ప్రతిస్పందించుట – ప్రశ్నించుట అనే సామర్థ్యం ప్రాధాన్యత ఏమిటి?

పాఠ్యాంశమును నిత్య జీవితానికి సంబంధించిన అంశాలతో జోడించాలి. పాఠాన్ని నేర్చుకుంటున్న సమయంలో ఆ కాలానికి సంబంధించిన సంఘటనలను తరగతిగదిలో చర్చించాలి. పిల్లలు ప్రశ్నించేలా చేయాలి. ఒక ప్రాంత ప్రజల జీవన విధానం గురించి చర్చించేటప్పుడు తమ ప్రాంత ప్రజల జీవన విధానంతో పోల్చమనడం ద్వారా సమకాలీన అంశాలు ప్రశ్నించబడతాయి. మయన్మార్ దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమం గురించి చర్చించేటప్పుడు మన దేశంలో ప్రజాస్వామ్యం గురించి, ఇతర ఉద్యమాల గురించి ప్రతిస్పందించే విధంగా, పిల్లలకు ప్రశ్నించే అవకాశం కల్పించి లోతుగా ఆలోచించే విధంగా చేయాలి.

విద్యార్థులు పాఠ్యాంశాలను విమర్శనాత్మకంగా అవగాహన చేసుకొని, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను పరిష్కరించు కోగలిగిన జ్ఞానం పొందవలసి యుంటుంది. కాబట్టి తరగతి గదిలో పాఠ్య విషయానికి మాత్రమే పరిమితం కాకుండా సమకాలీన అంశాలను విశ్లేషించడం ద్వారా విద్యార్థి ఫలితాలను రాబడతాడు. జరుగబోయే ఫలితాలను ఊహిస్తాడు. పాఠ్యాంశంలోని విలువలను అన్వయించుకుంటాడు. వివిధ సమకాలీన అంశాలపై తనకు గల వైఖరిని వ్యక్తం చేయగల్గుతాడు.

ఉదా॥ 9వ తరగతి 24వ పాఠం "రోడ్డు భద్రతా విద్య" బోధన జరిపేటప్పుడు హైదరాబాద్ నగరంలోని ప్రమాదాల గురించి చర్చిస్తాడు.  ఆ సమయంలో "ఈ రోజుల్లో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుటకు కారణాలు ఏమై ఉంటాయి? అనే ప్రశ్నవేసి చర్చింపజేయాలి. ఇతర ప్రశ్నలు పిల్లలు వేసేలా ప్రోత్సహించాలి.

2. 9వ తరగతి 15వ పాఠం "పారిశ్రామికీకరణ–సామాజికమార్పు" బోధించేటప్పుడు బాల కార్మికుల పరిస్థితి గురించి చర్చిస్తాం (పేజి 193). బాల కార్మికుల పరిస్థితిపై పిల్లల్ని ప్రశ్నించమనాలి. వారి స్థానిక ప్రాంతాలలో బాల కార్మికులు ఉంటే వారి గురించి మాట్లాడమనాలి.

3. 8వ తరగతి – 7వ పాఠం “ద్రవ్యం–బ్యాంకింగ్” బోధన చేసేటప్పుడు రహీం, లీల, శాంతల గురించి మాట్లాడేటప్పుడు అలాంటి పరిస్థితులున్నవారు మీ ప్రాంతాల్లో ఉన్నారా? అని ప్రశ్నించి, వారి పరిస్థితులపై చర్చింపచేయాలి.

V. **పటనైపుణ్యాలు.**

* పటనైపుణ్యాలు ఎందుకోసం?
* పట నైపుణ్యాలు ప్రతి పాఠంలో ఉంటాయా ?
* పట నైపుణ్యాల సాధన కోసం ఏయే కృత్యాలు చేయించవచ్చు?

సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకాలలో వివిధ చిత్రాలు, పటాలు ఇవ్వబడినాయి. పటాలు అందం కోసం పొందుపరచినవి కావు వాటిని చదవడం కోసం, చర్చించడం కోసం, వాటి గురించి మాట్లాడటం కోసం ఇవ్వబడినాయి. దీనితో విషయం సులభంగా అర్థమౌతుంది.

**పటనైపుణ్యాలలో ప్రధానంగా మూడు అంశాలుంటాయి.**

1. పటాలు గీయడం (Map Drawing)
2. పటాలు చదవడం (Map Reading)
3. పటాలలో వివిధ అంశాలను గుర్తించటం (Map Pointing)

**పట నైపుణ్యాలు పెంపొందించడం ఎలా?**

1. పటాలు పాఠ్యపుస్తకంలో వివిధ రంగుల్లో ఇవ్వడమైనది. వాటిని చదివి వివిధ ప్రదేశాలకు సంబంధించిన అంశాలను రాయించవచ్చు.
2. నదులు, రవాణా మార్గాలు, వివిధ ప్రదేశాలను గుర్తింపజేయవచ్చు.
3. గుర్తులు, సంకేతాలను బట్టి (పంటలు, ఖనిజాలు, పరిశ్రమలు మొ॥) విశ్లేషణలు చేయించవచ్చు.
4. రాజకీయ పటాల విశ్లేషణ – సరిహద్దులు, సరిహద్దు జిల్లాలు /రాష్ట్రాలు; సామ్రాజ్యాల విస్తరణ వంటి వాటిని గుర్తించటం, చదవటం చేయించవచ్చు.
5. అట్లాస్, గోడపటాల ద్వారా రకరకాల కృత్యాలు చేయించవచ్చు.

ఉదాహణలు :

**పటాలు గీయడం :** 1. భారతదేశం ఔట్ లైన్ పటం గీయండి.

**పటాలను చదవటం :**

2. 9వ తరగతిలోని 12వ పాఠం పేజి నెం. 145 లోని "ఇటలీలోని ప్రాంతాలు పటం పరిశీలించండి.

   a) ఈ పటములో కనిపిస్తున్న దీవులేవి?

   b) ఇటలీలోని వివిధ నగరాలు, పట్టణాల పేర్లు తెలుపుము?

**పటాల గుర్తింపు :**

3. భారతదేశ పటంలో దిగువ సూచించిన ఇనుము – ఉక్కు కర్మాగారాలను గుర్తించుము.

   1. భద్రావతి 2. భిలాయ్ 3. రూర్కెలా 4. బొకారో 5. జంషెడ్‌పూర్.

VI. **ప్రశంస / అభినందన – సున్నితత్వం**

పాఠ్యబోధన ద్వారా పిల్లల్లో "తోటి వారితో కలిసి పనిచేయటం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించటం, స్వేచ్ఛగా ప్రశ్నించటం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి లక్షణాలు, వైఖరులు అలవర్చడం ద్వారా ప్రశంస / అభినందన అనే విద్యా ప్రమాణం సాధించగలం.

**ఈ విద్యా ప్రమాణం పెంపొందించడానికి ఉపాధ్యాయులు ఏమేం చేయాలి ?**

* పిల్లలచే వివిధ సమస్యలపై తమ స్పందనను తెలిపే నినాదాలు, పోస్టర్లు, కరపత్రాలు తయారు చేయించవచ్చు.
* వివిధ సమస్యలపై విశ్లేషణ చేస్తూ పత్రికలకు, అధికారులకు లేఖలు రాయించవచ్చు.
* స్వేచ్ఛ , సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, దేశ సమైక్యత వంటి రాజ్యాంగ పరమైన విలువలు కూడా పెంపొందించాలి.
* సభలు, సమావేశాల్లో, పాల్గొనేలా ప్రోత్సహించాలి.
* జీవన నైపుణ్యాలు పెంపొందించాలి.
* వివిధ వ్యక్తులు, తోటి వారు చేసిన మంచి పనులను ప్రశంసించగలిగే వైఖరిని నిర్మాణం చేయాలి.
* దయ, ప్రేమ, వంటి మానవతా విలువలు పిల్లల్లో కల్పించాలి.
* పాఠం చర్చించేటప్పుడు పిల్లల్లో సంబంధిత images రూపం దాల్చుతాయి. ఆ images గురించి మౌఖికంగా చెప్పించాలి. లేదా రాయించాలి.

ఉదా ॥ ప్రశ్నలు

1. కళాకారులను మనం ఏ విధంగా గౌరవించాలి?

   ఈ నాడు కళాకారుల స్థితి ఎలా ఉంది ? (8వ తరగతి – పాఠం21)

2. మీ ప్రాంతంలో మత సామరస్యం సాధించడానికి ఏం చేయాలో తెలియజేస్తూ ఒక కరపత్రం తయారు చేయండి. (8వ తరగతి పాఠం 20)

3. 'సమానత్వం' ప్రధాన భావనగా 2 నినాదాలు తయారు చేయండి. (8వ తరగతి –పాఠం13)

విద్యా ప్రమాణాలు కేవలం పరీక్షల సమయంలో, ప్రశ్నాపత్రంలో ఇవ్వడానికి, విద్యార్థిని ప్రశ్నించడానికి ఉద్దేశించినవి కావు. ప్రతి పాఠం బోధించేటప్పుడు ఆ పాఠంలో ఎక్కడెక్కడ ఏయే విద్యా ప్రమాణాలు పొందుపరచబడి ఉన్నాయో ఉపాధ్యాయుడు గుర్తించి, వాటిని దృష్టి యందుంచుకొని పాఠం బోధించాలి. సమకాలీన అంశాలు ఏ సందర్భంలో చర్చించాలో ముందుగా ఆలోచించుకోవాలి. పటనైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు తరగతిగదిలో ఏయే అంశాలపై దృష్టి ఉంచాలో, అవి ఏ సమయంలో నిర్వహించాలో ప్లాన్ చేసుకోవాలి. పాఠం పూర్తయ్యేసరికి ఆ పాఠంలోని ఆరు విద్యా ప్రమాణాలు పూర్తిగా చర్చించబడాలి. విద్యార్థి ఏం నేర్చుకున్నాడో తెలుసుకోవడానికి మూల్యాంకనం ఉద్దేశించబడలేదు. మూల్యాంకనం విద్యార్థి నేర్చుకోవడానికి దోహదపడేది అనే విషయం మరువరాదు.

# 5. ఉపాధ్యాయ సంసిద్ధత - వనరులు

ఉపాధ్యాయ వృత్తిలో బాగా రాణించాలంటే ఉపాధ్యాయుడు ఎప్పటి కప్పుడు నూతన పద్ధతులు అవలంబించడం, అదనపు సమాచారం తెలుసుకొనుటకు రిఫరెన్స్ పుస్తకాలు చదవడం వల్ల వృత్తిలో నైపుణ్యం సాధించడానికి అవకాశం ఉంది. ఉపాధ్యాయుడు సరైన సంసిద్ధత లేకుండా బోధించడం వల్ల పిల్లలు మనం అనుకున్న లక్ష్యాలు సాధించలేక పోతున్నారు. దీనివల్ల పిల్లలకు సరియైన విద్యను అందించలేకపోతున్నాం. ఇప్పుడు సరైన సంసిద్ధత లేకుండా బోధించే ఒక సన్నివేశాన్నిచూద్దామా!

అది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉపాధ్యాయుడు 8వ తరగతికి వెళ్ళాడు. పిల్లలవద్ద పుస్తకం తీసుకొని భూగోళశాస్త్రంలో ఆంధ్రప్రదేశ్ నైసర్గిక మండలాల గురించి పాఠం చెప్పడం మొదలుపెట్టాడు. కేవలం పాఠ్యపుస్తకంలోని విషయాన్ని ఉపన్యాస పద్ధతిలో చెపుతున్నాడు. ఇంతలో అతనికి ఆంధ్రప్రదేశ్ – భౌతిక స్వరూపం మ్యాప్ గురించి గుర్తుకు వచ్చింది. వెంటనే రమేష్ మన ఆఫీసు రూంలో ఆంధ్రప్రదేశ్ – భౌతిక స్వరూపం పటం ఉంది. తీసుకురా అని చెప్పడం జరిగింది. రమేశ్ ఆఫీసు రూంలో పటాన్ని వెతికాడు. సార్ పటం కనిపించడం లేదు అని చెప్పాడు. ఉంది చూడు వెతికితే దొరుకుతుంది అని చెప్పాడు. రమేష్ మళ్ళీ వెళ్ళాడు. ఈలోపు పాఠం అయిపోయింది. రమేష్ పటం గురించి ఇంకా వెతుకుతూనే ఉన్నాడు.

**ఆలోచించండి :**

ఇలాంటి సందర్భం మీ కెప్పుడైన ఎదురైందా ?

ఉపాధ్యాయుడు పాఠం చెప్పడానికి సంసిద్ధుడు అయినాడా?


ఉపాధ్యాయుడు సంసిద్ధుడు కాకపోతే నష్టపోయేది ఎవరు? ఎలా?

ఉపాధ్యాయడు ఎందుకు సంసిద్ధుడు కావాలి?

ఉపాధ్యాయుడు ఎలా సంసిద్ధుడు కావాలి?

ఉపాధ్యాయుడు సంసిద్ధతతో వెళ్ళకపోతే నష్టపోయేది పిల్లలు మాత్రమే. అలాగే వృత్తిపరంగా ఎదగడానికి / సమర్థత పెంచుకోవడానికి అవకాశం ఉండదు. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్య పుస్తకానికి మాత్రమే పరిమితం కారాదు. చెప్పే పాఠ్యాంశానికి సంబంధించి అదనపు సమాచారం కోసం రెఫరెన్సు పుస్తకాలు చదివినప్పుడు మాత్రమే తరగతిలో సమర్థవంతంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించగలడు. కాబట్టి ఉపాధ్యాయుడు తరగతి గదికి ఎలా సంసిద్ధుడు కావాలో ఇప్పుడు చూద్దామా!

ఉపాధ్యాయుడి సంసిద్ధత అంటే కేవలం పాఠ్యపుస్తకం చదవడం కాదు. నిర్వహించాల్సిన బోధనాభ్యస ప్రక్రియలపై సమగ్రమైన అవగాహనతో సిద్ధం కావడం.


ఉపాధ్యాయుని సంసిద్ధత
పాఠ్యపుస్తకంలోని అన్ని పాఠాలను చదవడం
అధ్యయనం ద్వారా అదనపు సమాచారాన్ని సేకరించడం
కావలసిన వనరులు, సామగ్రిని గుర్తించడం –సేకరించడం
Reference books Journals, Magazines
స్థానికంగా లభ్యమయ్యే భౌతిక, మానవ వనరులను గుర్తించడం
పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉండే TLM గుర్తించడం, తయారీ
స్థానికంగా దొరికే వస్తు సామగ్రిని సేకరించడం
స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
ఉపాధ్యాయ శిక్షణలు
ఇంటర్‌నెట్ ద్వారా సమాచారం CD లు
సోషల్ స్టడీస్ ఫోరం
పీరియడ్ ప్రణాళిక
అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవడం
వార్షిక ప్రణాళిక
తరగతిలో భోధనాభ్యసన ప్రక్రియ నిర్వహించడం
యూనిట్ వారీగా పీరియడ్‌లను గుర్తించడం
పిల్లల అభ్యసన స్థాయిని అంచనా వేయడం
తదుపరి పీరియడ్ లక్ష్యాలను నిర్ధారించుకోవడం

## వనరులు

ఉపాధ్యాయుడు సంసిద్ధత కావడానికి అనేక వనరులు అవసరం.

**ఆలోచించండి :**

* నూతన పాఠ్య పుస్తక బోధనకు వనరులు అవసరమా? ఎందుకు?
* నూతన పాఠ్య పుస్తక బోధనకు ఏఏ వనరులు అవసరం?
* నూతన పాఠ్య పుస్తక బోధన వనరులను ఎలా సమకూర్చుకోవాలి?

తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియలు సమర్థవంతంగా నిర్వహించడానికి వనరులు దోహదపడతాయి. పిల్లలకు అదనపు సమాచారం అందించడానికి, ఒక విషయం అర్థం చేయించడానికి, పిల్లలు సామగ్రితో ప్రతిచర్యలు జరపడానికి, బోధనను ఆకర్షణీయంగా చేయడానికి, పిల్లలు అదనపు సమాచారం సేకరించడానికి, పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి, ఒక విషయం గురించి తెలుసుకొనడానికి, ప్రశ్నించడానికి వనరులు తోడ్పడుతాయి.

**సాంఘిక శాస్త్రం అవసరమైన వనరులు**

1. రెఫరెన్స్ పుస్తకాలు
   - ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల భూగోళం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం పుస్తకాలు.
   - డిగ్రీ తెలుగు అకాడమీ భూగోళశాస్త్రం
   - యోజన
   - ఇండియా టుడే
   - CBSE Books (NCERT)
   - ICSE Books
   - ఏకలవ్య Text Books
   - దినపత్రికలు
   - దిన పత్రికలలోని ఆర్టికల్స్
2. సోషల్ స్టడీస్ ఫోరాలు/క్లబ్‌లు
   - సోషల్ స్టడీస్ ఫోరం/క్లబ్‌లు
   - ఉపాధ్యాయ సంఘాలు
3. వనరుల కేంద్రాలు
   - SCERT, Hyd
   - DIET
   - జిల్లా గ్రంథాలయాలు
   - పాఠశాల గ్రంథాలయాలు

4. మానవ వనరులు
- బ్యాంక్ సిబ్బంది
- అడ్వకేట్స్
- పోలీస్ సిబ్బంది
- ప్రజా ప్రతినిధులు
- MRO, MDO, MEO

5. మీడియా
- టెలికాన్ఫరెన్స్‌లు
- Suject వారి C.D లు
- MANA T.V.
- సప్తగిరి ఛానల్

6. వెబ్‌సైట్స్
- www. weekly .com
- www. aravindaguptatoys.com
- www.pbs.org/teachers
- www.new / teaching strategies

**8వ తరగతి – కావలసిన బోధనా సామగ్రి**

1. ప్రపంచ పటం (భౌతిక, రాజకీయ)
2. గ్లోబు
3. అట్లాసు (oxford)
4. ఛార్టులు
5. భారతదేశపటం (రాజకీయ, భౌతిక)
6. 2011 జనాభా వివరాలు
7. ఆంధ్రప్రదేశ్ (భౌతికక, రాజకీయ) పటం
8. ఉష్ణమాపకం
9. భూచలనాలు (వీడియో CD)

   (a) భూభ్రమణం (b) భూభ్రమణం

10. అందుబాటులో ఉండే కొన్ని ముడిఖనిజాలు
11. వివిధ రకాల మట్టి నమూనాలు
12. కరెన్సీ - Coins - Notes పాతవి /కొత్తవి (అందుబాటును బట్టి)
13. బ్యాంకు లావాదేవీల స్టేషనరీ

    (a) చెక్కు (b) డ్రాఫ్ట్ (c) నగదు జమ ఫారం (d) నగదు తీసికొనే ఫారం

    (e)పాసుపుస్తకం (f) ATM Card (g) A/c ప్రారంభానికి అప్లికేషన్ ఫారం మొ॥వి,

14. జాతీయ నాయకుల చిత్రాలు
15. భారతరాజ్యాంగం ప్రతి
16. జాతీయ చిహ్నాలు
17. పార్లమెంటు చిత్రం
18. రాష్ట్రపతి భవన్ చిత్రం
19. FIR ఫారం నమూనా
20. BMI Chart
21. విద్యా హక్కు చట్టం ప్రతి
22. సమాచార హక్కు చట్టం ప్రతి
23. వివిధ సంగీత వాయిద్య పరికరాలు
24. వివిధ నాట్యరూపాల వీడియోలు, చిత్రాలు
25. వివిధ క్రీడోపకరణములు
26. దినపత్రికల నుండి సేకరించిన విపత్తులకు సంబంధించిన చిత్రాలు.

**క్షేత్ర పర్యటన**

1. బొగ్గుగనులు
2. అడవులు
3. బ్యాంకు
4. ATM Centre
5. ఆసుపత్రి
6. పరిశ్రమ
7. పోలీస్ స్టేషన్
8. న్యాయస్థానం
9. చౌకధరల దుకాణం
10. సినిమాహాలు సందర్శన (Projector)
11. Printing Press

**9వ తరగతి – కావలసిన బోధనా సామగ్రి**

1. అంతరిక్షం వీడియో
2. ప్రపంచ పటం
3. అట్లాసు
4. వివిధ రకాల శిలలు
5. ఛార్టులు
6. గ్లోబు
7. భారతదేశపటం
8. చిరుధాన్యాలు
9. స్థిర, చర ఆస్తులను చూపే ఛార్టు
10. యూరప్ పటం
11. ఆఫ్రికా పటం
12. ట్రాఫిక్ గుర్తులు
13. డ్రైవింగ్ లైసెన్సు వివిధ ఫారములు

**సందర్శన చేయదగినవి**

1. నక్షత్రశాల
2. బీచ్‌లు (అవకాశమున్నవారు)
3. పరిశ్రమ – (ఏదేని)
4. అటవీశాఖా కార్యాలయం
5. స్వయం సహాయక సంఘాలతో మాట్లాడించటం
6. ఆదాయ పన్నుశాఖ కార్యాలయం

8,9 నూతన పాఠ్యపుస్తకాలను పరిశీలించి అవసరమైన సామగ్రిని గుర్తించడం జరిగింది. అలాగే 6,7 తరగతుల పాఠ్య పుస్తకాలను పరిశీలించి అవసరమైన సామగ్రిని గుర్తించండి.

# 6. సాంఘిక శాస్త్ర బోధనా వ్యూహాలు

సాంఘిక శాస్త్రం నూతన పాఠ్య పుస్తకాలు ఇతి వృత్తాల ఆధారంగా రూపొందించడం జరిగింది. కాబట్టి పాఠ్యాంశాలలో వైవిధ్యం కనిపిస్తుంది. అందువలన అన్ని పాఠాలను ఒకే పద్ధతిలో బోధించడం సరియైనది కాదు. పాఠ్యాంశ స్వభావాన్ని బట్టి ఉపాధ్యాయుడు  అనువైన బోధనా వ్యూహాలను ఎన్నుకోవడం ద్వారా అనుకున్న  లక్ష్యాలు సాధించడమే కాకుండ, పిల్లలు బోధనాభ్యాసన ప్రక్రియలో చురుకుగా పాల్గొనడానికి అవకాశం ఉంది. కావున సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలను బోధించడానికి ఎటువంటి బోధనా వ్యూహాలను అనుసరించాలో చూద్దామా?


| | | | |
|---|---|---|---|
| 1. | మైండ్ మ్యాపింగ్ | 2. | సెమినార్ |
| 3. | మీట్‌ది ప్రెస్ | 4. | యూత్ పార్లమెంట్ |
| 5. | మాదిరి ఎన్నికలు | 6. | క్షేత్ర పర్యటన |
| 7. | పోస్టర్స్ అండ్ బ్రోచర్స్ | 8. | క్విజ్ |
| 9. | **KWL** | 10. | ఏకపాత్రాభినయం |
| 11. | తరగతి గది కార్యశాల | 12. | రీడింగ్ అండ్ రీరైటింగ్ ది టెక్ట్స్ |

ఒక్కొక్క బోధనా వ్యూహం గురించి విపులంగా చర్చిద్దామా!

## 1. మైండ్ మ్యాపింగ్

విద్యార్థులకు ఏదైనా అంశం / భావనను ఇచ్చి ఆలోచింపచేసి, వారి నుండి వచ్చిన ఆలోచనలను క్రోడీకరించి ముగింపు ఇవ్వడం.

ఉదా: 8వ తరగతిలో బ్యాంకింగ్ అనే పాఠం చెప్పేటప్పుడు బ్యాంకింగ్ గురించి మీకేమి తెలుసో చెప్పండి. అని అడిగినప్పుడు పిల్లలు బ్యాంకింగ్ గురించి ఆలోచిస్తారు. పిల్లలు చెప్పిన సమాధానాలను మైండ్ మ్యాపింగ్ చుట్టూ రాయాలి.



మైండ్ మ్యాపింగ్ నిర్వహించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పిల్లలు ఒక విషయంపై విభిన్న ఆలోచనలను ఒక చోటుకి చేర్చి ఒక నిర్ణయానికి రావడం వల్ల ఇది సహజ నిర్మాణాత్మక వాదంగా చెప్పవచ్చు. అలాగే పిల్లలందరూ ఆలోచించడం, పాల్గొనడం వల్ల క్రియాశీల అభ్యసనం జరుగుతుంది. ఇంకా విద్యార్థుల పూర్వ అనుభవాల ఆధారంగా నూతన విషయంతో జ్ఞానం అనుసంధానం కావడం వల్ల అర్థవంతమైన అభ్యసనం జరుగుతుంది. ఇది విద్యార్థి కేంద్రీకృతంగా ఉంటుంది. ఎందుకంటే పిల్లలే స్వయంగా అభ్యసనంలో పాల్గొంటారు. ఉపాద్యాయుడు కేవలం (ఫెసిలిటేటర్‌గా) సౌకర్యకర్తగా ఉంటాడు. దీంట్లో పిల్లలు అందరూ భాగస్వాములు కావడం జరుగుతుంది. కాబట్టి ఉపాధ్యాయుడు బోధన–అభ్యసన ప్రక్రియలో మైండ్ మ్యాపింగ్‌ను ఒక ముఖ్యమైన బోధనా వ్యూహంగా అమలుపరచవచ్చు.

**2. సెమినార్ :** (దీనిని విద్యార్థులు నిర్వహించాలి)

ఏదైనా ఒక అంశంపై విద్యార్థులకు ముందే సమాచారం ఇచ్చి, అవసరమయిన వనరులను కూడా చెప్పి ఒక పత్రం తయారుచేసుకోమనాలి. తయారు చేసిన పత్రం కాపీలు తరగతిలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలి. తరగతి గదిలో తాను రూపొందించిన పత్రాన్ని ఒక్కొక్క విద్యార్థికి ఒకటి ఇవ్వాలి. తరువాత తాను రూపొందించిన (పత్రం) అంశం గురించి విశదీకరించాలి. దీని తరువాత విద్యార్థులు తమ సందేహాలను అడగాలి. సెమినార్ పత్రం సమర్పించిన విద్యార్థి సందేహాలను నివృత్తి చేయాలి. ఇలా 8వ తరగతిలోని బ్యాంకింగ్, చట్టం, న్యాయం, పేదరికం, హక్కులు, లౌకికతత్వం, సినిమా వీటిపై ఉపాధ్యాయుడు విద్యార్థులకు సెమినార్ నిర్వహించడానికి అవసరమయిన సహాయ, సహకారాలు అందించాలి. అదే విధంగా 9వ తరగతిలో కూడా రుణాలు, ధరలు, పన్నులు , మానవ హక్కులు, మహిళా చట్టాలు, విపత్తులు లాంటి అంశాలపై విద్యార్థులకు అవకాశం ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థి ఒక విషయంపై లోతుగా ఆలోచించడమే కాకుండా అదనపు సమాచారం సేకరించడం వల్ల అతనికి సమగ్రమైన అవగాహన ఏర్పడుతుంది.

**3. మీట్ ది ప్రెస్:**

బోధనా వ్యూహాలలో పిల్లలు ఆసక్తిగా పాల్గొనడానికి అవకాశం ఇచ్చేది మీట్ ది ప్రెస్. దీని కోసం తరగతి లోని కొంతమంది విద్యార్థులను పత్రికా విలేఖరులుగా నియమించి, వారికి కేటాయించిన అంశాలకు ప్రశ్నలను తయారు చేసుకోమనాలి. విద్యార్థులలో మరికొందరిని ఎంపిక చేసి నాయకులుగా గుర్తించాలి. వారికి ఒక్కొక్కరికి ఒక్కో అంశం కేటాయించాలి. మిగిలిన పిల్లలు జరుగుతున్న సంభాషణను నిశితంగా పరిశీలించాలి.

నిర్వహణా విధానం :

నాయకులుగా గుర్తించిన పిల్లలను డయాస్ పైన కూర్చొనబెట్టాలి. వారు, వారికి కేటాయించిన అంశంపై ఒక్కొక్కరు మాట్లాడాలి. వీరు మాట్లాడిన తరువాత ఆయా అంశాలపై పత్రికా విలేఖరులుగా పాల్గొన్న విద్యార్థులు వారికున్న సందేహాలను ప్రశ్నల రూపంలో అడగాలి. పైన కూర్చున్న విద్యార్థులు ఎవరి అంశానికి సంబంధించిన ప్రశ్న అయితే వారు సమాధానం

అవ్వాలి. ఇలా నిర్వహిస్తున్నప్పుడు మిగిలిన విద్యార్థులు పాత్రికేయ విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలను, డయాస్ పైన కూర్చున్న విద్యార్థులు ఇస్తున్న సమాధానాలను పరిశీలిస్తూ ముఖ్యాంశాలను నోటు పుస్తకములో రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల విషయం గురించి అందరు విద్యార్థులకు అవగాహన  ఏర్పడుతుంది.

ఉదా: హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్య ఉద్యమం, చట్టం, న్యాయం, మహిళల రక్షణ చట్టాలు, రోడ్డు భద్రతా విద్య, భారతదేశంలో సేవా కార్యకలాపాలు మొదలైనవి.

**4. యూత్ పార్లమెంట్**

"పాఠశాలపట్ల ఆసక్తి, అభిరుచి ఉండి, చురుకుగా ఉంటూ స్పష్టంగా, ధారాళంగా మాట్లాడే విద్యార్థుల స్వీయ భాగస్వామ్యంలో, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడి మార్గదర్శకత్వంలో, రాష్ట్ర స్థాయిలో శాసనసభలో, కేంద్ర స్థాయిలో లోకసభలో జరిగే సమావేశాల తరహాలో నిర్వహించుకొనే "ఆసక్తికరమైన కార్యక్రమం" యూత్ పార్లమెంట్.

**ఎవరిని భాగస్వాములను చేయాలి?**

- చురుకైన / ఆసక్తిగల విద్యార్థులు
- పాఠశాలపట్ల ఆసక్తిగల విద్యార్థులు
- గ్రామస్థులు
- తల్లి దండ్రులు

**బాధ్యతల పంపిణీ / సంసిద్ధతా క్రమం :**

ప్రణాళిక (Planning)

తయారీ (Preparation)

ప్రదర్శన / అమలు (Presentation / implementation)

మూల్యాంకనం (Evaluation)

**ప్రణాళిక :**

- పాల్గొనే విద్యార్థులను ఎంపిక చేయాలి.
- వారిలో నుండి మంత్రులుగా కొంతమందిని మరికొంతమందిని అధికార పార్టీ యం.ఎల్.ఎ.లు గా నియమించాలి.
- ప్రధానోపాధ్యాయునికి సమాచారం ఇచ్చి అనుమతి తీసుకోవాలి.
- తోటి ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి.
- అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలి.

- తల్లితండ్రులు / గ్రామస్థులకు తెలియజేయాలి.
- కనీసం 10 రోజుల ముందుగా ప్రణాళిక చేసుకోవాలి. వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలను సిద్ధం చేసుకోమని చెప్పాలి.

**ప్రక్రియ (Process)**

1. స్పీకర్, సి.యం, ప్రతిపక్షనేత, మంత్రులు (అంగరక్షకులతో సహా), శాసనసభ్యులు, ప్రెస్ వారికి కేటాయించిన స్థలంలో (cards / charts వ్రాసి, బోర్డ్‌లు ఏర్పాటు చేసి) కూర్చోబెట్టాలి.
2. స్పీకర్ అనుమతితో సభ్యుల పరిచయం
3. ప్రశ్నోత్తరాల కార్యక్రమం – ముఖ్యమైన శాఖలకు సంబంధించిన, సమకాలీన సమస్యలకు సంబంధించిన ప్రశ్నలు అడిగే కార్యక్రమం (ప్రతిపక్ష సభ్యులచే)
4. మంత్రుల సమాధానాలు
5. ప్రతిపక్షనేత సందేశం
6. సభ వాయిదా

**5. మాదిరి ఎన్నికలు :**

గ్రామ స్థాయి నుండి రాష్ట్ర, కేంద్రస్థాయి వరకు జరిగే ఎన్నికల విధానంను పాఠశాలలో మాదిరి ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎన్నిక పద్ధతి అవగాహన అవుతుంది.

8వ తరగతిలో 3వ థీమ్ లోని 14వ పాఠ్యాంశం పార్లమెంట్, కేంద్ర ప్రభుత్వాన్ని ఈ మాదిరి ఎన్నికల విధానంతో బోధించవచ్చును.

ఉదాహరణకు తరగతి గది నాయకుడిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఎన్నుకొనే విధానం నిర్వహించడం

**6. క్షేత్ర పర్యటన :**

విద్యార్థులకు ప్రత్యక్ష పరిశీలన ద్వారా విషయ పరిజ్ఞానం ఎక్కువ కాలం (శాశ్వతంగా) గుర్తుండి పోతుంది. అదే విధంగా పూర్వ భావనలను ప్రత్యక్ష పరిశీలనకు అనుసంధానం చేయడం ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. కాబట్టి ఉ పాధ్యాయులు క్షేత్ర పరిశీలనకు అవకాశం కల్పించాలి. ఉదా॥ బ్యాంకింగ్, ప్రజారోగ్యం, కోర్ట్, పార్లమెంట్, వ్యవసాయం – పంటలు, మార్కెట్ – ధరలు రోడ్డు సిగ్నల్ మొ॥నవి.

**7. పోస్టర్స్ & బ్రోచర్స్ :**

విద్యార్థులు ఏదైనా ఒక విషయం గురించి చైతన్యం కలిగించడానికి వారే స్వయంగా పోస్టర్స్ అండ్ బ్రోచర్స్ తయారు చేయుటకు అవకాశం కల్పించాలి. దీనివల్ల విషయము తక్కువ కాలంలో ఎక్కువ మందికి తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. అలాగే భవిష్యత్తులో కూడా ఏదైనా ఒక విషయం పట్ల లోతుగా చర్చించడానికి అవకాశం ఉంటుంది. ఉదా॥కు మహిళలకు ఉన్న హక్కులు – చట్టాలు గురించి పోస్టర్స్ రూపంలో తయారుచేయడం. మహిళల చట్టాల గురించి అవగాహన కలిగించుటకు, చైతన్యపరచుటకు బ్రోచర్ రూపంలో తయారు చేసి పంచడం.

ఇలా అనేక సమస్యలపై స్వయంగా పోస్టర్స్ అండ్ బ్రోచర్స్ తయారు చేయడానికి విద్యార్థులను ప్రోత్సహించాలి. అంటే ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థుల చేత తయారు చేయించాలి. దీనివల్ల పిల్లలు స్వయంగా పాల్గొనడం వల్ల పాఠ్యాంశాలలోని విషయం బాగా అర్థం అవుతుంది.

**8. క్విజ్ :**

సాంఘిక శాస్త్రం బోధించే ఉపాద్యాయులు తమ బోధనా వ్యూహంలో క్విజ్ కార్యక్రమాలను చేర్చడం అనేది తప్పనిసరి. ఇందుకోసం ఉపాధ్యాయుడు ఒక రోజు ముందుగానే విద్యార్థులకు పాఠ్యాంశం ఏమిటో తెలియజేయాలి. మరుసటి రోజు అందులో పాల్గొనే విద్యార్థులను (3-4) గ్రూపులుగా చేసి వారి మధ్య క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించాలి. మిగిలిన విద్యార్థులు ఈ ప్రశ్నలు రాస్తూ, జవాబులు ఆలోచిస్తూ, ఒకవేళ క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులు జవాబులు చెప్పలేక పోయినట్లయితే తామే జవాబులు చెప్పాలి. క్విజ్ కార్యక్రమం ఆశించిన ఫలితం ఇవ్వడానికి ఉపాధ్యాయుడు ముందుగానే ప్రశ్నలను సిద్ధం చేసుకొని ఉంచుకోవాలి.

**9. KWL**

నూతన పాఠ్య పుస్తకాలు పిల్లలు చదివి స్వయంగా అర్థం చేసుకొనేలా ఉన్నాయి. కాబట్టి ఉపాధ్యాయుడు KWL టెక్నిక్ ద్వారా పిల్లల అనుభవాలకు, పరిసరాలకు దగ్గరి సంబంధం ఉండే పాఠ్యాంశాలకు దీనిని అమలు చేయాలి. దీంట్లో

K అనగా : What I know (నాకేమి తెలుసు)

W అనగా : What I have to know (నేనేమి తెలుసుకోవాలి)

L అనగా : What I have learnt (నేనేమి తెలుసుకున్నాను)

ఇందులో పాఠ్యాంశం గురించి ఏమి తెలుసో, ఏమేమి తెలుసుకోవలెనో, ఏమేమి తెలుసుకున్నామో విద్యార్థికి అర్థం అవుతుంది. ఉదా॥ కు 8వ తరగతిలోని అడవులు – వినియోగం, సంరక్షణ, జీవనోపాధులు, పేదరికం అవగాహన మొదలయినవి.

9వ తరగతిలో భారతదేశంలో వ్యవసాయం, భారతదేశంలో సేవా కార్యక్రమాలు, రోడ్డు భద్రత విద్య మొదలైనవి.

## 10. ఏకపాత్రాభినయం

పిల్లలు ఒక పాత్రకు సంబంధించి తనలోని భావాలని వ్యక్తపరచడమే ఏకపాత్రాభినయం.

చరిత్రకు సంబంధించిన రాజుల వీరగాథలు ఏకపాత్రాభినయం ద్వారా చేయించినట్లయితే అభ్యసనం బాగా జరుగుతుంది. ఉదా: అల్లూరి సీతారామరాజు, కొమరం భీం.

## 11. తరగతిగది కార్యశాల

తరగతివారీగా ఆయా తరగతుల పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశాలకు, అనుగుణంగా పిల్లలతో అవసరమైన సామగ్రిని తయారు చేయించడమే తరగతి గది కార్యశాల పని. దీనికి ఉపాధ్యాయుడు ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి. పిల్లలకు కావలసిన సామగ్రిని అందుబాటులో ఉంచి, కార్యశాలను నిర్వహించాలి.

ఉదా : సమాచార పట్టికలు తయారుచేయడం.

ఇంకా 6,7,8,9 తరగతులకు ఏఏ సామగ్రి  పిల్లలతో తయారు చేయించవచ్చో పరిశీలించి పట్టిక తయారు చేయండి.

## 12. రీడింగ్ మరియు రీ రైటింగ్ ద టెక్స్ట్

నూతన పాఠ్యపుస్తకాలలో విద్యార్థులు చదవడానికి వీలుగా సరళమైన భాషను ఉపయోగించడం జరిగింది. ఉపాధ్యాయుడు పిల్లల నేపథ్యానికి , అనుభవాలకు , పరిసరాలకు దగ్గరగా ఉన్న పాఠ్యాంశాల బోధనలతో ఈ బోధనా వ్యూహాన్ని అనుసరించాలి. దీనిలో మొదట విద్యార్థులను చదవమనాలి. తర్వాత పిల్లలకు ఏమి అర్థమయిందో చెప్పమనాలి. దీనివల్ల పిల్లలలో స్వీయ అభ్యసనం జరుగుతుంది.

6,7,8,9 తరగతుల పాఠ్య పుస్తకాలలో ఏఏ పాఠ్యాంశాలు ఈ బోధనా వ్యూహానికి అనుకూలంగా ఉన్నాయో గుర్తించండి.

సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పాఠ్యాంశ స్వభావానికి అనుగుణంగా ఏ బోదనా వ్యూహం సరియైనదో నిర్ణయించుకొని అమలు చేయాలి. దీనివల్ల పిల్లలు ఉత్సాహంగా బోధనాభ్యసన ప్రక్రియలో భాగస్వాములు అవుతారు.

## 7. పాఠ్య బోధనా సోపానాలు - అవగాహన, మాదిరి పాఠ్య / పీరియడ్ ప్రణాళిక

సాంఘిక శాస్త్రం అంటే సమాజాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేయటం. ప్రస్తుతం మన తరగతి బోధనలో పిల్లలు సమాజం గురించి కానీ, ఇతర జ్ఞాన వ్యవస్థల గురించి గానీ, చట్టసభల గురించి కానీ, సైన్స్ రంగాలు, ఉత్పత్తి రంగాలు, న్యాయ సంస్థలు, మొదలగు వాటి గురించి విమర్శనాత్మకంగా ఆలోచించడం, ప్రశ్నించడం చేయగల్గుతున్నారా? ఆలోచించండి. ప్రస్తుతం మనం పాటిస్తున్న ఉపన్యాస పద్ధతి వలన పిల్లలు చదవడం- ఉపాధ్యాయులు అర్థం చెప్పడం. ఉపాధ్యాయుడే చదివి అర్థం చెప్పడం, చేయడం వల్ల సాంఘిక శాస్త్ర లక్ష్యాలు సాధించబడతాయా! ఆలోచించండి.

కాబట్టి దీనిని సాధించడానికి ఉపాధ్యాయుడు మొదట ప్రతిపాఠానికి ప్రణాళిక రూపొందించడం వల్ల వార్షిక ప్రణాళికను సమర్థవంతంగా అమలుచేయవచ్చు. కాబట్టి ప్రతి పాఠానికి పీరియడ్స్ కేటాయించుకొని పాఠాన్ని పూర్తిగా చదివి ఏ పీరియడ్‌లో ఏమి చేయాలి అని ఒక గ్రిడ్ రూపంలో తయారు చేసుకోవడం వల్ల పీరియడ్ ప్రణాళికను తయారు చేసుకోవడం సులభం. దీనివల్ల బోధనాభ్యసన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించవచ్చు. పిల్లలు విమర్శనాత్మకంగా ఆలోచించేలా, ప్రశ్నించేలా, సమాచారం సేకరించేలా, పట నైపుణ్యాలు సాధించేలా, సమకాలీన అంశాలపై ఆలోచించడం, చర్చించడం, ప్రశ్నించటం చేసినప్పుడే పిల్లల్లో మనం ఆశించే సామర్థ్యాలు సాధించడానికి దోహదపడుతుంది. కాబట్టి ఇప్పుడు 8,9 తరరగతుల నూతన పాఠ్యపుస్తకాలలో మొదటి పాఠాలకు పాఠ్య ప్రణాళికను గ్రిడ్ రూపంలో ఎలా తయారు చేయవచ్చో చూద్దామా!

**8వ తరగతి**

**1. పటాల అధ్యయనం - విశ్లేషణ**

**పీరియడ్ల విభజన - ప్రణాళిక**

| పీరియడ్ల సంఖ్య | అంశం | ఇంటిపని |
|---|---|---|
| 1. | చిత్రం - పటం మధ్యగల తేడాలు<br>పటాల-చరిత్ర<br>పటాల ఉపయోగాలు<br>(1వ పేజీ నుండి 3వ పేజీలోని ఎడమ వైపు ఉన్న రెండు పేరాలు వరకు) | . మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి లోని 1,2 ప్రశ్నలు<br>. వివిధ కాలాల్లో తయారు చేసిన పటాలపై వ్యాఖ్యానిస్తారు.<br>. ప్రపంచ పటంలో దేశాలను గుర్తించండి. |
| 2. | 3వ పేజీ నుండి 6వ పేజీలోని ప్రక్షేపణం వరకు)<br>- అక్షాంశాలు - రేఖాంశాలు<br>- గ్రిడ్<br>- పటాల అధ్యయనం<br>- పటాల తయారి | మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి లోని<br>. 4వ ప్రశ్న<br>. దేశాలను గుర్తించి, పటాలను పరిశీలించడం<br>. అట్లాసులో యూరప్ పటాన్ని పరిశీలించి అక్షాంశ, రేఖాంశాలు ఏ ఏ దేశాల గుండా పోతున్నాయో పట్టిక తయారు చేయండి |

| పీరియడ్ల సంఖ్య | అంశం | ఇంటిపని |
|---|---|---|
| 3. | – ప్రక్షేపణం<br>– వలసల ఏర్పాటు<br>– పటాల తయారి – పటాల అవసరం<br>(6 పేజీలోని ప్రక్షేపణం నుండి 8వ పేజీలోని మనకాలంలో పటాల వినియోగం వరకు) | . మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి లోని 3,5 వ ప్రశ్న<br>. బ్రిటిష్ కాలంలో తయారు చేసిన భారతదేశ పటాన్ని చదవడం<br>. పటాల తయారీ గురించి ప్రశ్నించడం |
| 4. | పటాల వినియోగం<br>వివిధ విషయ నిర్దేశిత (థీమాటిక్) పటాలు<br>8వ పేజీలోని మనకాలంలో పటాల వినియోగం నుండి 9వ పేజీ చివరిపేరా కంటే ముందు పేరా వరకు) | . మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి లోని 6వ ప్రశ్న (వ్యాఖ్యానించడం)<br>. పటాల వినియోగం గురించి ప్రతిస్పందించడం<br>. పటాలు తయారీ చేసిన వారి గొప్పతనం (ప్రశంస) |
| 5. | జన సాంద్రత<br>సంకేతాలు<br>కాంటూరు రేఖలు<br>9వ పేజీలోని చివరిపేరా నుండి 13వ పేజీలోని రెండు పేరాల వరకు) | . జన సాంద్రత<br>. జన సాంద్రత<br>. సంకేతాలపై వ్యాఖ్యానించడం |
| 6. | అట్లాసు<br>వార్షిక సగటు వర్షపాతం<br>మృత్తికలు<br>అడవులు<br>ఖనిజాలు<br>(పేజీ నెం 13లోని రెండో పేరాగ్రాఫ్ నుండి 16 వ పేజీ వరకు) | . వివిధ అంశాల సమాచారాన్ని సేకరించడం<br>. మృత్తికలు – రకాలు (తేడాలు) (విషయావగాహన)<br>. అరుణాచల ప్రదేశ్ ప్రజల జీవన విధానాన్ని ఊహించండి.<br>. (వ్యాఖ్యానించడం) |
| 7. | మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి<br>17వ పేజీలోని ప్రశ్నలు | . విషయావగాహన<br>. వ్యాఖ్యానించడం<br>. పటనైపుణ్యాలు<br>. ప్రతిస్పందన |

ఒక పాఠానికి పాఠ్యప్రణాళిక గ్రిడ్ రూపంలో తయారు చేయడం వల్ల పీరియడ్ ప్రణాళిక తయారు చేసుకోవడం చాలా సులభంగా ఉంటుంది. కావున మీరు కూడా ఇలాగే అన్ని పాఠాలకు పాఠ్య ప్రణాళిక తయారు చేయండి.

అలాగే తరగతిలో పూర్తి స్థాయిలో బోధనాభ్యాసన ప్రక్రియలు నిర్వహించడానికి బోధనా సోపానాల గురించిన అవగాహన అవసరం. కాబట్టి సాంఘిక శాస్త్ర బోధనకు ఎలాంటి సోపానాలుండాలో ఒకసారి చూద్దామా !

## మాదిరి పాఠం - సోపానాలు

**పాఠం లక్ష్యాలు** :

(పాఠం లక్ష్యాలు ఆరు విద్యా ప్రమాణాలను ప్రతిబింబించే విధంగా ఉండాలి)

**I. ఉపోద్ఘాతం**

1. పలకరింపు :
2. మైండ్ మ్యాపింగ్ / పునశ్చరణ ప్రశ్నలు :
3. పాఠ్యాంశ ప్రకటన :

**II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట**

1. గుర్తించుట :
2. అవగాహన కల్గించుట :

**III. భావనల అవగాహన - చర్చ**

1. మాట్లాడించుట : పిల్లలు చదివిన అంశంపై మాట్లాడించుట
2. ప్రశ్నించుట : చదివిన పాఠ్యాంశంపైన, అర్థంకాని అంశాలపైన పిల్లలు ప్రశ్నలు అడుగుట
3. పాఠ్యాంశ భావనలపై అవగాహన ప్రశ్నలు :

   ఉపాధ్యాయుడు సమకాలీన అంశాలను జోడిస్తూ, పాఠ్యాంశం అవగాహన ప్రశ్నలు / చిత్రం లేదా పటంపై ముందుగా తయారుచేసుకున్న ప్రశ్నలను నల్లబల్లపై రాయుట.

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయుట :**

సమాచార నైపుణ్యాలు :

పట నైపుణ్యాలు :

**IV. ఇంటి పని :**

బోధనా సోపానాల గురించి తెలుసుకున్నారు కదా మరి తరగతి గదిలో వీటిని నిర్వహించడానికి ఒక్కొక్క సోపానం గురించి వివరంగా తెలుసుకుందామా!

**I. ఉపోద్ఘాతం :**

ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి ప్రవేశించిన తరువాత మొదట తానే పిల్లలను పలకరించాలి. తరువాత చెప్పబోయే పాఠ్యాంశానికి సంబంధించి భావనలపై మైండ్ మ్యాపింగ్ / కాన్సెప్ట్ మ్యాపింగ్ ద్వారా పిల్లల పూర్వ అనుభవాలను తెలుసుకోవాలి.

దీని వల్ల చెప్పబోయే భావనల గురించి పిల్లలకు ఏమి తెలుసో, ఉపాధ్యాయుడు తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఉపాధ్యాయునికి తాను ఏమి అందించాలో ఒక అవగాహన ఏర్పడుతుంది. అలాగే ఒకే భావన రెండో పిరియడ్‌లో కూడా చెబుతున్నప్పుడు మొదటి పీరియడ్‌లో నేర్చుకొన్న అంశాలపై పునశ్చరణ ప్రశ్నలు అడగాలి. తరువాత పాఠ్యాంశ ప్రకటన చేయాలి. నల్లబల్లపై వ్రాయాలి.

II. **పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :**

ఉపాధ్యాయుడు చెప్పబోయే పాఠ్యాంశానికి సంబంధించి పిల్లలను వ్యక్తిగతంగా చదవమనాలి. పాఠంలోని విషయాలను చిత్రాలను, పట్టికలను, పటాలను, గ్రాఫ్‌లను పరిశీలించి అవగాహన చేసుకోమనాలి. పిల్లలను పాఠం చదివిన తరువాత తమకు అర్థం గాని భావనలు, సాంకేతిక పదజాలం, తెలియని పదాల క్రింద పెన్సిల్‌తో గీత గీయమనాలి.

ఉపాధ్యాయుడు పిల్లలకు తెలియని పదాలు, గీత గీసిన వాటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. తెలియని పదాలను విద్యార్థులు ఒక్కొక్కరుగా చెబుతూ ఉంటే ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి. ఉపాధ్యాయుడు ఒక్కొక్క పదాన్ని పిల్లలచే చర్చింపజేసి పాఠ్యాంశంపై అవగాహన కల్గించాలి.

III. **భావనల అవగాహన – చర్చ :**

ఉపాధ్యాయుడు పిల్లలచేత  పాఠ్యాంశం గురించి మాట్లాడించాలి. అందరు పిల్లలు మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి. తర్వాత పాఠ్యాంశంలో తమకు అర్థం కాని మరియు సమకాలీన అంశాలపై పిల్లలు ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. వాటిని నల్ల బల్లపైన వ్రాయాలి. తరువాత ఉపాధ్యాయుడు పాఠంలోని విషయము / చిత్రము / పటము / గ్రాఫ్ / పట్టిక గురించి అవగాహన చేయించడానికి కొన్ని ఆలోచింపజేసే ప్రశ్నలు (విద్యా ప్రమాణాల ఆధారంగా) నల్లబల్లపై రాయాలి. ఈ ప్రశ్నలను మొత్తం తరగతి కృత్యంగా నిర్వహించాలి. ఉపాధ్యాయుడు ఒక్కొక్క ప్రశ్నకు  పిల్లలు చెప్పిన సమాధానాలను నల్లబల్లపై ముఖ్యాంశాలుగా concept maping చుట్టూ రాయాలి. ఒకవేళ పిల్లల నుండి సరియైన సమాధానం రాకపోతే ఉపాధ్యాయుడు సమాధానాన్ని  తాను కూడా జోడించాలి. ఇలా concept maping చుట్టూ ముఖ్యంశాలు రాస్తూ, ఉపాద్యాయుడు ప్రశ్నల వారీగా మొత్తం పాఠ్యాంశంపై అవగాహన కల్పించాలి.

**నైపుణ్యాలను అభ్యాసం చేయడం.**

ఉపాధ్యాయుడు సమాచార నైపుణ్యాలు, పట నైపుణ్యాలను తరగతి గదిలో అభ్యాసం చేయించాలి. పాఠ్యాంశంలోని సమాచార పట్టికలను పూర్తి చేయించడం, విషయం ఆధారంగా పట్టికలను తయారు చేయించడం, పట్టిక ఆధారంగా ప్రశ్నలు ఇచ్చి విశ్లేషింపచేయడం, పట్టిక ఆధారంగా గ్రాఫ్ రూపంలో చూపటం, గ్రాఫ్ ఆధారంగా ప్రశ్నలు ఇచ్చి విశ్లేషింపచేయడం వంటివి తరగతి గదిలో ఉపాధ్యాయుడు పిల్లలతో అభ్యాసం చేయించాలి. ఒక వేళ చెప్పే పాఠంలో సమాచార నైపుణ్యాలకు అవకాశం లేనట్లయితే ఉపాధ్యాయుడు స్వయంగా పట్టికలను తయారు చేయడం, టెక్ట్స్, గ్రాఫ్‌లను సేకరించి పిల్లలచే అభ్యాసం

చేయించడం. ఇలా అభ్యాసం చేయించడం వల్ల పిల్లల్లో సమాచార నైపుణ్యాలైన సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ధారణకు రావడం వంటివి పెంపొందుతాయి.

అలాగే పట నైపుణ్యాలలో పాఠ్యాంశంలోని పటాలను పరిశీలించటం, గుర్తించడం, విశ్లేషించడం, గీయడం వంటివి పిల్లలచే అభ్యాసం చేయించాలి. ఒక వేళ పాఠ్యాంశంలో పటాలు లేనట్లయితే ఉపాధ్యాయుడు స్వయంగా పాఠ్యాంశానికి అనుబంధ అంశాలపై పటాలను సేకరించి పిల్లలచే అభ్యాసం చేయించాలి. అలాగే పటాలు గీయడంలో తరగతి గది మొదలుకొని భారతదేశ పటం వరకు అభ్యాసం చేయించాలి.

**IV. ఇంటిపని :**

ఉపాధ్యాయుడు తరగతి గదిలో చర్చించిన ప్రశ్నలకు / చిత్రాలకు / పటాలకు / గ్రాఫ్‌లకు / పట్టికలకు సంబంధించిన వాటి సమాధానాలను విద్యార్థులను తరగతి గదిలో రాయమనాలి. ఒకవేళ సమయం లేనట్లయితే విద్యార్థులను ఇంటిదగ్గర సమాధానాలు రాసుకు రమ్మనాలి.

బోధనా సోపానాల గురించి వివరంగా తెసులుకున్నాం కదా ! మరి ఇప్పుడు పాఠానికి పీరియడ్ ప్రణాళిక ఎలా రాయాలో చూద్దాం. మొదటి పీరియడ్ ప్రణాళిక రాసే ముందు పాఠం మొత్తానికి లక్ష్యాలు రాసుకోవాలి. దీనివల్ల పాఠం పూర్తి అవగాహన కావడమే గాక, పిల్లల్లో ఏ ఏ సామర్థ్యాలు పెంపొదించాలో కూడా తెసుస్తుంది. పాఠం లక్ష్యాలు విద్యా ప్రమాణాల వారిగా రాయాలి.

## 8వ తరగతి

## పటాల అధ్యయనం - విశ్లేషణ

**పాఠం లక్ష్యాలు :**

I. **విషయావగాహన**

- చిత్రాలు, పటాల మధ్యగల తేడాలను చెప్పగలరు.
- పటాల చరిత్రను వివరిస్తారు
- పటాల రకాలను బట్టి వర్గీకరిస్తారు.
- పటాల సహాయంతో భౌగోళిక పరిస్థితులు, శీతోష్ణస్థితుల గురించి విశ్లేషిస్తారు.
- ప్రాచీన పటాల సహాయంతో భౌగోళిక పరిస్థితులు, శీతోష్ణస్థితుల గురించి విశ్లేసిస్తారు.
- ప్రాచీన పటాల సహాయంతో ప్రాచీన నాగరికత విశేషాలను వర్ణిస్తారు.
- పటాల తయారీ అవసరం ఎందుకు ఏర్పడిందో కారణాలను చెప్పగలరు.
- సంకేతాల గురించి వివరిస్తారు.

II. **పాఠ్యాంశం చదివి, అర్థం చేసుకుని వ్యాఖ్యానించుట.**

- వివిధ కాలాల్లో తయారు చేసిన పటాలపై వ్యాఖ్యానిస్తారు.
- వలసల ఏర్పాటు, వనరుల దోపిడి గురించి వ్యాఖ్యానిస్తారు.

III. **సమాచార నైపుణ్యాలు**

- అక్షాంశ, రేఖాంశాలు ఏఏ దేశాల గుండా పోతున్నాయో పట్టిక తయారు చేయగలరు.
- వార్షిక సగటు వర్షపాతం, మృత్తికలు, అడవులు, ఖనిజాల గరించి సమాచారాన్ని సేకరిస్తారు.

IV. **సమకాలీన అంశాలపై ప్రతిస్పందన, ప్రశ్నించడం.**

- పటాల వినియోగం వల్ల జరిగిన పరిణామాలపై ప్రతిస్పందిస్తారు.
- పటాల తయారీ గురించి ప్రశ్నిస్తారు.

V. **పట నైపుణ్యాలు**

- ప్రపంచ పటంలో దేశాలను గుర్తిస్తారు.
- భారతదేశ పటంలో జన సాంద్రత గల రాష్ట్రాలకు రంగులు వేస్తారు.
- భారతదేశ పటంలో వార్షిక సగటు వర్షపాతం, అడవులు, మృత్తికలు, ఖనిజాల గురించి పరిశీలించి విశ్లేషిస్తారు.

VI. **ప్రశంస - సున్నితత్వం**

- పటాలు తయారు చేసిన వారి గొప్పతనాన్ని ప్రశంసిస్తారు.


# పీరియడ్ ప్రణాళిక - 1

## I. ఉపోద్ఘాతం

### 1. పలకరింపు :

గుడ్ మార్నింగ్ పిల్లలూ ఎలా ఉన్నారు ? సెలవులు ఎలా గడిపారు? సెలవులలో ఎక్కడికైనా వెళ్ళారా ? కొత్త నగరాలు, ప్రదేశాలకు వెళ్ళాలంటే ఏమి చేస్తారు ? ఈ రోజు మనం పటాల గురించి కొత్త పాఠ్య పుస్తకాలలో ఏముందో తెలుసుకుందాం ? తెలుసుకునేముందు పటాల గురించి మీకు ఏమి తెలుసో చెప్పండి.

### 2. మైండ్ మ్యాపింగ్ :




### 3. పాఠ్యాంశ ప్రకటన :

**పటాల అధ్యయనం**

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

## II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట:

పిల్లలూ....... పాఠ్య పుస్తకం తీయండి. మొదటి పాఠంలో 1వ పేజీ నుండి 3వ పేజీలోని ఎడమ వైపు ఉన్న రెండు పేరాల వరకు చదవండి. మీకు తెలియని పదాలు గుర్తించి, వాని కింద గీత గీయండి.

ఉదా : నమూనా

సుమేరియన్లు

పిల్లలూ....అందరూ తెలియని పదాలను గుర్తించారుకదా! ఒక్కొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై కుడి వైపు చివర రాసి, ఒకొక్క పదం గురించి విద్యార్థులతో చర్చిస్తూ వివరించాలి.)

## III. భావనల అవగాహన - చర్చ.

### 1. మాట్లాడించుట :

పిల్లలూ ... పాఠం చదివారు కదా ! చిత్రాలను చూసారు కదా ! మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలందరూ మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి)

**2. ప్రశ్నించుట :**

పిల్లలూ... పాఠం గురించి గాని, పాఠానికి సంబంధించిన అంశాలపై తెలుసుకోవడానికి ప్రశ్నలు అడగండి.

(ఉపాధ్యాయుడు పిల్లలను ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి)

**3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు :**

- చిత్రానికి, పటానికి మధ్యగల తేడాలు తెల్పండి?
- ప్రాచీన కాలంలో మట్టి పలకల ద్వారా వివిధ పటాలు తయారు చేయుటకు గల కారణాలను తెల్పండి?
- పటాలు తయారు చేయుటకు ఏయే అంశాలను సూచికలుగా తీసుకొని పటాలను తయారు చేసారు?
- గ్రీకులు, రోమన్లు పటాలు తయారు చేయడానికి ఆసక్తి చూపారు – ఎందుకు ?

(ఉపాధ్యాయుడు ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను, ఈ ప్రశ్నలను కొన్ని జట్లలో, కొన్ని పూర్తి తరగతిలో చర్చించాలి. పిల్లలు చెప్పిన విషయాలను కాన్సెప్ట్ మ్యాప్ ద్వారా చుట్టూ కీలక పదాల రూపంలో రాయాలి. ఇలా అన్ని ప్రశ్నలను చర్చించాలి.)

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.**

- పట నైపుణ్యాలు

పిల్లలూ .... హెకెటియస్ ఆధారంగా గీచిన ప్రపంచ పటాన్ని పరిశీలించారు కదా ! ఇది మీరు గీయగలరా ? ప్రయత్నించండి. అందులో కింది వాటిని గుర్తించండి.

1. లిబియా 2. యూరప్ 3. అరేబియా సముద్రం 4. ఇండియా 5. గ్రీసు

**IV. ఇంటిపని :**

పిల్లలూ.... పటాల గురించి చాలా విషయాలు చర్చించాం కదా! మరి పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలకు జవాబులు రాయండి.

(ఉపాధ్యాయుడు ప్రశ్నలకు జవాబులు తరగతిలో రాయించాలి. ఒక వేళ సమయం లేకపోతే ఇంటిపనిగా ఇవ్వాలి.)

# పీరియడ్ ప్రణాళిక - 2

**I. ఉపోద్ఘాతం**

**1. పలకరింపు :** పిల్లలూ – శుభోదయం ఎలా ఉన్నారు ? నిన్నటి తరగతిలో పటాల అధ్యయనం గురించి తెలుసుకున్నారు కదా ! మరి మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

**2. పునశ్చరణ ప్రశ్నలు :**

. చిత్రానికి, పటానికి గల తేడాలను రెండు చెప్పండి.

. పటాలు ఎందుకు తయారు చేసారు?

. పటాలు తయారు చేయడానికి ఎవరు ఆసక్తి చూపారు?

. పటాల తయారీకి ఏయే అంశాలు పరిగణనలోకి తీసుకున్నారు?

పిల్లలూ... బాగా సమాధానాలు చెప్పారు. ఈరోజు పటాల గురించి మరింత సమాచారం తెలుసుకుందామా!

3. పాఠ్యాంశ ప్రకటన : పిల్లలూ...ఈ రోజు పటాల తయారీ గురించి వివరంగా తెలుసుకుందాం.

**పటాల తయారి**

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :**

పిల్లలూ... పాఠ్యపుస్తకం తీయండి. పేజీ నెం 3లోని నావికులకు ఉపయోగపడే పటాల నుండి 6వ పేజీలోని ప్రక్షేపణం వరకు చదవండి.

మీకు తెలియని పదాలు /భావనలు గుర్తించి, వాటి కింద గీత గీయండి. ఉదా: – మెరిడియన్ , నావికులు.

పిల్లలూ.. తెలియని పదాలు గుర్తించారు కదా? మీరు రాసిన వాటిని ఒక్కొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాసి, ఒక్కొక్క భావన గురించి పిల్లలచే చర్చిస్తూ ముగించాలి)

**III భావనల అవగాహన – చర్చ**

1. **మాట్లాడించుట :** పిల్లలూ...అందరూ పాఠం చదివారుకదా! మీకు ఏమి అర్థమైందో ఒక్కొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయడు పిల్లలను మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి)

2. **ప్రశ్నించుట :** పిల్లలూ...పటాల గురించి తెలుసుకోవడానికి మీరు కొన్ని ప్రశ్నలు అడగండి.

(పిల్లలు– ప్రశ్నించేటట్లు ఉపాధ్యాయలు ప్రోత్సహించాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి)

3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు, చిత్రం ఆధారంగా ప్రశ్నలు:

పిల్లలూ... మీరు కొన్ని ప్రశ్నలు అడిగారు కదా! నేను కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తాను... పరిశీలించండి.

. మెరిడియన్ అనగా....

. టాలమీ పుస్తకాలు ప్రాచీన గ్రీకుల కాలంలో ఎందుకు ప్రాచుర్యం పొందాయి?

. ఆల్ ఇద్రిసి గీసిన ప్రపంచ పటంలో ఏయే అంశాలను ఏ విధంగా చూపించాడో వివరింపుము?

. 15వ శతాబ్దంలో ఏయే కొత్త సంప్రదాయాలు వెలసిల్లినాయి? అందుకు గల కారణాలను తెల్పుము?

. బైబిల్ ప్రకారం ప్రపంచం నమూనాను పరిశీలించి వివారాలు రాయండి.

. మెర్కెటర్ ప్రక్షేపణం అనగా...

(ఉపాధ్యాయుడు ఒక్కొక్క ప్రశ్నను పూర్తి తరగతిలో చర్చిస్తూ, పిల్లలు చెప్పిన విషయాలను కాన్సెప్ట్ మ్యాపింగ్ చుట్టూరాస్తూ, అవసరమైనతే తాను జోడిస్తూ ముగించాలి)

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.

సమాచార నైపుణ్యాలు

. ప్రాచీన కాలంలో శాస్త్రవేత్తలు ఏయే పటాలు తయారు చేసినారో వివరాలు సేకరించి పట్టికలో రాయండి.

| వ.సంఖ్య | పటాలు తయారుచేసిన వారి పేరు | పటంలో చూపించిన అంశాలు | పటంపేరు |
|---|---|---|---|
| 1. | | | |
| 2. | | | |
| 3. | | | |
| 4. | | | |
| 5. | | | |

## IV. ఇంటిపని

పిల్లలూ... పటాల తయారీ గురించి చాల విషయాలు తెలుసు కున్నారు కదా! పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలకు జవాబులు రాయండి. అలాగే మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండిలో 4వ ప్రశ్నకు కూడా సమాధానం రాయండి. (ఉపాధ్యాయుడు సమయం ఉంటే తరగతిలో రాయించాలి. లేకుంటే ఇంటి పనిగా ఇవ్వాలి)

# పీరియడ్ ప్రణాళిక - 3

**I. ఉపోద్ఘాతం**

**1. పలకరింపు** : పిల్లలూ..గుడ్ మార్నింగ్.. నిన్నటి పాఠం బాగా అర్థమైందా? నిన్నటి తరగతిలో నేర్చుకున్న వాటిపై కొన్ని ప్రశ్నలు అడుగుతాను చెబుతారా?

**2. పునశ్చరణ ప్రశ్నలు :**

. టాలమీ పుస్తకాలు ఎందుకు ప్రాచుర్యం పొందాయి?

. అల్ ఇద్రిసి గీసిన పటంలో ఎన్ని ఖండాలు, సముద్రాలు చూపించారు?

. భారతదేశం కన్నా శ్రీలంకను పెద్దగా చూపుటకు గల కారణాన్ని ఊహించండి?

**3. పాఠ్యాంశ ప్రకటన :** పిల్లలూ – వెరిగుడ్ చాలా బాగా చెప్పారు.

మరి ఈ రోజు పటాల తయారి గురించి మరింత విపులంగా తెలుసుకుందామా?

**పటాల తయారి**

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :**

పిల్లలూ – పాఠ్య పుస్తకం తీసి 6వ పేజీలోని ప్రక్షేపణం నుండి 8వ పేజీలోని మనకాలంలో పటాల వినియోగం వరకు చదవండి. మీకు తెలియని పదాలు, భావనలు గుర్తించి, వాటి కింద గీత గీయండి. ఉదా: ప్రక్షేపణం, వక్రీకరణ, ప్రతిఘటించు.

పిల్లలూ... అందరూ తెలియని పదాలను గుర్తించారు కదా? ఒక్కొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై కుడివైపు చివర రాసి, ఒక్కొక్క పదం గురించి విద్యార్థులతో చర్చిస్తూ వివరించాలి)

**III. భావనల అవగాహన – చర్చ.**

**1. మాట్లాడించుట:**

పిల్లలూ...పాఠం చదివారు కదా ! మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలందరూ మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి)

**2. ప్రశ్నించుట :**

పిల్లలూ – పాఠం గురించి గాని, పాఠానికి సంబంధించిన అంశాలపై గాని తెలుసుకోవడానికి ప్రశ్నించండి.

(ఉపాధ్యాయుడు పిల్లలను ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి)

**3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు**

పిల్లలూ...మీరు కొన్ని ప్రశ్నలు అడిగారు కదా! నేను కూడ కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తాను. పరిశీలించండి.

- ప్రక్షేపణం అనగా....
- ఐరోపా దేశాలు పటాల తయారికి ఎందుకు ఆసక్తి చూపాయి?
- మధ్యయుగంలో వలసల ఏర్పాటు, అన్వేషణలకు పటాల తయారి ఏ విధంగా దోహదపడ్డాయి? తద్వారా ఏయే పరిణామాలు ఉత్పన్నమయ్యాయి?
- ఎవరెస్ట్ శిఖరం ఏత్తైనదని ఎలా వెలుగులోకి వచ్చింది?
- పటాలు అందరికి అందుబాటులో ఉంచడం మంచిదేనా? దీనిపై నీ అభిప్రాయమేమి?
- 8వ పేజీలోని ప్రశ్నలు పరిశీలించండి. జట్లలో చర్చించండి.

(ఉపాధ్యాయుడు ప్రశ్నలను పూర్తి తరగతిలో చర్చించి, పిల్లలు చెప్పిన సమాధానాలను కీలకపదాల రూపంలో కాన్సెప్ట్‌మ్యాపింగ్ చుట్టూ రాసి, అవసరమైతే తాను కూడా జోడిస్తూ ముగించాలి.)

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.**

పటనైపుణ్యాలు

- భారతదేశ పటం గీసి, ఎల్లలు రాయండి.

**IV. ఇంటిపని**

పిల్లలూ...పాఠంబాగా అర్థమైంది కదా! మనం చర్చించిన ప్రశ్నలకు, పాఠం వెనుక గల 3వప్రశ్నకు జవాబులు రాయండి.

(సమయం ఉంటే తరగతిలో రాయించాలి. లేకపోతే ఇంటి పనిగా ఇవ్వాలి)

# పీరియడ్ ప్రణాళిక - 4

**I. ఉపోద్ఘాతం**

**1. పలకరింపు :** పిల్లలూ..గుడ్ మార్నింగ్.. ఎలా ఉన్నారు? పటాల తయారి గురించి అనేక కొత్త విషయాలు తెలుసు కుంటున్నాం కదా! మరి మీకు తెలిసిన అంశాలు చెప్పండి.

**2. పునశ్చరణ ప్రశ్నలు**

- భూమి ఏ ఆకారంలో ఉంది?
- ప్రపంచంలో ఎత్తైన శిఖరం ఏది ?
- వనరులు దోచుకోవడానికి యూరప్ వారు ఏమి చేసారు?
- పటాల అవసరం ఎప్పుడు ఎక్కువైంది?

**3. పాఠ్యాంశ ప్రకటన :** పిల్లలూ – పటాల గురించి బాగా చెప్పారు.

ఈ రోజు పటాల వినియోగం గురించి తెలుసుకుందామా?

**పటాల వినియోగం**

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :**

పిల్లలూ – పుస్తకం తీయండి. 8వ పేజీలోని మన కాలంలో పటాల వినియోగం నుండి 9వ పేజీలోని చివరి పేరా కంటే ముందు పేరా వరకు చదవండి. మీకు తెలియని పదాలు / భావనలు గుర్తించి దానికింద గీత గీయండి.

ఉదా : మైక్రో వేవ్ , థీమాటిక్.

పిల్లలూ...అందరూ పదాలు గుర్తించారు కదా ! ఒకొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై కుడివైపు చివర రాసి ఒక్కొక్క పదం గురించి విద్యార్థులతో చర్చిస్తూ వివరించాలి)

**III. భావనల అవగాహన – చర్చ.**

1. మాట్లాడించడం : పిల్లలూ...పాఠం చదివారు కదా ! మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

   (పిల్లలందరూ మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి)

2. ప్రశ్నించుట : పిల్లలూ బాగా మాట్లాడారు. వెరీగుడ్. ఇప్పుడు పాఠం నుండి తెలుసుకోవడానికి ఏవైనా ప్రశ్నలు అడగండి. (పిల్లలు ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి)

3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు

- ప్రస్తుతం పటాలు దేనికి ఉపయోగిస్తున్నారు?
- బాక్స్‌లో ఇచ్చిన ప్రశ్నలు చదవండి. వాటి గురించి ఆలోచించండి.
- పటాల వినియోగం గురించి మీ ప్రతిస్పందన ఏమిటి ?
- విషయ నిర్దేశిత పటాలను ఎన్ని రకాలుగా విభజించవచ్చు?
- పట్టికను పరిశీలించి దేనికి ఏ రంగు వాడతారో చర్చించండి.
- పటాలు తయారు చేసిన వారి గొప్పతనాన్ని చెప్పండి.

పిల్లలూ.. మీరు కొన్ని ప్రశ్నలు అడిగారు కదా ! నేను నల్లబల్లపై రాసిన వాటినికూడా చర్చిద్దామా!

(ఉపాధ్యాయుడు కొన్ని ప్రశ్నలను జట్లలో, మిగిలినవి పూర్తి తరగతిలో చర్చిస్తూ పిల్లలు చెప్పిన సమాధానాలను కాన్సెప్ట్ మ్యాప్ చుట్టూ రాస్తూ, అవసరమైతే తాను కూడా జోడిస్తూ ముగించాలి )

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం:

పటనైపుణ్యాలు

పిల్లలు – పటాల గురించి చాలా ఆసక్తికర విషయాలు తెలుసుకున్నారు కదా! ఇప్పుడు భారతదేశ పటంలో వింధ్య, సాత్పురా పర్వతాలు, హిమాలయ పర్వతాలకు రంగులు వేయండి.

**IV. ఇంటిపని :**

పిల్లలూ – చర్చించిన అంశాలకు సమాధానాలు రాయండి. అలాగే జనాబా పటాన్ని పేజి నెం. 9 లో ఇచ్చిన సూచనలు మేరకు తయారు చేయండి.

(ఉపాధ్యాయుడు సమయముంటే తరగతిలో, లేకపోతే ఇంటి పనిగా ఇవ్వాలి)

# పీరియడ్ ప్రణాళిక - 5

**I. ఉపోద్ఘాతం**

1. **పలకరింపు :** పిల్లలూ ఎలా ఉన్నారు? బాగా చదువుతున్నారా? ఈ రోజు పాఠం చెప్పబోయే ముందు నిన్నటి పాఠంలో ఏమి నేర్చుకున్నారో చెబుతారా?

2. **పునశ్చరణ ప్రశ్నలు**

- విషయ నిర్దేశిత పటాలు ఏవి?
- పటాలను దేనికోసం అధ్యయనం చేస్తారు?
- లేత నీలం దేనికి సూచిస్తారు?

పిల్లలూ... బాగా చెప్పారు. మరి ఈ రోజు కొత్త పాఠం గురించి తెలుసుకుందామా?

3. **పాఠ్యాంశ ప్రకటన :** పిల్లలూ – ఈ రోజు మనం జనసాంద్రత, సంకేతాల గురించి తెలుసుకుందామా!

**జనసాంద్రత, సంకేతాలు**

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట:**

పిల్లలూ – పాఠ్య పుస్తకం తీసి 9వ పేజీలోని చివరి పేరా నుండి 13 వ పేజీలోని రెండు పేరాల వరకు చదవండి. మీకు తెలియని పదాలు, భావనలు గుర్తించి, వాటి కింద గీత గీయండి. అలాగే భారతదేశ పటాన్ని సంకేతాలను పరిశీలించండి.

ఉదా : జనసాంద్రత, సంకేతాలు, వైశాల్యాలు.....

పిల్లలూ – తెలియని పదాలు గుర్తించారు కదా ? వాటిని ఒక్కొక్కరు లేచి చదవండి.

(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై కుడి వైపు చివర రాయాలి. ఒకొక్కపదం గురించి చర్చిస్తూ ముగించాలి)

**III. భావనల అవగాహన – చర్చ :**

1. **మాట్లాడించుట :** పిల్లలూ...పాఠం బాగా చదివారు కదా ! అలాగే భారతదేశ పటం, సంకేతాలను పరిశీలించారు కదా ! మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలను మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి)

2. **ప్రశ్నించుట :** పిల్లలూ – పాఠం చదివారుకదా ! భారతదేశం, సంకేతాలు పరిశీలించారు కదా ! కాబట్టి వీటి గురించి తెలుసుకోవడానికి ప్రశ్నలు అడగండి. (ఉపాధ్యాయుడు పిల్లలను ప్రశ్నించేటట్లు ప్రోత్సహించాలి, పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి)

3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు, పటం, సంకేతాల ఆధారంగా ప్రశ్నలు :

పిల్లలూ మీరు కొన్ని ప్రశ్నలు అడిగారు కదా ! నేను కూడ కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తాను. పరిశీలించండి.

- జన సాంద్రత అనగా...
- జన సాంద్రత పట్టిక పరిశీలించండి. జనసాంద్రత ఎక్కువ మరియు తక్కువ ఉన్న రాష్ట్రాలను గుర్తించండి.
- భారతదేశ పటాన్ని పరిశీలించండి. సూచిక ఆధారంగా రాష్ట్రాల పేర్లు వ్రాయండి.
- సంకేతాలు ఎందుకు వాడుతారు ?
- సంప్రదాయకంగా వాడే సంకేతాలను పరిశీలించండి.
- కాంటూరు రేఖలు అనగా

(ఉపాధ్యాయుడు ఒక్కొక్క ప్రశ్నను పిల్లలచే చర్చిస్తూ, పిల్లలు చెప్పిన సమాధానాలను కీలకపదాల రూపంలో కాన్సెప్ట్ మ్యాపింగ్ చుట్టూరాస్తూ, అవసరమైనచోట తానుకూడ జోడిస్తూ ముగించాలి.)

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.

- పటనైపుణ్యాలు
- పిల్లలూ – భారతదేశం పటాన్ని పరిశీలించారు కదా! జనసాంద్రత సూచిక ఆధారంగా రంగులు వేయండి.

**IV. ఇంటిపని :**

పిల్లలూ – పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు చర్చించాం కదా ! వాటిని రాయండి. అలాగే జన సాంద్రత పట్టికను చార్ట్‌లో రాసి తీసుకురండి.


(ఉపాధ్యాయుడు ప్రశ్నలను సమయం ఉంటే తరగతిలో రాయించాలి. సమయం లేకపోతే ఇంటిపనిగా ఇవ్వాలి)

# పీరియడ్ ప్రణాళిక - 6

**I. ఉపోద్ఘాతం**

1. **పలకరింపు :** పిల్లలూ బాగున్నారా ? అందరూ చార్ట్‌పై రాసుకొని వచ్చారా? రాసిన చార్ట్స్ గోడకు అతికించండి. పిల్లలూ, పటాల గురించి అనేక విషయాలు తెలుసుకున్నారు కదా! ఈ రోజు అట్లాసు, పటాల గురించి తెలుసుకుందామా!

2. **మైండ్ మ్యాపింగ్ :** పిల్లలూ...అట్లాసు గురించి మీకు ఏమి తెలుసో చెప్పండి.




పిల్లలూ..... అట్లాసు గురించి బాగా చెప్పారు. ఇంకా వివరంగా తెలుసుకుందామా!

3. **పాఠ్యాంశ ప్రకటన :** అట్లాసు - పటాలు

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :**

పిల్లలూ... పాఠ్యపుస్తకం తీసి పేజి నెం. 13 లోని రెండవ పేరా నుండి 16వ పేజీ వరకు చదవండి. మీకు తెలియని పదాలు / భావనలు గుర్తించి దాని కింద గీత గీయండి.

ఉదా: భౌగోళిక ఉన్నతి, మృత్తికలు

పిల్లలూ అందరూ గుర్తించారు కదా! ఒక్కొక్కరు లేచి మీరు గుర్తించిన పదాలు ఒక్కొక్కరు లేచి చదవండి.

(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై కుడి వైపు చివర రాసి, ఒక్కొక్క భావనను పిల్లలచే చర్చిస్తూ వివరించాలి)

**III. భావనల అవగాహన - చర్చ.**

1. **మాట్లాడించుట :** పిల్లలూ... అందరూ పాఠం చదివారు కదా ! అలాగే పటాలు పరిశీలించారు కదా ! మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

(పిల్లలూ అందరూ మాట్లాడేటట్లు ఉపాధ్యాయుడు ప్రోత్సహించాలి)

2. **ప్రశ్నించుట :** పిల్లలూ - అట్లాసు గురించి, పటాల గురించి పరిశీలించారు, మాట్లాడారు కదా! మీరు వీటి గురించి మరింత తెలుసుకోవడానికి ప్రశ్నించండి.

(పిల్లలు ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి)

3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు, పటం ఆధారప్రశ్నలు :

పిల్లలూ... మీరు చాలా మంచి ప్రశ్నలు వేసారు. నేను కూడ కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తాను. పరిశీలించండి.

- అట్లాసు వల్ల కలిగే ప్రయోజనాలు ఏవి?
- సముద్ర మట్టం నుండి ఏఏ రాష్ట్రాలు ఎంత ఎత్తులో ఉన్నాయో పరిశీలించి రాయండి.
- సాంవత్సరిక సగటు వర్షపాతం ఏఏ ప్రాంతాలలో ఎక్కువగా ఉంది?
- నల్లరేగడి మృత్తికలు గల ప్రాంతాలు ఏవి?

(ఉపాధ్యాయుడు ఒక్కొక్క ప్రశ్నను పిల్లలతో చర్చిస్తూ. వారు చెప్పిన సమాధానాలను కాన్సెప్ట్ మ్యాపింగ్ చుట్టూ కీలకపదాల రూపంలో రాస్తూ, అవసరమైతే తాను కూడా జోడిస్తూ ముగించాలి.)

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.

- పటనైపుణ్యాలు
- పిల్లలూ – అట్లాసు, పటాలు పరిశీలించారు కదా! ఇప్పుడు అట్లాసు తీసి ఏఏ పటాలు ఉన్నాయో పరిశీలించి రాయండి.

**IV. ఇంటిపని**

పిల్లలూ – పటాల ఆధారంగా చర్చించిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

(సమయం ఉంటే తరగతిలో రాయాలి. లేకుంటే ఇంటి పనిగా ఇవ్వాలి)

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

## పీరియడ్ ప్రణాళిక – 7

**I. ఉపోద్ఘాతం**

1. **పలకరింపు :** పిల్లలూ .. పటాల అధ్యయనం – విశ్లేషణ గురించి విపులంగా చర్చించాం కదా ! ఈ రోజు మనం చర్చించిన అంశాల ఆధారంగా అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఎలా రాసారో చూద్దామా!

2. పాఠ్యాంశ ప్రకటన : **మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి.**

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

**II.** ప్రశ్నల వారిగా అవగాహన – చర్చ

పిల్లలూ మీరు రాసిన సమాధానాలను ఒక్కొక్కరు లేచి చదవండి.

(ఉపాధ్యాయుడు ఒకొక్క ప్రశ్నను విద్యార్థులతో చర్చిస్తూ అందరూ నోట్ పుస్తకంలో సమాధానాలు రాసేటట్లు చూడాలి.)

ఇలా ప్రతి పాఠానికి గ్రిడ్, పీరియడ్ ప్రణాళికలు తయారు చేసుకోవాలి. దీనివల్ల సమయం వృథాకాకుండా, పిల్లల్లో మనలో ఆశించే లక్ష్యాలు సాధించడానికి అవకాశముంది. అలాగే పిల్లలందరూ బోధనాభ్యాసన ప్రక్రియలో పాల్గొనడంవల్ల అభ్యసనం అర్థవంతంగా జరుగుతుంది. దీనివల్ల సాంఘికశాస్త్రములో మనం ఆశించిన విద్యా ప్రమాణాలను పిల్లల్లో మనం సులభంగా పెంపొందించవచ్చు.

# 9వ తరగతి

## 1. భూమి - మనం

## పీరియడ్ల విభజన - ప్రణాళిక

| పీ.సంఖ్య | అంశం | ఇంటిపని |
|---|---|---|
| 1. | . భూమితో మానవునికి గల సంబంధం<br><br>. వివిధ వనరుల వినియోగం<br><br>. విశ్వం ఆవిర్భావం<br><br>. విశ్వంలోని భాగాలు - సూర్యుడు, (1,2 పేజీలు) | . భూమిని ఉపయోగించుకోవడంలో మానవులకు, జంతువులకు మధ్యన ఉండే పోలికలు, భేదాలను చెప్పండి.<br>. మానవుడు వినియోగించుకునే వివిధ భూవనరులను తెల్పండి<br>. భూ వనరులను యథేచ్ఛగా దోచుకోవడం వలన ఏమి జరుగుతుంది?<br>. విశ్వం ఏవిధంగా ఆవిర్భవించింది? ప్రాణికోటి మనుగడలో భూమి పాత్రను ప్రశంసించుట. |
| 2. | . గ్రహంగా భూమి,భూకక్ష<br>. భూ చలనాలు<br>. భూ పరిణామం<br><br><br>(3వ పేజీ మరియు 4వ పేజీలో బాక్స్ ఐటమ్ వరకు) | . చిత్రం 1.2, ను చూసి భూకక్ష్యను వివరించండి.<br>. భూమి మీద కాలాలు ఏర్పడడానికి కారణాలు ఏవి?<br>. భూమి ఎలా ఏర్పడిందని నీవు అనుకుంటున్నావు?<br>. 4వ పేజీలోని బాక్స్ ఐటమ్ లోని 2వ ప్రశ్న<br>. 12వ పేజీలోని 4వ ప్రశ్న<br>. భూ ఆవిర్భావంపై ప్రశ్నించుట |
| 3. | . భూమి - అంతర్గత నిర్మాణం-భూపొరలు-వివరణ<br>. చిత్రం ద్వారా భూమి లోపలి పొరల అవగాహన<br>. 4వ పేజీలోని భూమి అంతర్గత నిర్మాణం పేరా నుండి 5వ పేజీ వరకు | . 12వ పేజీలో 5వ ప్రశ్న<br>. వివిధ భూ పొరలకు గల భేదాలను పేర్కొనండి.<br>. 5వ పేజీ బాక్స్ ఐటమ్‌లోని ప్రశ్న |
| 4. | . భూ పటలం యొక్క కదలికలు-ఖండాలు, మహాసముద్రాల అమరిక<br>. ఆల్ఫ్రెడ్‌వెజ్‌నర్ ఖండచలన సిద్ధాంతవివరణ<br>. చిత్రాలను పరిశీలించడం ద్వారా ఖండాల చలనాల దశల అవగాహన (6వ పేజీ మరియు 7వ పేజీ 'భూమి గ్రిడ్ వ్యవస్థ' ముందర పేరా వరకు) | . భూమి చరిత్రలో చోటు చేసుకున్న కొన్ని అద్భుత ఘటలను తెలపండి.<br>. 7వ పేజీలోని 4వ పేరా భూమి మీద ప్రస్తుతం..... ....నుండి.... తెలుసుకుందాం. వరకు చదివి మీ అభిప్రాయాన్ని వ్యక్తీకరించండి.<br>. భూమిపైన ఉండే ఖండాలు, సముద్రాలు కొన్ని మిలియన్ సంవత్సరాలుగా కదులుతూనే ఉన్నాయి. ఈ కదలికలపై మీ ప్రతిస్పందనను తెలియ జేయండి. |

| పీ.సంఖ్య | అంశం | ఇంటిపని |
|---|---|---|
| 5. | . భూమి గ్రిడ్ వ్యవస్థ – పటాలలో, గ్లోబులో భూమిని చూపించే విధానం – అట్లాసు, గ్లోబుల వినియోగం<br><br>. అక్షాంశాల ఉపయోగం<br><br>. (7వ పేజీలో 'భూమి గ్రిడ్ వ్యవస్థ' నుండి 9వ పేజీ 'రేఖాంశాలు' ముందర పేరావరకు) | . 12 వ పేజీలో 6 వ ప్రశ్న<br>. అట్లాసును ఉపయోగించి, ఏఏ వివరాలు<br>. అక్షాంశాలు – వివిధ అక్షాంశాలు,పేర్లు తెలుసుకోవచ్చు?<br>. అట్లాసును పరిశీలించి వివిధ దేశాల గుండా పోతున్న అక్షాంశాలను పట్టికలో పూరించండి.<br>. భూమధ్య రేఖ ఏఏ దేశాలగుండా పోతోందో అట్లాసును పరిశీలించి చెప్పండి.<br>. చిత్రం 1.5ను పరిశీలించి ముఖ్య అక్షాంశాలను పేర్కొనండి. |
| 6. | . రేఖాంశాలు – ముఖ్య రేఖాంశాల పేర్లు వివరణ | . గ్లోబును, అట్లాసును పరిశీలించి వివిధ రేఖాంశాలు పోయే దేశాలను గుర్తించండి.<br>. వివిధ రేఖాంశాలను గ్లోబు, అట్లాసుపై పరిశీలించుట<br>. ప్రపంచ పటంలో అట్లాసు సహాయంతో రేఖాంశాలను గీయుట |
| 7. | . రేఖాంశాలు – ఉపయోగాలు<br><br>. ప్రామాణిక సమయం | . మీ అభ్యసనాన్ని మెరుగు పరుచుకోండి (పేజీనంబరు 12 లోని 7వ ప్రశ్న<br>. 8వ ప్రశ్న<br>. వివిధ దేశాల ప్రామాణిక రేఖాంశాల సమాచారాన్ని నమోదు చేసి, విశ్లేషించడం<br>. వివిధ దేశాల ప్రామాణిక రేఖాంశాలను ప్రపంచ పటంలో గుర్తించడం<br>. రేఖాంశం సహాయంతో ఒక ప్రదేశం యొక్క సమయం, ప్రయాణాలను కనుగొనడం.<br>. రేఖాంశంలో మార్పుల వలన సంభవించే పరిణామాలపై ప్రతిస్పందించడం.<br>. రేఖాంశాలు, సమయం పాఠ్యాంశాన్ని చదివి,వ్యాఖ్యానించడం. |
| 8. | మీ అభ్యసననాన్ని మెరుగు పరచుకోండి మరియు ఇతర పాఠ్యాంశ సంబంధిత ప్రశ్నలు, మీట్ ది ప్రెస్, పరిశీలనల, ముగింపు | |

## 1. భూమి - మనం

**పాఠం లక్ష్యాలు :**

**I. విషయావగాహన :**

. భూమితో మానవునికి గల సంబంధాన్ని వివరిస్తారు.

. భూమిని ఉపయోగించు కోవడంలో మానవులకు, జంతువులకు మధ్యన ఉండే పోలికలు, భేదాలను వివరిస్తారు.

. వివిధ భూ వనరులకు ఉదాహరణలు తెలుపుతారు.

. విశ్వం ఏ విధంగా ఆవిర్భవించిందో వివరిస్తారు.

. భూమి మీద కాలాలు ఏర్పడడానికి కారణాలను వివరిస్తారు.

. వివిధ భూ పొరలకు గల భేదాలను పేర్కొంటారు.

. భూమి చరిత్రలో చోటుచేసుకున్న కొన్ని అద్భుత ఘటలను తెలుపుతారు.

. భూకక్ష్య, అక్షాంశ రేఖాంశాలను గూర్చి వివరిస్తారు.

. అట్లాసు ద్వారా ఏఏ అంశాలు తెలుసుకోవచ్చో వివరిస్తారు.

**II. ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకుని వ్యాఖ్యానించుట :**

. విశ్వం  ఆవిర్భావం వివరణను చదివి వ్యాఖ్యానిస్తారు.

. భూ పటలం కదలికలపై వివరణను చదివి, ఖండాలు, మహాసముద్రాల అమరికపై వ్యాఖ్యానిస్తారు.

. అక్షాంశాలు, రేఖాంశాలపై వివరణను చదివి, వాటి ఉపయోగాలపై వ్యాఖ్యానిస్తారు.

**III. సమాచార నైపున్యాలు :**

. అక్షాంశ , రేఖాంశాలు, అవి పోయే దేశాల పేర్లు, సమయంలో తేడాలు మొదలైన సమాచారాన్ని అట్లాసు, గ్లోబు సహాయంతో సేకరించి విశ్లేషిస్తారు.

. మన విశ్వం, భూమిలపై అదనపు సమాచారాన్ని వార్తా పత్రికలు, అంతర్జాలం ద్వారా సేకరించి నమోదు చేసి, విశ్లేషిస్తారు.

**IV సమకాలీన అంశాలపై ప్రతిస్పందన, ప్రశ్నించుట :**

. భూవనరులను యథేచ్ఛగా దోచుకోవడంపై ప్రతిస్పందిస్తారు.

. అనంత విశ్వంలో భూమి అతి చిన్న నలుసు మాత్రమే అనే విషయంపై ప్రతిస్పందిస్తారు, ప్రశ్నిస్తారు.

. భూమిమీద కాలాలు ఏర్పడటంపై ప్రశ్నిస్తారు.

. ఖండాలు, మహాసముద్రాల అమరికపై ప్రశ్నిస్తారు.

**V. పటనైపుణ్యాలు :**

. అట్లాసుపై, గ్లోబుపైన ఉండే వివిధ రేఖాంశాలు, అక్షాంశాలను పరిశీలించి, అవి ఏఏ దేశాల గుండా పోతున్నాయో గుర్తిస్తారు.

. రేఖాంశాలను గుర్తించి ఒక ప్రదేశం యొక్క సమయాన్ని తెలుపుతారు.

. వివిధ దేశాల ప్రామాణిక రేఖాంశాలను ప్రపంచ పటంలో గుర్తిస్తారు.

. ప్రపంచం – కాల మండలాలు' పటాన్ని పరిశీలించి, విశ్లేషిస్తారు.

**VI ప్రశంస, సున్నితత్వం :**

. ప్రాణికోటి, మనుగడలో భూమి పాత్రను ప్రశంసిస్తారు.

. ఒక ప్రదేశంయొక్క ఉనికిని నిర్ణయించడంలో అక్షాంశాల పాత్రని, కాల నిర్ణయంలో రేఖాంశాల పాత్రని ప్రశంసిస్తారు.

# 1. భూమి - మనం


## పీరియడ్ ప్రణాళిక - 1

పీరియడ్-1 **సమయం : 45 ని॥లు**

**ఉప శీర్షిక : మనవిశ్వం, సూర్యుడు, భూమి**

**I. ఉపోద్ఘాతం :**

1. పలకరింపు : పిల్లలూ ! గుడ్ మార్నింగ్. ఎలా ఉన్నారు? సెలవులు బాగా ఎంజాయ్ చేసారా? సరే ! ఈ రోజు మనం మన భూమి గురించి తెలుసుకుందామా!
2. మైండ్ మ్యాపింగ్ : ముందుగా ఈ విశ్వం గురించి మీ కేమి తెలుసో చెప్పండి.




వెరీగుడ్ ! చాలా బాగా చెప్పారు. ఈ రోజు మనం మన విశ్వం, సూర్యుడు భూమి గురించి మరికొన్ని విషయాలు చర్చిద్దాం!

**3. పాఠ్యాంశ ప్రకటన :**

| **మన విశ్వం, సూర్యుడు, భూమి** |
|---|

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశ శీర్షికను నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశాన్ని చదువుట, తెలియని పదాలు గుర్తించుట:**

1. పిల్లలూ... అందరూ పాఠ్యపుస్తకాలను తెరచి, 1,2, పేజీలను చదవండి. మీకు తెలియని, అర్థంకాని పదాలు, భావనలు గుర్తించండి. వాటి కింద పెన్సిలుతో గీత గీయండి.

ఉదా: మెరుగైన జీవనం

పర్యావరణ సంక్షోభం

వ్యోమ నౌక

పదాలను గుర్తించారు కదా!

2. పిల్లలూ... మీరు ఒక్కొక్కరు గీతగీసిన పదాలు, భావనలను చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై కుడివైపు చివరన రాయాలి. తరువాత ఆ పదాలు, భావనలపై చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.)

**III. భావనల అవగాహన – చర్చ :**

**1. మాట్లాడించుట :** పిల్లలూ... మీరు పాఠం చదివారు కదా! మీకర్థమయిన విషయాలు చెప్పండి.

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై విద్యార్థులచే మాట్లాడించాలి) వెరీ గుడ్ ! బాగా చెప్పారు.

**2. ప్రశ్నించుట :**

పిల్లలూ....మీరు చదివిన పాఠ్యాంశంపైన, అర్థంకాని అంశాలపైన ప్రశ్నలు అడగండి.

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశానికి, సమకాలీన అంశాలు జోడిస్తూ, విద్యార్థులు ప్రశ్నించేలా ప్రోత్సహించాలి)

**3. పాఠ్యాంశ అవగాహనా ప్రశ్నలు :**

పిల్లలూ... మీరు కొన్ని ప్రశ్నలు అడిగారు కదా! ఈ పాఠ్యాంశాన్ని మరింత అర్థం చేసుకోవడానికి నేను కూడా కొన్ని ప్రశ్నలు రాస్తాను పరిశీలించండి. (ఉపాధ్యాయుడు పాఠం చివరన అలాగే బాక్సలలో ఉన్న పాఠ్యాంశ సంబంధిత ప్రశ్నలను బోర్డు పైన రాయాలి)

. భూమిని ఉపయోగించడంలో మానవులకు, జంతువులకు మధ్యన ఉండే పోలికలు, భేదాలు చెప్పండి.

. మానవుడు వినియోగించుకునే వివిధ భూవనరులను తెలపండి.

. భూ వనరులను యథేచ్ఛగా దోచుకోవడం వలన ఏమి జరుగుతుంది?

. విశ్వం ఏవిధంగా ఆవిర్భవించింది?

. నక్షత్రాలు, పాలపుంతల రహస్యాల గురించి, విశ్వం ఆవిర్భావం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి మానవులకు ఎందుకు కలిగింది?.

. ప్రాణి కోటి మనుగడకు భూమి ఏ విధంగా ఉపయోగపడ్తుంది?

పిల్లలూ... బోర్డు మీద రాసిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.

(ఉపాధ్యాయుడు విద్యార్థులచే జవాబులు చెప్పిస్తూ, అవసరమయిన చోట సమాచారాన్ని ఇస్తూ పాఠ్యాంశంపై అవగాహన కలిగించి ముగించాలి)

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం:**

సమాచార నైపుణ్యాలు :

కింది సమాచార పట్టికను పూరించి ప్రశ్నలకు జవాబులు రాయండి.

వనరుల వినియోగం

| ప్రాణులు | ఖనిజాలు | నీరు | గాలి | లోహాలు | నేల |
|---|---|---|---|---|---|
| 1. మానవులు | | | | ✓ | ✓ |
| 2. జంతువులు | | | | | ✓ |
| 3. వృక్షాలు | | | | | ✓ |

1. అధిక వనరులను ఎవరు వినియోగించుకుంటున్నారు?
2. వృక్షాలు వినియోగించుకుంటున్న వనరులేవి?
3. పై వనరులు లేకపోతే ప్రాణికోటికి ఏ సమస్యలు ఎదురవుతాయి?

పిల్లలూ... ప్రశ్నల గురించి చర్చించాం కదా !

అందరూ ... మీ నోటు పుస్తకాలు తీసి బోర్డుపైన రాసిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

**IV. ఇంటిపని :**

పిల్లలూ.... ఏవైనా ప్రశ్నలు మిగిలితే ఇంటి దగ్గర రాసుకుని రండి (తరగతి గదిలో పీరియడ్ సమయంలో రాయగా మిగిలిన ప్రశ్నలను ఇంటి పనిగా ఇవ్వాలి)

# పీరియడ్ ప్రణాళిక - 2

## 1. భూమి - మనం

పీరియడ్ -2 సమయం : 45 ని॥లు

**ఉప శీర్షిక : భూమి ఒక గ్రహం, భూమి పరిణామం**

**I. ఉపోద్ఘాతం :**

1. పలకరింపు :

హాయ్ ! చిల్డ్రన్ ! నిన్నటి ఇంటిపని చేసారా? వెరీగుడ్! నిన్న మనం మన విశ్వం, సూర్యుడు, భూమి గురించి కొన్ని విషయాలు చర్చించాం కదా ! మీ కెంతవరకు అర్థమయిందో ఒకసారి చూద్దామా! నేనడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.

2. పునశ్చరణ : 1. విశ్వం ఆవిర్భావం గురించి మీకేం తెలుసు?

2. సూర్యుడు, నక్షత్రాలు, భూమికి మధ్యనున్న సంబంధాన్ని వివరించండి.

వెరీగుడ్ ! బాగా చెప్పారు.

ఈ రోజు మనం భూమి గురించి మరికొన్ని విషయాలను చర్చిద్దాం !

3. పాఠ్యాంశ ప్రకటన :

**భూమి ఒక గ్రహం, భూమి పరిణామం**

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశ శీర్షికను నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశాన్ని చదువుట, తెలియని పదాలు గుర్తించుట:**

1. పిల్లలూ... మీరందరూ సాంఘిక శాస్త్ర పుస్తకాలు తీసి, 2వ పేజీ మరియు 3వ పేజీలో భూమి అంతర్గత నిర్మాణం, ముందర ఉన్న పేరా వరకు చదవండి. మీకు తెలియని, అర్థంకాని పదాలు, భావనలను గుర్తించండి. వాటి కింద పెన్సిలుతో గీత గీయండి.

ఉదా: కక్ష్య, పరిభ్రమణం, దీర్ఘవృత్తాకారం , నీటి ఆవిరి

2. సరే ! అందరూ మీకు తెలియని పదాలను గుర్తించారా? మీరందరూ గుర్తించిన పదాలను ఒక్కొక్కరుగా చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలు, భావనలను నల్లబల్లపై కుడివైపు చివరన రాయాలి. పదాలపై అవగాహన కల్పించాలి.)

**III. భావనల అవగాహన చర్చ :**

1. మాట్లాడించుట : పిల్లలూ... మీరు పాఠం చదివారు కదా! మీకర్థమయిన విషయాలు చెప్పండి. (ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై విద్యార్థులచే మాట్లాడించాలి) వెరీ గుడ్ ! బాగా చెప్పారు.

2. ప్రశ్నించుట :

   పిల్లలూ....మీరు చదివిన పాఠ్యాంశంపైన, అర్థంకాని అంశాలపైన ప్రశ్నలు వేయండి.

   (ఉపాధ్యాయుడు పాఠ్యాంశానికి, సమకాలీన అంశాలు జోడిస్తూ, విద్యార్థులను ప్రశ్నించేలా ప్రోత్సహించాలి)

3. పాఠ్యాంశ అవగాహనా ప్రశ్నలు :

   పిల్లలూ... మీరు కొన్ని ప్రశ్నలు అడిగారు కదా! నేను కూడా కొన్ని ప్రశ్నలు అడుగుతాను. సమాధానాలను ఆలోచించండి ! (ఉపాధ్యాయుడు విద్యార్థులు అడిగిన, తాను తయారు చేసుకున్న ప్రశ్నలను బోర్డుపై రాయాలి)

   . చిత్రం 1.2 ను చూసి భూకక్ష్యను వివరించండి.

   . భూమి మీద కాలాలు ఏర్పడటానికి కారణాలేవి?

   . భూమి ఎలా ఏర్పడిందని మీరు అనుకుంటున్నారు?

   (ఉపాధ్యాయుడు విద్యార్థులచే సమాధానాలను చర్చింప చేస్తూ, అవసరమయిన చోట అదనపు సమాచారాన్ని ఇస్తూ ముగించాలి)

4. **నైపుణ్యాలను అభ్యాసం చేయించడం :**

   సమాచార నైపుణ్యాలు :

   కింది సమాచార పట్టికను చదివి విశ్లేషించండి.

**భూమి - ముఖ్యాంశాలు**

| **సూర్యుడు** | **భూమి** |
|---|---|
| 1. నక్షత్రం | 1. గ్రహం |
| 2. సూర్యుని చుట్టూ భూమి తిరుగుతుంది. | 2. భూమి చుట్టూ చంద్రుడు తిరుగుతాడు |
| 3. అక్షంపై సూర్యుడు తన చుట్టూ తాను తిరుగుతాడు | 3. అక్షంపై భూమి తన చుట్టూ తాను తిరుగుతాడు |
| 4. భూమి కంటే సూర్యుడు పెద్దగా ఉంటాడు | 4. చంద్రుని కంటే భూమి పెద్దగా ఉంటుంది. |
| 5. సూర్యుడు పాలపుంతలో ఒక భాగం | 5. భూమి సౌర కుటుంబంలో ఒక భాగం. |

పిల్లలూ... ప్రశ్నల గురించి చర్చించాం కదా! అందరూ నోటు పుస్తకాలు తీసి, బోర్డుపైన రాసిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

**IV. ఇంటిపని :** పిల్లలూ.... ఏవైనా ప్రశ్నలు మిగిలితే ఇంటి దగ్గర రాసుకుని రండి.

# పీరియడ్ ప్రణాళిక-3

పీరియడ్ – 3 సమయం : 45 ని॥లు

**ఉప శీర్షిక : భూమి అంతర్గత నిర్మాణం**

**I. ఉపోద్ఘాతం :**

1. పలకరింపు :

   పిల్లలూ...శుభోదయం! అందరూ బడికి వచ్చారా?

2. పునశ్చరణ : నిన్నటి దాకా మనం భూమి ప్రాముఖ్యత గురించి, భూమి పరిణామం గురించి చర్చించాం కదా! మీకు ఎంతవరకు ఈ పాఠం అవగాహన అయిందో ఒక సారి చూద్దామా!

   ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

   1. భూ కక్ష్యను వివరించండి.
   2. భూమి మీద కాలాలు ఏర్పడటానికి కారణాలను చెప్పండి.

   వెరీగుడ్ . బాగా చెప్పారు.

   ఈ రోజు మనం అసలు ఈ భూమి లోపల ఏముంటుందో చర్చిద్దాం.

3. పాఠ్యాంశ ప్రకటన :

**భూమి అంతర్గత నిర్మాణం**

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశ శీర్షికను నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశాన్ని చదువుట, తెలియని పదాలు గుర్తించుట:**

1. పిల్లలూ... అందరూ పాఠ్యపుస్తకాలు తెరచి పేజీ నంబరు 4లో భూమి అంతర్గత నిర్మాణం నుండి పేజీ నంబరు 5 వరకు చదవండి.
   మీకు తెలియని, అర్థంకాని పదాలు భావనలను గుర్తించండి. వాటి కింద పెన్సిలుతో గీత గీయండి.
   ఉదా: గనులు
   భూకేంద్రమండలం
   భూమి లోపలి పొరలు
   సిలికేట్లు
   అగ్ని పర్వతం

2. అందరూ మీకు తెలియని పదాలను, భావాలను గుర్తించారు కదా! మీరు గుర్తించిన పదాలను ఒక్కొక్కరుగా చెప్పండి.

   (ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను బోర్డుపై కుడివైపు చివరన రాయాలి. పదాలపై అవగాహనను చర్చ ద్వారా కల్పించాలి.)

## III. భావనల అవగాహన – చర్చ :

**1. మాట్లాడించుట :**

పిల్లలూ... మీరు పాఠం చదివారు కదా! మీకే మర్థమయిందో చెప్పండి.

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై విద్యార్థులను మాట్లాడించాలి) వెరీ గుడ్ ! చాలా బాగా చెప్పారు.

**2. ప్రశ్నించుట :**

పిల్లలూ....మీకు అర్థంకాని అంశాలపైన ప్రశ్నలు అడగండి.

**3. పాఠ్యాంశ అవగాహనా ప్రశ్నలు :**

పిల్లలూ... నేను కూడా కొన్ని ప్రశ్నలు అడుగుతాను. జవాబులను ఆలోచించి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలను అడిగిన మరియు తాను తయారు చేసుకున్న ప్రశ్నలను బోర్డుపై రాయాలి)

. భూమి ఇప్పటికీ క్రియాశీలకంగా ఉందని మీరు ఎలా చెప్పగలరు?

. వివిధ భూ పొరల పేర్లను తెలుపండి. వాటి మధ్యగల భేదాలను తెలుపండి.

. చిత్రం 1.3 ను పరిశీలించి, మీరు గమనించిన విషయాలను వివరించండి.

. పేజీనంబరు 5 లోని 'భూ పటలం' పేరాను చదివి మీ అభిప్రాయాన్ని చెప్పండి.

(ఉపాధ్యాయుడు ప్రశ్నల జవాబులను విద్యార్థులచే చర్చింప చేస్తూ, అవసరమయిన చోట వివరిస్తూ ముగించాలి)

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయించడం :**

**పట నైపుణ్యాలు :**

. ప్రపంచ భౌతిక పటాన్ని పరిశీలించి, వివిధ పర్వతాలు, అవి అన్న ప్రదేశాలను తెలుసుకుని ఒక పట్టికలో పొందు పరచండి.

పిల్లలూ ! పాఠం బాగా అర్థమయింది కదా!

బోర్డుపైన రాసిన ప్రశ్నలకు జవాబులను నోట్‌బుక్‌లో రాయండి.

## IV. ఇంటిపని :

పిల్లలూ ఇంకా ఏవైనా ప్రశ్నలు మిగిలితే ఇంటిదగ్గర జవాబులు రాసుకుని రండి.

# పీరియడ్ ప్రణాళిక - 4

పీరియడ్ - 4 సమయం : 45 ని॥లు

**ఉప శీర్షిక : భూపటలం యొక్క కదలికలు**

**I. ఉపోద్ఘాతం :**

**1. పలకరింపు :**

గుడ్ మార్నింగ్! పిల్లలూ.... ఎలా ఉన్నారు? బావున్నారా? ఇంటిపని పూర్తి చేసారా? వెరీగుడ్.

**2. పునశ్చరణ :** మీ కర్థమయిన విషయాలను ఒకసారి పరీక్షిద్దాం. !

. భూమి ఒక గ్రహమా ? నక్షత్రమా?

. భూమి లోపల ఏముంటుంది ?

. భూమి పొరల మధ్యన గల భేధాలను వివరించండి.

భూపటలంలో ఏర్పడే కదలికలు, వాటి పరిణామాలను గూర్చి తెలుసుకుందాం.

**3. పాఠ్యాంశ ప్రకటన :**

**భూపటలం యొక్క కదలికలు**

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశ శీర్షికను నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశాన్ని చదువుట, తెలియని పదాలు గుర్తించుట:**

1. పిల్లలూ...మీ పాఠ్యపుస్తకాలను తెరచి, పేజీ నంబరు 6 మరియు పేజినంబరు 7లో 'భూమిగ్రిడ్ వ్యవస్థ' ముందరి పేరా వరకు చదవండి.

   మీకు తెలియని, అర్థంకాని పదాలు, భావనలను గుర్తించండి. వాటి కింద పెన్సిలుతో గీత గీయండి.

   ఉదా: భూ పటలం

   ఖండ చలన సిద్ధాంతం

   మహా సముద్రాలు

   పాంజియా

2. పిల్లలూ... మీకు తెలియని పదాలు, భావనలను గుర్తించారు కదా ! మీరు గుర్తించిన పదాలను ఒక్కొక్కరుగా చెప్పండి.

   (ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను బోర్డుపై కుడివైపు చివరన రాయాలి. పదాలపై చర్చద్వారా అవగాహనను కల్పించాలి.)

**III. భావనల అవగాహన – చర్చ :**

**1. మాట్లాడించుట :**

పిల్లలూ... అందరూ పాఠం చదివారు కదా! మీకు అర్థమయిన విషయాలను చెప్పండి.

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై విద్యార్థులచే మాట్లాడించాలి. వెరీ గుడ్ ! బాగా చెప్పారు.

**2. ప్రశ్నించుట :**

పిల్లలూ.... పాఠ్యాంశంలో మీకు అర్థంకాని అంశాలపైన ప్రశ్నలు అడగండి.

(ఉపాధ్యాయుడు సమకాలీన అంశాలు జోడిస్తూ, విద్యార్థులు ప్రశ్నించేటట్లు పోత్సహించాలి)

**3. పాఠ్యాంశ అవగాహనా ప్రశ్నలు :**

పిల్లలూ... పాఠ్యాంశం మరింత అవగాహన కావడానికి నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. జవాబులను ఆలోచించి, చెప్పండి.

(ఉపాధ్యాయుడు తాను ముందుగానే తయారు చేసుకున్న, విద్యార్థులు అడిగిన ప్రశ్నలను బోర్డుపై రాయాలి.)

. చిత్రం 1.4ను పరిశీలించి, మీకే మర్థమయిందో చెప్పండి.

. భూమి చరిత్రలో చోటు చేసుకున్న కొన్ని అద్భుత ఘటనలను తెలుపండి.

. చిత్రం 1.4 ను పరిశీలించి, భారతదేశం ఏ దిశ వైపుకు కదిలిందో తెలుపండి.

. 6వ పేజీలోని 2వ పేరాను చదివి, ఖండాలు, చలనాల గురించి వ్యాఖ్యానించండి.

(ఉపాధ్యాయుడు విద్యార్థులచే సమాధానాలను చర్చింప చేస్తూ, మైండ్ మ్యాపింగ్ చుట్టూ జవాబులను రాస్తూ, అవసరమయిన చోట సమాచారాన్ని ఇస్తూ పాఠ్యాంశ అవగాహనను ముగించాలి)

**4. నైపుణ్యాలను అభ్యాసం చేయించడం :**

పట నైపుణ్యాలు :

. ప్రపంచ పటాన్ని గమనించి, జిగ్‌సా పజిల్ లోని రెండు ముక్కలుగా ఏవైనా ఖండాలు కనిపిస్తున్నాయో, లేదో పరిశీలించి, వాటి పేర్లను రాయండి.

. ప్రపంచ పటంలో లారెన్షియా, గోండ్వానా భూములను, వాటిలోని దేశాలను గుర్తించండి. వాటిలోని పిల్లలు...పాఠం బాగా అర్థమయింది కదా! అందరూ నోటు పుస్తకాలు తీసి, బోర్డుపైన రాసిన ప్రశ్నల జవాబులను రాయండి.

**IV. ఇంటిపని :**

పిల్లలూ ... మీరు జవాబులు రాయగా, మిగిలిన ప్రశ్నలను ఇంటిదగ్గర రాసుకుని రండి.

# పీరియడ్ ప్రణాళిక - 5

పీరియడ్ - 5 సమయం : 45 ని॥లు


**ఉప శీర్షిక : భూమిగ్రిడ్ వ్యవస్థ , అక్షాంశాలు**

**I. ఉపోద్ఘాతం :**

**1. పలకరింపు :**

పిల్లలూ.... శుభోదయం! ఎలా ఉన్నారు? నిన్నటి ఇంటిపని పూర్తి చేసారా? వెరీగుడ్ !

**2. మైండ్ మ్యాపింగ్ :** మనం నిన్నటి దాకా భూమి నిర్మాణం, ఖండాల అమరిక గురించి చర్చించాం కదా ! భూమి గురించి చర్చించేటప్పుడు అట్లాసు, గ్లోబులను ఉపయోగిస్తాం ! అవునా! ఈ అట్లాసు, గ్లోబు ద్వారా ఏఏ విషయాలు తెలుసుకోవచ్చో ఆలోచించి చెప్పండి.




వెరీగుడ్ ! చాలా విషయాలు చెప్పారు. ఈ రోజు మనం అక్షాంశాలు, రేఖాంశాలతో ఉండే భూమి గ్రిడ్ గురించి, అలాగే అక్షాంశాల గురించి మరిన్ని విషయాలను తెలుసుకుందాం !

3. పాఠ్యాంశ ప్రకటన :

**భూమి గ్రిడ్ వ్యవస్థ, అక్షాంశాలు**

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశ శీర్షికను నల్లబల్లపై రాయాలి)

**II. పాఠ్యాంశాన్ని చదువుట, తెలియని పదాలు గుర్తించుట:**

1. పిల్లలూ...మీ పాఠ్యపుస్తకంలోని 7వ పేజీలోని 'భూమిగ్రిడ్ వ్యవస్థ' నుండి 9వ పేజీ రేఖాంశాలు ముందర పేరా వరకు చదవండి. మీకు తెలియని, అర్థంకాని భావనలను, పదాలను గుర్తించండి. వాటి కింద పెన్సిలుతో గీత గీయండి.

ఉదా: గూగుల్ ఎర్త్, పశ్చిమార్థగోళం

పసిఫిక్ అగ్ని వలయం, భూమధ్యరేఖ

2. పిల్లలూ... మీకు తెలియని పదాలను గుర్తించారు కదా ! మీరు గుర్తించిన పదాలను ఒక్కొక్కరుగా చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను బోర్డుపై కుడివైపు చివరన రాయాలి. పదాలపై చర్చద్వారా అవగాహనను కల్పించాలి.)

**III. భావనల అవగాహన చర్చ :**

1. మాట్లాడించుట :

పిల్లలూ... అందరూ పాఠం చదివారు కదా! మీకు అర్థమయిన విషయాలను చెప్పండి.

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై విద్యార్థులచే మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి.)

బావుంది ! అందరూ చాలా బాగా చెప్పారు.

2. ప్రశ్నించుట :

పిల్లలూ.... పాఠ్యాంశంలో మీకు అర్థంకాని అంశాలపైన ప్రశ్నలు వేయండి.

(విద్యార్థులు సమకాలీన అంశాలను జోడిస్తూ పాఠ్యాంశంపై ప్రశ్నించేటట్లు ఉపాధ్యాయుడు విద్యార్థులను పోత్సహించాలి)

3. పాఠ్యాంశ అవగాహనా ప్రశ్నలు :

పిల్లలూ... పాఠం మరింత అవగాహన కావడానికి మీకు కొన్ని ప్రశ్నలు ఇస్తాను. సమాధానాలను ఆలోచించి చెప్పండి.

(ఉపాధ్యాయుడు తాను ముందుగానే తయారు చేసుకున్న ప్రశ్నలను మరియు విద్యార్థులు అడిగిన ప్రశ్నలను బోర్డుపైన రాయాలి.)

. అట్లాసు ద్వారా ఏఏ అంశాలు తెలుసుకోవచ్చు?

. చిత్రం 1.5 ను పరిశీలించి, ముఖ్యమైన అక్షాంశాలను పేర్కొనండి.

. గ్రిడ్ అనగా నేమి? అది మనకు ఎలా సహాయపడుతుంది?

. 9వ పేజీలోని 3వ పేరాను చదివి, అక్షాంశాల గురించి మీకు ఏమర్థమయిందో సొంత మాటల్లో చెప్పండి.

. గ్లోబు యొక్క ఉపయోగాలను తెలుపండి.

(ఉపాధ్యాయుడు విద్యార్థులచే సమాధానాలను చర్చింప చేస్తూ, అవసరమయిన చోట సమాచారాన్ని ఇస్తూ, మైండ్ మ్యాపింగ్ చుట్టూ రాస్తూ పాఠ్యాంశ అవగాహనను ముగించాలి)

4. నైపుణ్యాలను అభ్యాసం చేయించడం :

సమాచార నైపుణ్యాలు / పటనైపుణ్యాలు :

. 8వ పేజీలోని చిత్రాలను పరిశీలించి, చిత్రాల కింద ఇచ్చిన పట్టికను పూరించండి.

. కొన్ని ముఖ్య అక్షాంశాలు, అవి పోయే దేశాల పేర్లను అట్లాసులో పరిశీలించి పట్టికలో నమోదు చేసి, విశ్లేషించండి.

| అక్షాంశము | ఏఏ దేశాల గుండా ప్రయాణిస్తుంది |
|---|---|
| కర్కటరేఖ (23½ ఉ.అ.) | |
| మకర రేఖ (23½ ద.అ.) | |
| భూమధ్యరేఖ $(0^0)$ | |

పై పట్టికను పరిశీలించి సమాధానాలు రాయండి.

. ఏ అక్షాంశము ఎక్కువ దేశాల గుండా ప్రయాణిస్తుంది?

. భూగోళాన్ని రెండు సమాన అర్థ గోళాలుగా విభజిస్తున్న అక్షాంశమేది?

. ఏ ఖండం గుండా మూడు ప్రధాన అక్షాంశాలు ప్రయాణిస్తున్నాయి?

పిల్లలూ... సమాధానాలు బాగా చెప్పారు.

ఇప్పుడు , మీరందరూ మీ నోటు పుస్తకాలు తెరచి బోర్డుపైన రాసిన ప్రశ్నలకు జవాబులను రాయండి.

**IV. ఇంటిపని :**

పిల్లలూ ... జవాబులు రాసారు కదా ! మిగిలిన ప్రశ్నలకు జవాబులను ఇంటి దగ్గర పూర్తి చేయండి.

# పీరియడ్ ప్రణాళిక - 6

పీరియడ్ - 6 సమయం : 45 ని॥లు

**ఉప శీర్షిక : రేఖాంశాలు**

**I. ఉపోద్ఘాతం :**

**1. పలకరింపు :**

పిల్లలూ.... శుభోదయం! నిన్నటి ఇంటిపని పూర్తి చేసారా? వెరీగుడ్ !

**2. పునశ్చరణ :** నిన్న మనం అక్షాంశాలు, భూమి గ్రిడ్ వ్యవస్థ గురించి చర్చించాం కదా ! మీ కెంతవరకు అర్థమయిందో ఒకసారి చూద్దాం. నేనడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

. అట్లాసును పరిశీలించి ఏమేమి తెలుసుకోవచ్చు?

. గ్లోబు ఉపయోగమేమిటి?

. $90^0$ అక్షాంశాలను ఏమని పిలుస్తారు?

వెరీగుడ్ ! బాగా చెప్పారు. ఈరోజు మనం రేఖాంశాల గురించి వివరంగా చర్చిద్దాం!

**3. పాఠ్యాంశ ప్రకటన :**

**రేఖాంశాలు**

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశ శీర్షికను బోర్డుపైన రాయాలి)

**II. పాఠ్యాంశాన్ని చదువుట, తెలియని పదాలు గుర్తించుట:**

1. పిల్లలూ...మీరందరూ మీ పాఠ్యపుస్తకాలు తెరచి 9వ పేజీలోని 'రేఖాంశాలు' పేరా నుండి 10వ పేజీ లోని మొదటి 5 పేరాల వరకు చదవండి. మీకు తెలియని, అర్థంకాని పదాలు, భావనల కింద పెన్సిలుతో గీత గీయండి.

ఉదా: గ్రీన్‌విచ్ మెరిడియన్, పశ్చిమార్థగోళం

తూర్పు అర్థగోళం, యాంటి మెరిడియన్

2. పిల్లలూ... మీకు తెలియని పదాలు, భావనలను గుర్తించారు కదా ! మీరందరూ గుర్తించిన పదాలను ఒక్కొక్కరుగా చెప్పండి.
(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను బోర్డుపై కుడివైపు చివరన రాయాలి. చర్చద్వారా పదాల అవగాహనను కల్పించాలి.)

**III. భావనల అవగాహన - చర్చ :**

1. మాట్లాడించుట :
పిల్లలూ... మీరందరూ పాఠం చదివారు కదా! మీకు అర్థమయిన విషయాలను చెప్పండి.
(ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై పిల్లలచే మాట్లాడించాలి.)
వెరీగుడ్ ! చాలా బాగా చెప్పారు.

2. ప్రశ్నించుట :

పిల్లలూ.... పాఠంలో మీకు అర్థంకాని పదాలు, భావనలపై ప్రశ్నలు అడగండి.

(ఉపాధ్యాయుడు, పిల్లలందరూ సమకాలీన అంశాలు జోడిస్తూ ప్రశ్నలు వేసేటట్లు పోత్సహించాలి)

3. పాఠ్యాంశ అవగాహనా ప్రశ్నలు :

పిల్లలూ... పాఠం మరింత అర్థమవటానికి నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. జవాబులను ఆలోచించి చెప్పండి.

(ఉపాధ్యాయుడు విద్యార్థులు అడిగిన మరియు తాను తయారు చేసుకున్న ప్రశ్నలను బోర్డుపై రాయాలి.)

. చిత్రం 1.6 ను పరిశీలించి, మీకు అర్థమయిన విషయాలను చెప్పండి.

. గ్రీనిచ్ గుండా వెళ్ళే రేఖాంశాన్ని ఎందుకు $0^0$ల రేఖాంశంగా గుర్తించారు?

. మొత్తం ఎన్ని రేఖాంశాలుంటాయి?

. 'అక్షాంశాలు, రేఖాంశాలు ఊహాజనిత గీతలు!' ఈ వాక్యం చదవటం ద్వారా మీకేమర్థమయిందో చెప్పండి.

. రేఖాంశాల గురించి తెలుసుకోవడానికి మీరెలా ప్రశ్నిస్తారు?

(ఉపాధ్యాయుడు విద్యార్థులచే సమాధానాలను చర్చింప చేస్తూ, అవసరమయిన చోట సమాచారాన్ని ఇస్తూ, మైండ్ మ్యాపింగ్ చుట్టూ రాస్తూ పాఠ్యాంశ అవగాహనను ముగించాలి)

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం :

పటనైపుణ్యాలు :

. వివిధ రేఖాంశాలను గ్లోబు, అట్లాసుపై పరిశీలించండి.

. ప్రపంచ పటంపైన, అట్లాసు సహాయంతో కింది రేఖాంశాలను గీయండి.

(ఎ) గ్రీన్విచ్ రేఖాంశం (బి) $60^0$ పశ్చిమ రేఖాంశం (సి) $82½^0$ తూర్పురేఖాంశం

. అట్లాసు సహాయంతో భారతదేశంగుండా ఏఏ రేఖాంశాలు ప్రయాణిస్తాయో గుర్తించండి.

పిల్లలూ... పాఠం అర్థమయింది కదా ! మీ నోటు పుస్తకాలలో బోర్డుపై రాసిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

**IV. ఇంటిపని :**

పిల్లలూ ... జవాబులు రాసారా? మిగిలిన ప్రశ్నలకు జవాబులను ఇంటి దగ్గర రాసుకుని రండి.

# పీరియడ్ ప్రణాళిక - 7

పీరియడ్ – 7 సమయం : 45 ని॥లు

**ఉప శీర్షిక : రేఖాంశాలు, సమయం**

**I. ఉపోద్ఘాతం :**

1. పలకరింపు : పిల్లలూ.... గుడ్ మార్నింగ్ ! ఎలా ఉన్నారు? అందరూ నిన్న ఇచ్చిన ఇంటిపని చేసారా? వెరీగుడ్.
2. పునశ్చరణ : నిన్న రేఖాంశాల గురించి చర్చించాం కదా! మీకు ఎంతవరకు అర్థమయిందో చూద్దామా! నేనడిగే ప్రశ్నలకు జవాబివ్వండి.

   1. రేఖాంశాలు వేటిని సూచిస్తాయి?
   2. $0^0$ ల రేఖాంశాన్ని ఏమని పిలుస్తారు?
   3. మొత్తం ఎన్ని రేఖాంశాలున్నాయి?
   4. రేఖాంశాలు భూమి మీద గీసి ఉంటాయా? నువ్వేమనుకుంటున్నావు?

   వెరీగుడ్ ! సమాధానాలు కరక్టుగా చెప్పారు.

   ఈ రోజు మనం రేఖాంశాల గురించి మరికొన్ని విషయాలను తెలుసుకుందాం!

3. పాఠ్యాంశ ప్రకటన :

**రేఖాంశాలు, సమయం**

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశ శీర్షికను బోర్డుపై రాయాలి)

**II. పాఠ్యాంశాన్ని చదువుట, తెలియని పదాలు గుర్తించుట:**

1. పిల్లలూ...మీరందరూ మీ పాఠ్యపుస్తకాలు తెరచి, పేజీనంబరు 10లో 'రేఖాంశాలు, సమయం' పేరా నుండి 11వ పేజీ పాఠం చివర వరకూ చదవండి.

   మీకు తెలియని, అర్థంకాని పదాలు, భావనలను గుర్తించండి. వాటి కింద పెన్సిలుతో గీత గీయండి.

   ఉదా: సూర్యుడు నడినెత్తిన ఉండటం

   కాల మండలాలు

   ప్రామాణిక సమయం

   ఐ.ఎస్.టి.

2. పిల్లలూ... మీకు తెలియని పదాలు, భావనలను గుర్తించారు కదా ! మీరందరూ గుర్తించిన పదాలను ఒక్కొక్కరుగా చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను బోర్డుపై కుడివైపు చివరన రాయాలి. చర్చద్వారా పదాల అవగాహనను కల్పించాలి.)

**III. భావనల అవగాహన - చర్చ :**

1. మాట్లాడించుట :

పిల్లలూ... మీరందరూ పాఠం చదివారు కదా! మీకు అర్థమయిన విషయాలను చెప్పండి.

(ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై పిల్లలచే మాట్లాడించాలి.)

వెరీగుడ్ ! చాలా బాగా చెప్పారు.

2. ప్రశ్నించుట :

పిల్లలూ.... పాఠంలో మీకు అర్థంకాని అంశాలపైన, సమకాలీన అంశాలపై ప్రశ్నలు వేయండి.

(ఉపాధ్యాయుడు, పిల్లలు ప్రశ్నించేటట్లు ప్రోత్సహించాలి)

3. పాఠ్యాంశ అవగాహనా ప్రశ్నలు :

పిల్లలూ... పాఠ్యాంశంపై మరింత అవగాహన కోసం నేను కూడా కొన్ని ప్రశ్నలు అడుగుతాను. సమాధానాలను ఆలోచించి, చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు అడిగిన ప్రశ్నలను, తాను ముందుగానే తయారు చేసుకున్న ప్రశ్నలను బోర్డు పైన రాయాలి.)

. స్థానిక కాలం, ప్రామాణిక కాలం మధ్యగల తేడా ఏమిటి?

. భూమధ్యరేఖ, ప్రామాణిక రేఖాంశం మధ్యగల పోలికలు, భేదాలను చెప్పండి.

. భారత దేశంలో ప్రతి రాష్ట్రం తమ స్థానిక సమయం పాటిస్తే ఎలాంటి సమస్యలు వస్తాయి?

. పేజినంబరు 11లోని 'మీకు తెలుసా?' అంశాన్ని చదివి మీకేమర్థమయిందో చెప్పండి.

. పేజీనంబరు 12లోని 'మీకు తెలుసా?' లోని రెండవ అంశం చదవండి. స్వాతి రాత్రివేళల్లోనే పనిచేస్తుందని మీరు ఎందుకు అనుకుంటున్నారు? రాత్రివేళల్లో పని చేయడం సరియైనదో కాదో తెలుపండి.

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం :

పటనైపుణ్యాలు / సమాచార నైపుణ్యాలు :

. ప్రపంచపటంలో కింది దేశాల ప్రామాణిక రేఖాంశాలను గుర్తించండి.

(అ) భారతదేశం (ఆ) నేపాల్ (ఇ) పాకిస్తాన్ (ఈ) ఇంగ్లాండు (ఉ) జపాన్ (ఊ) శ్రీలంక (ఋ) బంగ్లాదేశ్ (ౠ) చైనా

. పై ప్రశ్నలోని వివిధ దేశాల ప్రామాణిక రేఖాంశాలను, సమయాలను పట్టికలో నమోదుచేసి విశ్లేషించండి.

| క్ర.సం. | దేశము | ప్రామాణిక రేఖాంశం | గ్రీన్విచ్ రేఖాంశం సమయానికి ముందా, వెనుకా | ఎంత సమయం |
|---|---|---|---|---|
| 1. | | | | |
| 2. | | | | |
| 3. | | | | |
| 4. | | | | |
| 5. | | | | |
| 6. | | | | |
| 7. | | | | |
| 8. | | | | |

. ఏ దేశంలో సూర్యోదయం ముందుగా అవుతుంది?

. గ్రీన్విచ్ రేఖాంశం కంటే భారతదేశ ప్రామాణిక రేఖాంశం ఎంత ఎక్కువ?

. భారతదేశంలో ఉదయం 5 గంటలప్పుడు పాకిస్తాన్‌లో ఎంత సమయమవుతుంది?

పిల్లలూ... సమాధానాలు కరక్టుగా చెప్పారు. పాఠంబాగా అర్థమయింది కదా ! అందరూ నోటు పుస్తకాలు తీసి, మనం ఇప్పటిదాకా చర్చించిన బోర్డుపైన ప్రశ్నలకు జవాబులను రాయండి.

**IV. ఇంటిపని :**

పిల్లలూ... సమాధానాలు రాసారా? O.K. మిగిలిన ప్రశ్నలకు జవాబులను ఇంటిదగ్గర రాసుకుని రండి.

# పీరియడ్ ప్రణాళిక - 8

పీరియడ్ - 8 సమయం : 45 ని॥లు

**ఉప శీర్షిక : మీ అభ్యసనాన్ని మెరుగు పరచుకోండి, నోటుపుస్తకాల పరిశీలన, ప్రాజెక్టులు**

**I. ఉపోద్ఘాతం :**

**1. పలకరింపు :** పిల్లలూ.... గుడ్ మార్నింగ్ ! నిన్నటితో మనం 1వ పాఠం చర్చించడం పూర్తియింది కదా! అందరూ ఇంటి పని పూర్తి చేసారా? వెరీగుడ్ !

**2. పునశ్చరణ :** ఈ రోజు మనం 'ప్రెస్ కాన్ఫరెన్స్' (Meet the Press) ను నిర్వహించు కుందాం! మన అంశం: భూమి–మనం గోపి, రాము, నిత్యశ్రీ, వెంకటయ్య, లక్ష్మి, వినయ్, చందన ఈ ఏడుగురు మిగిలిన విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానాలిస్తారు. కాబట్టి, మీరందరు ప్రశ్నలతో సిద్ధంగా ఉండండి.

జవాబులు చెప్పే విద్యార్థులు

1.
2.
3.
4.
5.
6.
7.

పాఠ్యాంశంపై ప్రశ్నలు అడిగే విద్యార్థులు

(ఉపాధ్యాయుడు పిల్లలందరూ ప్రశ్నలడిగేలా ప్రోత్సహించాలి)

పీరియడ్ చివరన విద్యార్థుల సందేహాలను తీరుస్తూ పాఠాన్ని ముగించాలి)

నోటు పుస్తకాలను పరిశీలించాలి. తెలియని వాటికి సమాధానాలు చెప్పాలి)

# 8. నిరంతర సమగ్ర మూల్యాంకనం - నమూనా ప్రశ్నాపత్రం

**పరిచయం :**

**NCF** – 2005 అమలును ప్రారంభించినప్పటి నుండి మూల్యాంకనంలో వస్తున్న అనేక మార్పులను మీరు గమనించే ఉంటారు. ప్రాథమిక స్థాయి మూల్యాంకనం లాగానే 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు **C.C.E.** ను ప్రవేశ పెట్టడం జరిగింది. దీనినే నిరంతర సమగ్ర మూల్యాంకనం అంటారు. నిరంతర సమగ్ర మూల్యాంకనం అనగా పాఠశాల స్థాయిలో విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే అన్ని అంశాలను నిరంతరం మధింపుచేసే ప్రక్రియ.

## ఈ అధ్యాయం ద్వారా మనం ఏమి తెలుసుకుంటాం !

* **C.**C.E అంటే ఏమిటి? ఎందుకు?
* C.C.E నిర్వహణా విధానం
* ఫార్మేటివ్ మూల్యాంకనం
* సమ్మేటివ్ మూల్యాంకనం
* సమ్మేటివ్ మూల్యాంకనం – భారత్వ పట్టిక
* సమ్మేటివ్ ప్రశ్నాపత్ర తయారీ సూచనలు
* గ్రేడింగ్
* విద్యా ప్రమాణాలు – నమూనా ప్రశ్నలు
* సంగ్రహణాత్మక మదింపు – 9వ తరగతి నమూనా ప్రశ్నా పత్రం

పాఠ్యబోధనకు ముందు, బోధనాభ్యసన ప్రక్రియ జరుగుతున్నప్పుడు, తరువాత – తరగతిగదిలో, ప్రయోగశాలలో, గ్రంథాలయంలో, ఆటస్థలంలో విద్యార్థి యొక్క శారీరక, మానసిక, సాంఘిక , ఉద్వేగ వికాసాలను పరిశీలించి నమోదుచేయుట **C.C.E.** ముఖ్య ఉద్దేశ్యం. ఈ నమోదు ఆధారంగా విద్యార్థిప్రగతిని ఎప్పటికప్పుడు విశ్లేషించి బోధనాభ్యసన ప్రక్రియలో క్రమానుగత మార్పులు చేస్తూ సవరణాత్మక బోధన **(Remedial teaching),** విభిన్న పద్ధతులను అన్వయిస్తూ విద్యార్థి సంపూర్ణ వికాసానికి తోడ్పడేదే నిరంతర సమగ్ర మూల్యాంకనం.

**C-(Continuous) : -** (నిరంతరం) అనగా బోధనాభ్యసన మొదలైనప్పటి నుండి బోధనాభ్యసన ప్రక్రియ జరుగుతున్నంతసేపూ కొనసాగేది.

**C- (Comprehensive)** (సమగ్ర) బోధనాంశాలతోపాటు బోధనేతర అంశాలయిన జీవన నైపుణ్యాలు, నైతిక విద్య, వైఖరులు, విలువలు, ఇతర అన్ని సహ పాఠ్యాంశాలలో విద్యార్థి యొక్క వికాసము మదింపు.

**E-(Evaluation)** (మూల్యాంకనము) విద్యాభ్యసన క్రమంలో విద్యార్థి ప్రగతిని విశ్లేషించి నమోదుచేయుట మరియు దానిని విద్యార్థి పురోభివృద్ధికి ఉపయోగించుట.

సాంప్రదాయ పరీక్షా విధానంలో విద్యార్థికి నిర్దిష్ట ప్రశ్నలకు జవాబులను బట్టీ పట్టి మార్కులు సంపాదించడమే పరమావధిగా ఉండేది తద్వారా, విద్యార్థి పరీక్షల ఒత్తిడికి గురై విద్యాభ్యసనను, పరీక్షా విధానాన్ని భాధాకరమైన ప్రక్రియలుగా భావిస్తున్నాడు.

మూల్యాంకనం పేరుతో ప్రస్తుతం తరగతి గదులలో అమలవుతున్న పరీక్షలు పిల్లల జ్ఞానాన్ని ముఖ్యంగా గుర్తు పెట్టుకునే సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నాయే తప్ప తరగతి గదిలో పొందిన జ్ఞానాన్ని నిజజీవితంలో ఎలా వినియోగించుకోగలుగుతున్నారు, ప్రకృతి పట్ల, పర్యావరణంపట్ల, సమాజం పట్ల ఎలా స్పందించగలుగుతున్నారు? అనే అంశాలను పరిశీలించడంలేదు. ఈ అంశాలు మూల్యాంకనంలో లేకపోవడం, విద్యా లక్ష్యాల చట్ట స్ఫూర్తికే వ్యతిరేకమౌతుందని గుర్తించాలి.

పరీక్షా విధానం పిల్లల మనసులను గాయపరచకుండా, నిర్భయంగా, ఆందోళన, వత్తిడులు లేకుండా చేసి వారి భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు ప్రోత్సహించాలి. ఈ సందర్భంగా **NCF - 2005, SCF - 2011** మరియు **RTE - 2009** అన్నీ కూడా ముక్త కంఠంతో **C.C.E** అమలు యొక్క ఆవశ్యకతను చాటి చెప్పాయి. ఒకే రాత పరీక్ష ద్వారా విద్యాభివృద్ధిని మదింపు చేయుట అసాధ్యము మరియు అశాస్త్రీయము. మూల్యాంకనము సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించాలి అంటే మూల్యాంకన ప్రక్రియ నిరంతరం కొనసాగాలి.

విద్యాభ్యాసం నిర్మాణాత్మకంగా జరిగి విద్యార్థి జ్ఞానం, సామర్థ్యాలు , నైపుణ్యాలు మరియు అంతర్గత శక్తులను వారి పూర్తి సామర్థ్యం మేరకు అభివృద్ధి చెందించడానికి మూల్యాంకన విధానం తోడ్పడాలి. పై సమస్యలన్నింటికి సమాధానంగా నిరంతర సమగ్ర మూల్యాంకనం మనముందుకు వచ్చింది.

**గ్రేడింగ్ విధానం :** పిల్లలలో మార్కులు, ర్యాంకుల కోసం జరిగే అనారోగ్యకర పోటీని నిరోధించడానికి ప్రభుత్వం నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా మార్కుల ఆదారిత గ్రేడింగ్ పద్ధతిని అమలు చేస్తోంది. ఫార్మేటివ్, సమ్మేటివ్ మూల్యాంకనంలో పిల్లలు సాధించిన ప్రగతిని 5 పాయింట్ల స్కేలులో (5,4,3,2,1) మాపనం చేస్తారు. **$A^+$, A, $B^+$, B, C** గ్రేడులుగా పిల్లల ప్రగతిని నిర్ధారిస్తారు. పిల్లల ప్రగతిని సామర్థ్యాల వారీగా పరిశీలించడం, నమోదు చేయడం అనే అంశం, వారి అభ్యసనాన్ని మెరుగు పరుచుకునేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

**నిరంతర సమగ్ర మూల్యాంకనం - నిర్వహణా విధానం**

* నిరంతర సమగ్ర మూల్యాంకనం ఒక సాంప్రదాయ, సాధారణ పరీక్ష కాదు. పిల్లలు నేర్చుకోవడానికి దోహదపడే ఒక బోధనాభ్యసన ప్రక్రియ **(Assessment for learning).**

* పాఠ్యబోధనకు ముందు, బోధనాభ్యసన ప్రక్రియలు జరుగుతున్నప్పుడు, తర్వాత తరగతి గదిలో, ప్రయోగశాలలో, గ్రంథాలయంలో, ఆటస్థలంలో పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలను పరిశీలించి నమోదు చేసే ప్రక్రియ.

* నిరంతర సమగ్ర మూల్యాంకనంలో 1. ఫార్మేటివ్‌అసెస్‌మెంట్ 2. సమ్మేటివ్ అసెస్‌మెంట్ అనే రెండు విధానాలుంటాయి.

* ఫార్మేటివ్ మదింపు సంవత్సరంలో 4 సార్లు (జులై, సెప్టెంబర్, డిసెంబర్, ఫిబ్రవరి) నిర్వహిస్తాం.

* సమ్మేటివ్ మదింపు సంవత్సరంలో 3 సార్లు (అక్టోబర్, జనవరి, ఏప్రిల్) నిర్వహిస్తాం.

* నిరంతర సమగ్ర మూల్యాంకనం విద్యా ప్రమాణాలలో పిల్లల ప్రగతిని విపులంగా పరిశీలించేదిగా ఉంటుంది.

**ఫార్మేటివ్ మదింపులో 4 అంశాలుంటాయి. 50 మార్కులు కేటాయించబడి ఉంటాయి.**

1. పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (Children participation, Responses) - 10 మార్కులు
2. పిల్లలు రాసిన అంశాలు (Written Works)- 10 మార్కులు
   (Note Books, Homework,Assignments etc.,)
3. ప్రాజెక్టు పనులు (Project Works)- 10 మార్కులు
4. లఘు పరీక్ష (Slip test/Written test) - 20 మార్కులు
   (రాత పరీక్ష)

* ఫార్మేటివ్ మదింపులో పరిశీలనలు, రాత, ప్రాజక్టు పనులు రోజువారీ బోదనాభ్యసనంలో భాగంగా ఉపాధ్యాయుడు పరిశీలించి నమోదు చేయాలి.

* పిల్లలు ప్రశ్నించడం, జట్లలో పనిచేయడం, ప్రదర్శించడం, వ్యక్తీకరించడం వంటి అంశాలను పరిశీలించి నమోదు చేయాలి.

* పిల్లలు తరగతి గదిలో రాసుకుంటున్న నోటు పుస్తకాలు, ఇంటిపని నోటు పుస్తకాలు, కాంపోజిషన్లు వంటి రాత అంశాలు పరిశీలించి నమోదు చేయాలి.

* ఫార్మేటివ్ మదింపు కాలంలో పిల్లలకు ఇచ్చిన ప్రాజెక్టును పరిశీలించి నమోదుచేసుకోవాలి.

* పై మూడు అంశాలు పరిశీలన చేసి నిర్ధారిత సమయంలోనే పూర్తి చేయవలెను.
* ఫార్మేటివ్‌లో రాత పరీక్షను 20 మార్కులకు నిర్వహించాలి.
* సమ్మేటివ్ పరీక్ష ప్రాథమిక స్థాయిలో 50 మార్కులకు, ప్రాథమికోన్నత స్థాయిలో 100 మార్కులకు ఉంటుంది.
* సమ్మేటివ్ మదింపులో రాత పరీక్షలో అన్ని విద్యా ప్రమాణాలు పరిశీలించాలి.
* ప్రశ్నాపత్రంను విద్యాప్రమాణాలవారీగా విభజించి రూపొందించాలి.
* ప్రతి విద్యా ప్రమాణంలో ఇచ్చే ప్రశ్నలు వ్యాసరూప, స్వల్పసమాధాన, సంక్షిప్త, లక్ష్యాత్మక ప్రశ్నలుగా ఉండాలి. అయితే ప్రతి విద్యా ప్రమాణంలో పై నాలుగు రకాలు తప్పనిసరిగా రావలసిన అవసరంలేదు. ఏ విద్యా ప్రమాణంను ఏ రకమైన ప్రశ్నలద్వారా పరిశీలించేందుకు వీలు ఉంటుందో గుర్తించి ఆయారకాల ప్రశ్నలు ఇవ్వాలి.

**పిల్లలు భాగస్వామ్యం – ప్రతిస్పందనలు :**

ఉపాధ్యాయుడు తరగతి గదిలో, పాఠ్యబోధనా సమయంలో గాని, వివిధ సందర్భాలలో గాని పిల్లలను పరిశీలించాలి. పరిశీలన ద్వారా వారికి వివిధ అంశాలలో గ్రేడు ఇవ్వాలి.

**సాంఘిక శాస్త్ర పరిశీలనాంశాలు**

* తరగతిలో బోధనాభ్యసన ప్రక్రియ జరుగుతున్నప్పుడు పిల్లలు ప్రశ్నించడం, మాట్లాడడం, వ్యాఖ్యానించడంలను పరిశీలించాలి.
* పటాన్ని పరిశీలించడం, వివరించడం పరిశీలించాలి.
* విషయాలకు స్థానిక అంశాలు జోడించడం, అనుభవాలు పంచుకోవడం లాంటివి పరిశీలించాలి.
* సమస్యల పట్ల ప్రతి స్పందించడం, ప్రశంసించడం లాంటివి చేస్తున్నారా అనే విషయాలను పరిశీలించాలి.
* పిల్లలు జట్లలో పాల్గొనే విధంను పరిశీలించాలి.

  ఈ రకమైన పరిశీలనల ఆధారంగా రెండు నెలలకు ఒకసారి (అనగా FA మాసంలో) రికార్డు చేయాలి.

**పిల్లలు రాసిన అంశాలు**

* నోటు పుస్తకాలు విషయాల వారీగా పూర్తిచేసి ఉండడం.
* సమాచార పట్టికలు పూర్తి చేయడం, అందుబాటులో ఉండడం.
* పాఠ్యపుస్తకాలలోని అభ్యాసాలను పూర్తి చేయడం.
* పటాలను గుర్తించడం, గీయడం
* పిల్లల పోర్ట్ ఫోలియోలు, గోడపత్రికలలో సాంఘిక శాస్త్ర అంశాలు ఉండడం.

**ప్రాజెక్టు పనులు - నిర్వహణ :**

* ప్రణాళిక రూపకల్పన
* ప్రాజెక్టుకు సంబంధించి సమాచారాన్ని సేకరించడం
* సేకరించిన సమాచారాన్ని క్రమ పద్ధతిలో నమోదు చేయడం
* నమోదు చేసిన సమాచారాన్ని విశ్లేషించి, ప్రదర్శించడం

సూచన : ప్రాజెక్టు జట్టుపనిగా మాత్రమే ఇవ్వాలి.

**లఘు పరీక్షను ఎలా నిర్వహించాలి?**

* ఈ పరీక్ష యూనిట్ టెస్టులా కాకుండా / ముందస్తు సమాచారం ఇవ్వకుండా యధాలాపంగా నిర్వహించాలి.
* రాత పరీక్ష 20 మార్కులకు నిర్వహించాలి.
* 20 మార్కుల పరీక్ష ఒకే సారి కాని లేదా రెండు లేక మూడు సార్లు గాని నిర్వహించుకోవచ్చు.
* దీనికి నిర్దిష్ట సమయం అవసరం లేదు. ఎప్పుడైనా నిర్వహించుకోవచ్చు.
* ఈ పరీక్షకు ప్రత్యేకంగా ఒక నోటు పుస్తకం కేటాయించి దానిలోనే నిర్వహించాలి.
* రాత పరీక్షకు 20 మార్కులు ఉన్నాయి. కాబట్టి ప్రతి సబ్జెక్టులో ఏవైనా 2 లేదా 3 సామర్థ్యాల కనుగుణంగా ప్రశ్నాపత్రాన్ని ఉపాధ్యాయులే తయారుచేసుకొని మూల్యాంకనం చేయాలి. ఒకే సారి కాకుండా 2 సార్లుగా (10 మార్కుల చొప్పున) పరీక్ష నిర్వహించుకోవచ్చు. లేదా మూడు సార్లుగా (5మా, 5మా, 10మా) నిర్వహించుకోవచ్చు.
* ప్రశ్నాపత్రం రూపొందించుకోవడంలో ఉపాధ్యాయునికి స్వేచ్ఛ ఉంది.
* నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లలు సమాధానాలు రాయడానికి ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక నోటు పుస్తకం ఉండాలి.
* ఈ నోటు పుస్తకాలలోని సమాధానాలను ఉపాధ్యాయులు దిద్ది గ్రేడు రూపంలో ఫార్మాట్‌లో నింపాలి.

**లఘు పరీక్షాంశాలు :**

* భావనలపై అవగాహన (ప్రశ్న /జవాబు)
* పటాలను విశ్లేషించడం, పటంలో ప్రాంతాలను గుర్తించడం.
* సేకరించిన సమాచారంపై విశ్లేషణ
* సామాజిక అంశాలపై అవగాహన, అనుభవాల విశ్లేషణ
* ప్రశంస, విలువలు

## ఫార్మేటివ్ మూల్యాంకనం

* ఫార్మేటివ్ మూల్యాంకనం కోసం కింది సాధనాలను ఉపయోగించాలి. వాటికి కేటాయించిన మార్కుల వివరాలు కూడా ఉన్నాయి గమనించండి.

- పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (Children participation, Responses) – 10 మార్కులు
- పిల్లలు రాసిన అంశాలు (Written works) – 10 మార్కులు
- ప్రాజెక్టుపనులు (Project Works) – 10 మార్కులు
- లఘు పరీక్ష (Written text / Slip test) – 20 మార్కులు

ఫార్మేటివ్ సాధనాలకు కేటాయించిన మార్కుల ఆధారంగా పిల్లలకు గ్రేడును కేటాయించాలి.

* అయితే రాత పరీక్షకు 20 మార్కులు ఉన్నాయి. కాబట్టి ప్రతి సబ్జక్టులో ఏవైనా 2 లేదా 3 సామర్థ్యాలకనుగుణంగా ప్రశ్నాపత్రాన్ని ఉపాధ్యాయులే తయారు చేసుకొని మూల్యాంకనం చేయాలి.
* ఫార్మేటివ్ కోసం నిర్వహించే రాత పరీక్షను ఉపాధ్యాయులు తమ వీలును బట్టి జులై, సెప్టెంబర్, డిసెంబర్, ఫిబ్రవరి మాసాల్లో నిర్వహించుకోవాలి.
* ఫార్మేటివ్ మూల్యాంకనం వివరాలను కింది విధంగా నమోదు చేయాలి.

తరగతి ........................విషయం.......................... ఫార్మేటివ్ : 1వ / 2వ / 3వ / 4వ

| క్ర సం. | విద్యార్థి పేరు | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందన (10 మా.) | రాసిన అంశాలు (10 మా.) | ప్రాజెక్టుపని (10 మా.) | రాత పరీక్ష 20 మా. | మొత్తం (50 మార్కులు) |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |

* వాటి జవాబులను రాయడానికి, పిల్లలకు ప్రత్యేక నోటు బుక్కు ఉండాలి. ప్రాథమిక స్థాయిలో అన్ని సబ్జక్టులకు ఒకే నోటు బుక్కు వాడాలి. 6వ తరగతి నుండి పై తరగతులకు ఒక్కొక్క సబ్జక్టుకు ఒక నోటు బుక్కు ఉండాలి.
* వీటి జవాబులను దిద్దడం కూడా సమ్మేటివ్ జవాబు పత్రాలను దిద్దినట్లుగానే దిద్దాలి.

* పరిశీలనలు, రాసిన అంశాలు, ప్రాజక్టుపనులు మొదలగు వాటికి ఆధారాలను పరిశీలనల ఆధారంగా బట్టి గ్రేడు కేటాయించాలి. కాని పిల్లలు చేసిన పనుల ఆధారాలను భద్రపరచాలి. ఉదా : రాసిన అంశాలు అంటే నోటుబుక్కులు, పోర్టుఫోలియోలు, పాఠ్యపుస్తకాలలో రాయడం, గోడపత్రికలో ప్రదర్శించిన అంశాలు, సృజనాత్మక వ్యక్తీకరణ అంశాలు మొదలగునవి.

* అట్లే ప్రాజెక్టు పనులకు సంబంధించి పిల్లలు జట్లలో ప్రాజక్టుపని చేసిన తదుపరి రాసిన నివేదికలు లేదా వ్యక్తిగతంగా చేసిన ప్రాజెక్టు పనుల నివేదికలు భద్రపరచాలి.

* రాత పరీక్ష గురించి నోటు బుక్కులు ఉంటాయి.

* పరిశీలనలు అంటే పిల్లలు మాట్లాడడం, ప్రశ్నించడం, భావవ్యక్తీకరణ చేయడం, చర్చల్లో పాల్గొనడం, ఉపన్యసించడం, పాటలు పాడడం, జట్టుపనుల్లో పాల్గొనడం, ప్రయోగాలు చేయడం, గ్లోబు, మ్యాపులను ఉపయోగించి సమాచారం గ్రహించడం, ప్రతిస్పందించడం, ఆంగ్లం, హిందీ వంటి భాషల్లో ప్రశ్నలకు మౌఖికంగా జవాబులు చెప్పడం, అభినయించడం, సూచనలు విని అర్థం చేసుకోవడం.... ఇలా ఆయా సబ్జక్టుల స్వభావాన్నిబట్టి పిల్లలు ప్రతిచర్యలు, పాల్గొనడం వంటివి ఉంటాయి. వీటిని ఉపాధ్యాయులు పరిశీలించి పిల్లల స్థాయిని అంచనావేసి గ్రేడింగ్ ఇవ్వాలి. ఐతే వీటి గురించి ఆధారాలు ప్రతిరోజూ సేకరించడం వంటివి అవసరం లేదు. కాని ఉపాధ్యాయులు తమ డైరీలో ప్రత్యేకమైన వివరాలను నమోదు చేసుకోవచ్చు.

## సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation)

* వివిధ విషయాలలో (సబ్జెక్టలలో) పిల్లల విద్యా ప్రమాణాల ఆధారంగా నిర్దిష్టసమయంలో ప్రగతిని అంచనా వేయడానికి నిర్వహించే మూల్యాంకనమే సంగ్రహణాత్మక మూల్యాంకనం.

* సంగ్రహణాత్మక మూల్యాంకనంను విద్యా సంవత్సరంలో 3 సార్లు నిర్వహిస్తారు. అక్టోబర్, జనవరి, ఏప్రిల్ నెలల్లో వీటిని నిర్వహిస్తారు.

* ఉపాధ్యాయులే సొంతంగా ప్రశ్నాపత్రంను తయారు చేసికొని మూల్యాంకనం చేయాలి.

* సంగ్రహాణాత్మక మూల్యాంకనం ప్రాథమిక స్థాయిలో 50 మార్కులకు, ప్రాథమికోన్నత స్థాయిలో 100 మార్కులకు ఉంటుంది. ప్రతి సబ్జెక్టులో ఉండే అన్ని విద్యా ప్రమాణాలను మదింపు చేయాలి.

* ప్రశ్నాపత్రంను విద్యా ప్రమాణాల వారీగా విభజించి రూపొందించాలి. (చివరన నమూనా ప్రశ్నాపత్రంలో ఇవ్వబడినవి, గమనించండి.)

* ప్రతి విద్యా ప్రమాణంలో ఇచ్చే ప్రశ్నలు వ్యాసరూప, స్వల్పసమాధాన, సంక్షిప్త, లక్ష్యాత్మక ప్రశ్నలుగా ఉండాలి. అయితే ప్రతి విద్యాప్రమాణంలో పై నాలుగు రకాలు తప్పనిసరిగా ఉండవలసిన అవసరంలేదు. ఏ విద్యా ప్రమాణాన్ని ఏరకమైన ప్రశ్నల ద్వారా పరిశీలించేందుకు వీలు ఉంటుందో గుర్తించి ఆయా రకాల ప్రశ్నలు ఇవ్వాలి. (బ్లూ ప్రింట్‌ను పరిశీలించండి.)

* ప్రతి విషయం (సబ్జెక్టు) లోను భారత్వ పట్టికలు ఇవ్వబడినవి.

* ప్రశ్నలు బట్టీ పట్టి సమాధానం ఇచ్చేవిగా ఉండరాదు, అర్థంచేసుకొని, అన్వయించి రాసేవిగా ఉండాలి. కొన్ని విషయాలలో (సబ్జెక్టుల్లో) విద్యా ప్రమాణాలు నిర్దిష్టసంఖ్యలో ఉన్నప్పటికీ పరీక్షాసౌలభ్యం కొరకు వాటిని కుదించి 5 లేక 6 విభాగాలుగా మాత్రమే విభజించి ప్రశ్నాపత్రం రూపొందించుకోవాలి. మౌఖిక ప్రశ్నలకు తావులేదు.

* ప్రాజెక్టు పనులను సంగ్రహణాత్మక మూల్యాంకనంలో ఇవ్వరాదు.

* సమ్మేటివ్ ప్రశ్నాపత్రం రూపొందించడంలో ప్రశ్నల రకాలు, ప్రశ్నల సంఖ్య, మార్కుల వివరాలు కింది భారత్వ పట్టికలో ఇవ్వబడ్డాయి. పరిశీలించండి.

**సాంఘిక శాస్త్రం – సంగ్రహణాత్మక మదింపు – సామర్థ్యాల వారీ ప్రశ్నారూప భారత్వ పట్టిక (Blue Print)**

| క్రమ. సంఖ్య | విద్యా ప్రమాణం | వ్యాసరూప ప్రశ్నలు | స్వల్ప సమాధానములు | అతిస్వల్ప సమాధానములు | లక్ష్యాత్మక ప్రశ్నలు | ప్రశ్నల మొత్తం | మొత్తం శాతం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | విషయావగాహన | 2(10) | 2(5) | 5(1) | 10(½) | 19(40) | 40% |
| 2. | చదివి, వ్యాఖ్యానించండి | 1(10) | – | – | – | 1(10) | 10% |
| 3. | సమాచార నైపుణ్యాలు | – | 3(5) | – | – | 3(15) | 15% |
| 4. | సమకాలీనాంశాలు | 1(10) | 1(5) | – | – | 2(15) | 15% |
| 5. | పటనైపుణ్యాలు | – | 1(5) | 5(1) | – | 6(10) | 10% |
| 6. | ప్రశంస – సున్నితత్వం | – | 2(5) | – | – | 2(10) | 10% |

సూచన : బ్రాకెట్టులోని సంఖ్య మార్కులను సూచిస్తుంది.

## సమ్మేటివ్ ప్రశ్నాపత్రం తయారీ సూచనలు

## సాంఘిక శాస్త్రం : 6-9 తరగతులు

* విద్యా ప్రమాణాల ఆధారంగా సమ్మేటివ్ ప్రశ్నాపత్రంను రూపొందించించాలి.

* విద్యా ప్రమాణానికి కేటాయించిన భారత్వం ఆధారంగా ప్రశ్నల రకాలు, ప్రశ్నల సంఖ్య ఉండాలి.

* ప్రశ్నలు వ్యాసరూప, స్వల్ప సమాధాన, సంక్షిప్త సమాధాన, లక్ష్యాత్మక ప్రశ్నలుగా ఉండాలి.

* విషయావగాహన - 40 మార్కులు (40%)

* చదివి, వ్యాఖ్యానించడం - 10 మార్కులు (10%)

* సమాచార నైపుణ్యాలు - 15 మార్కులు (15%)

* సమకాలీన అంశాలపై ప్రతిస్పందన, ప్రశ్నించడం - 15 మార్కులు (15%)

* పట నైపుణ్యాలు - 10 మార్కులు (10%)

* ప్రశంస - సున్నితత్వం - 10 మార్కులు (10%)

* పై మార్కుల విభజన ఆధారంగా ప్రశ్నలు తయారు చేసుకోవాలి.

### సాంఘిక శాస్త్రం 6-9 తరగతుల భారత్వ పట్టిక

| | ఫార్మేటివ్ | | | | | సమ్మేటివ్ | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అంశం | వి.భా. ప్రతి | నోటు పుస్తకాలు | ప్రాజెక్టు | రాత పరీక్ష | మొత్తం | విషయా వగాహన | చదివి వ్యాఖ్యా చడం | సమాచార నైపుణ్యాలు | సమకాలీన అంశాలపై ప్రతిస్పందన | పట నైపు ణ్యాలు | ప్రశంస | మొత్తం |
| భారత్వం | 20% | 20% | 20% | 40% | 100% | 40% | 10% | 15% | 15% | 10% | 10% | 100% |
| మార్కులు | 10 | 10 | 10 | 20 | 50M | 40 | 10 | 15 | 15 | 10 | 10 | 100M |

## సంగ్రహణాత్మక మదింపు - ప్రశ్నాపత్రం తయారీకి సూచనలు

## సాంఘిక శాస్త్రం 6-9 తరగతులు

* విద్యా ప్రమాణాల ఆధారంగానే ప్రశ్నాపత్రంను రూపొందించాలి.

* కేటాయించిన భారత్వం ఆధారంగా ప్రశ్నలసంఖ్య, ప్రశ్నల రకం ఉండాలి.

**I. విషయావగాహన :**

విషయావగాహన కింద ఇచ్చే ప్రశ్నలు వ్యాసరూప, స్వల్ప, సంక్షిప్త, లక్ష్యాత్మక రకానికి చెందినవిగా ఉండాలి.

**II. చదివి, వ్యాఖ్యానించడం:** ఈ విద్యా ప్రమాణం కింద మనము ఇచ్చిన అంశాన్ని విద్యార్థి చదివి, అర్థంచేసుకుని, వ్యాఖ్యానించ గలిగే ప్రశ్నలు ఇవ్వాలి.

**III. సమాచార నైపుణ్యాలు :** 'ప్రాజెక్టు పనులను' సంగ్రహణాత్మక మదింపులో ఇవ్వరాదు.

* సమాచారాన్ని పేరా రూపంలో ఇచ్చి పట్టిక తయారు చేయమనడం ఒక పద్ధతి.

* సమాచారాన్ని పట్టిక రూపంలో ఇచ్చి విశ్లేషించమనడం మరొక పద్ధతి.

* సమాచార పట్టికలను గ్రాఫ్ రూపంలోకి మార్చడం, గ్రాఫ్‌లు ఇచ్చి విశ్లేషించమనడం, ప్రశ్నించడం వంటివి ఇవ్వాలి.

**IV. సమకాలీన అంశాలపై ప్రతిస్పందన :** పాఠ్యాంశంలోని భావనలకు సమకాలీన సమస్యలను జోడించటం, స్థానిక పరిస్థితులను అన్వయించుకుని ప్రతిస్పందించడం వంటి ప్రశ్నలు ఉండాలి. ఇందుకోసం ఎంపిక చేసే ప్రశ్నలు పూర్తిగా సిలబస్‌పైనే దృష్టి పెట్టుకుని తయారు చేయాల్సిన అవసరం లేదు. పిల్లలు తమకు తెలియని అంశాలను, శోధించే అంశాలను ప్రశ్నించే విధంగా ప్రశ్నలు ఇవ్వాలి.

**V. పటనైపుణ్యాలు :** వీనిలోని ప్రశ్నలు పటాలు చదవడం, గుర్తించడం, గీయటానికి సంబంధించి ఉండాలి.

**VI. ప్రశంస-సున్నితత్వం :** వివిధ అంశాలలోని విలువలను, వాటి ప్రాధాన్యతను విద్యార్థులు గుర్తించగలిగేలా, ప్రశంసించేలా ప్రశ్నలు ఉండాలి.

## గ్రేడింగ్ నిర్ధారించడం

**1. సమాధానాలకు గ్రేడు ఇవ్వడం**

ఒక ప్రశ్నకు 5 మార్కులు కేటాయించినప్పుడు పూర్తిగా సరైన సమాధానం రాస్తే $A^+$ (5 మార్కులు), కొంతవరకు సరిగా రాస్తే A (4మార్కులు), దాదాపు రాస్తే $B^+$ (3మార్కులు), కొద్దిగా రాస్తే B (2మార్కులు), చాలా కొంచెం రాస్తే (1 మార్కు) చొప్పున

గ్రేడింగ్  ఇవ్వాలి. సున్నా వచ్చినచో ఎలాంటి గ్రేడింగ్ ఇవ్వరాదు. పిల్లల సమాధాన పత్రము మీద మార్కులు వేయకూడదు. కేవలం గ్రేడు మాత్రమే రాయాలి.

ఒక విభాగంలో 2½ మార్కుల ప్రశ్నలు 2 ఉంటే ఆ రెండింటికి కలిపి గ్రేడు ఇవ్వాలి. అదేవిధంగా 2½ మార్కు ప్రశ్న ఒకటి, ఒక మార్కు ప్రశ్నలు రెండు, ½ మార్కు ప్రశ్న ఒకటి ఉన్నప్పుడు వీటన్నిటిని కలిపి (గ్రేడింగ్ ఇవ్వాలి.

## 2. విద్యా ప్రమాణానికి గ్రేడు ఇవ్వడం

ఒక విద్యాప్రమాణానికి నిర్దేశించిన భారత్వం ఆధారంగా ప్రశ్నలుంటాయి. ఉదాహరణకు విషయ అవగాహనకు 40 మార్కులు కేటాయించారు అనుకుందాం. దీనిలో 10 మార్కుల ప్రశ్నలు 2,  ½ మార్కు ప్రశ్నలు 20 ఉన్నాయి అనుకుందాం. వీటన్నిటికీ కలిపి విద్యార్థికి వచ్చిన మొత్తం మార్కులను వాటి శాతాన్ని లెక్కించి, కింది పట్టిక ఆధారంగా గ్రేడు ఇవ్వాలి.

పట్టిక –1

| శాతం | గ్రేడు |
|---|---|
| 91–100 | $A^+$ |
| 71–90 | A |
| 51–70 | $B^+$ |
| 41–50 | B |
| 0–40 | C |

**ఒక విద్యార్థికి**

ఉదాహరణకు విషయ అవగాహనలో 40 మార్కులకుగాను మొత్తం ప్రశ్నలకు కలిపి 28 మార్కులు వచ్చాయి అనుకుందాం. అంటే ఆ సామర్థ్యంలో విద్యార్థి 70% మార్కులు సాధించినట్లవుతుంది. అందుకుగాను $B^+$ అని గ్రేడింగ్ ఇవ్వాలి.

**ప్రగతి నమోదు రిజిష్టరు**

ఫార్మేటివ్ మరియు సమ్మేటివ్ మదింపులలో పిల్లలు సాధించిన గ్రేడులను ఈ రిజిష్టరులో నమోదు చేయాలి. ప్రగతి నమోదు రిజిష్టరులో తరగతి వారీగా ప్రతి విద్యార్థికి ఒక పేజీ కేటాయించాలి.

ఫార్మేటివ్ మదింపులో పరిశీలనలు, రాతపనులు, ప్రాజెక్టుపనులు, రాత పరీక్షలలో నిర్దేశించిన సూచికల ఆధారంగా పొందిన మార్కులను, గ్రేడులను రాయాలి. అదే విధంగా సమ్మేటివ్ మదింపులో విద్యా ప్రమాణాల వారీగా విద్యార్థి పొందిన గ్రేడులను నమోదు చేయాలి. విడిగా సహపాఠ్యాంశాల మొత్తం గ్రేడు ఇవ్వాలి. వివరణాత్మక సూచిక రాయాలి.

## సాంఘికశాస్త్రం – విద్యా ప్రమాణాలు – నమూనా ప్రశ్నలు

మీరు ఇంతకుముందు అధ్యాయాలలో 6 నుండి 9 తరగతుల విద్యార్థులకు ఉండాల్సిన విద్యా ప్రమాణాల గురించి వివరంగా తెలుసుకున్నారు. వివిధ పాఠ్యాంశాల బోధనాభ్యసన తరువాత విద్యార్థులు నిర్దేశిత విద్యా ప్రమాణాలను ఎంతవరకు సాధించారు, అనే విషయం మనం సమగ్ర మూల్యాంకనం ద్వారా పరీక్షిస్తాం. వివిధ విద్యా ప్రమాణాలకు సంబంధించిన కొన్ని నమూనా ప్రశ్నలను పరిశీలిద్దాం.

### విద్యా ప్రమాణాలు – నమూనా ప్రశ్నలు

**I. విషయావగాహన :**

1. స్థానికకాలం, ప్రామాణికకాలం అంటే ఏమిటి? వీటి మధ్యగల తేడాను వివరించండి.
2. శిలావరణం అంటే ఏమిటి? ఇది ఎలా ఏర్పడుతుంది.
3. ఏవైనా ఐదు సేవా కార్యకలాపాలను రాయండి. అవి ఎందుకు వ్యవసాయ కార్యకలాపాలకిందికి రావో కారణాలు తెలపండి.
4. స్వయం సహాయక బృందాల యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి? ఇవి సేవలకు ఏ విధంగా తోడ్పాటునందించాలి? సొంతమాటల్లో రాయండి.
5. పెట్టుబడిదారీ విధానం సోషలిజం యొక్క భావనలను పోలుస్తూ ఒక పేరా రాయండి.
6. ప్రకృతి వైపరీత్యాలని వేటినంటారు? కొన్ని ఉదాహరణలు రాయండి.
7. సమాజంలోని అసమానతలను ప్రజాస్వామ్యం ద్వారా తగ్గించవచ్చని భావిస్తున్నారా! దీని గురించి మీ అభిప్రాయం తెల్పండి.

**II. పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించడం :**

1. 32వ పేజీలోని విషయాన్ని చదవండి. మహాసముద్రాల ఉష్ణోగ్రతను ప్రభావితం చేసే అంశాల గురించి వ్యాఖ్యానించుము.
2. 40వ పేజీలోని పీడన మేఖలకు సంబంధించిన 4 పేరాలు చదవండి. వేడెక్కడము. పీడనం చల్లబడడం అనే అంశాల గురించి మీరేమితెలుసుకున్నారో రాయండి.
3. 113 వ పేజిలోని చివరి రెండు పేరాలు చదవండి. ఈ విషయంతో మీరు ఏకీభవిస్తున్నారా! మీ అభిప్రాయాలు తెల్పండి.
4. 130వ పేజీలోని విషయాన్ని చదవండి. ప్రత్యక్ష పన్నుల గురించి మీరు గ్రహించిన 5 ముఖ్యమైన విషయాలు రాయండి.
5. 249వ పేజిలోని సామాజిక సమానత్వానికి సంబంధించిన పేరాలను చదవండి. దీని ఆధారంగా సామాజిక సమానత్వం అంటే ఏమిటి? సొంత మాటల్లో రాయండి.

**III. సమాచార నైపుణ్యాలు :**

1. మీ ప్రాంతంలో ఏఏ ఖనిజాలు ఎక్కడెక్కడ లభిస్తాయో వివరాలు సేకరించండి. ఇక్కడ ఏఏ పరిశ్రమలు స్థాపించవచ్చో ఒక పట్టిక రూపంలో రాసి ప్రదర్శించండి.
2. 74వ పేజీలోని పటాన్ని చూడండి. దీని ఆధారంగా పరిశ్రమలు నెలకొల్పడం గురించి ఒక పేరాను రాయండి.
3. 28వ పేజీలోని జలావరణం పట్టికను చూడండి. ఈ పట్టిక ఆధారంగా ఏవేవి ఎంత శాతంలో ఉన్నాయో ఒక పేరా రూపంలో రాయండి.

4. 60, 61 పేజీలలోని పంటలకు సంబంధించిన వివరాలు చదవండి. వీటి ఆధారంగా వివిధ పంటలకు సంబంధించిన పట్టిక లేదా ఫ్లో చార్ట్‌ను తయారు చేయండి.

5. 65వ పేజీలోని వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలకు సంబంధించిన పట్టికను చూడండి. ఈ పట్టిక ఆధారంగా పోకడలను విశ్లేషించండి.

6. 282వ పేజీలోని హైదరాబాదు నగరంలోని ప్రమాదాలకు సంబంధించిన పటాన్ని చూడండి. దీని ఆధారంగా మన రాష్ట్రంలోని ప్రమాదాలకు సంబంధించిన పటాన్ని తయారుచేయండి.

**IV. సమకాలీనాంశాలపై ప్రతిస్పందన – ప్రశ్నించడం.**

1. ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుచున్నది. వీటికి గల కారణాలేమై ఉంటాయి?

2. ఈ మధ్య కాలంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. ఇందుకు గల కారణలేమై ఉంటాయి? వీటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో మీ అభిప్రాయాలు తెలపండి.

3. ఆధునిక కాలంలో పర్యావరణ సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వీటికి మనమే కారణభూతులమవుతున్నాము. వీటిని అరికట్టడమెలాగో తెల్పండి.

4. సాగు భూమి యొక్క విస్తీర్ణం రోజు రోజుకు తగ్గడం వల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి?

5. బాలికలు, మహిళలు ఎదుర్కొనే వివిధ సమస్యల గురించి తెలుసుకున్నారు కదా ! మీ గ్రామంలో లేదా పట్టణంలో ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారా! వీటిని అరికట్టడానికి సంబంధించిన చట్టాలలో ఏ అంశాలున్నాయి? వీటి గురించి మరింత తెలుసుకోవడానికి ఎలాంటి ప్రశ్నలడుగుతారు?

**V. పట నైపుణ్యాలు :**

1. పారిశ్రామిక విప్లవకాలంలో ఇంగ్లాండులో ఇనుము, వస్త్రపరిశ్రమలు కేంద్రీకృతమైన ప్రదేశాలను పటంలో గుర్తించండి.

2. ఆంధ్రప్రదేశ్ పటంలో బొగ్గులభించే కొత్తగూడెం, ఇల్లందులను గుర్తించండి.

3. ప్రపంచ పటంలో కింది స్థానిక పవనాలు గుర్తించండి.

   ఎ) చినూక్ బి) లూ సి) సైమూన్ డి) యోమా ఇ) నార్వెస్టర్ ఎఫ్) ప్యూనా

4. రిజర్వు బ్యాంకు చిహ్నాన్ని గీయండి.

**VI. ప్రశంస–సున్నితత్వం :**

1. ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించండి. ఇలాంటి సందర్భాలలో మనం ఎలాంటి సహాయ సహకారాలందించవచ్చో తెల్పండి.

2. బాల్య వివాహాలవల్ల జరిగే అనర్థాల గురించి తెలియజేస్తూ ఒక కర పత్రం తయారు చేయండి.

3. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అనేవి ఒక ముఖ్యమైన ప్రక్రియ. ఎన్నికలలో ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ప్రజలను చైతన్యపరచడానికి కొన్ని నినాదాలు రాయండి.

4. స్త్రీలు, పురుషులు అట్లే బాల బాలికలు అందరూ కూడా సమానమే. మహిళలను, బాలికలను గౌరవించడం మన బాధ్యత, తోటి మానవులుగా వారిని గౌరవించడానికి, మనతో సమానంగా చూడడానికి మీరు చేపట్టే చర్యలను వివరించండి.

## సంగ్రహణాత్మక మదింపు మాదిరి ప్రశ్నా పత్రము

తరగతి : 9వ  మొత్తము : **100** మార్కులు
విషయము : సాంఘిక శాస్త్రము  సమయం: **2½** గం

**I.విషయావగాహన :** **40M**

**a.** ఈ క్రింద ఇవ్వబడిన 4 వ్యాస రూప ప్రశ్నలలో ఏవైనా రెండింటికి సమాధానాలు రాయండి. **2x10=20**

1. సముద్రాలు మానవ జీవనంలో నిర్వహిస్తున్న పాత్రను వివరించండి.
2. పెట్టుబడిదారీ విధానం, సోషలిజంకు గల తేడాలను తెలుపండి.
3. "సేవారంగం, సుస్థిర వృద్ధి భారతదేశాన్ని ధనిక దేశంగా చేస్తాయి." ఈ వ్యాఖ్యతో నీవు ఏకీభవిస్తావా? ఎందుకు?
4. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంలో వ్యవసాయాన్ని ఎందుకు విస్తరింపజేయాలనుకుంది? వివరించండి?

**b.** ఈ క్రింద ఇవ్వబడిన 4 స్వల్ప సమాధాన ప్రశ్నల నుండి ఏవైనా 2 ప్రశ్నలకు జవాబులు రాయండి. **2x5=10**

5. రోడ్డు భద్రతా ఆవశ్యకతను వివరించండి?
6. భూగోళం వేడెక్కడం అనగానేమి? దానికి గల కారణాన్ని పేర్కొనండి?
7. స్వయం సహాయక బృందాల ద్వారా వచ్చే రుణానికి, బ్యాంకుల ద్వారా వచ్చే రుణానికి తేడాలేంటో తెలపండి.?
8. ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాడటానికి కారణాలు ఏమిటి?

**c.** ఈక్రింద ఇవ్వబడిన అతి స్వల్ప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయండి. **5x1=5**

9. భూమిని నీలిగ్రహం అని ఎందుకు అంటారు?
10. కొరియాలిస్ ప్రభావం అంటే ఏమిటి?
11. వస్త్రపరిశ్రమను విప్లవాత్మక మార్పులకు గురిచేసిన రెండు ముఖ్యమైన ఆవిష్కరణలు రాయండి?
12. సర్ఫ్‌లు అనగానేమి?
13. ధరల సూచి అంటే ఏమిటి?

**d.** ఈ క్రింద ఇవ్వబడిన బహుళైచ్ఛిక సమాధాన ప్రశ్నల నుండి సరియైన జవాబును గుర్తించండి. **5x½=2½**

14. ఈ క్రింది వానిలో ప్రాథమిక హక్కు కానిది ఏది ( )

a) విద్యాహక్కు b) జీవించే హక్కు c) ఆస్తిహక్కు d) రాజ్యాంగ పరిహారపు హక్కు

15. ప్రజాస్వామ్యంలో రాజకీయ, సామాజిక అసమానతలపై అధ్యయనం ఈ క్రింది విషయాన్ని వెల్లడి చేస్తుంది.(     )

a) ప్రజాస్వామ్యం-అభివృద్ధి కలిసి ఉంటాయి. b) ప్రజాస్వామ్యంలో అసమానతలు ఉంటాయి.

c) నియంతృత్వంలో అసమానతలు ఉండవు d) ప్రజాస్వామ్యం నియంతృత్వం కంటే మంచిది.

16. బారెన్, నార్కొండం అగ్ని పర్వతాలు ఏ దేశంలో ఉన్నాయి. (     )

a) భారతదేశం b) జపాన్ c) ఈక్విడార్ d) సిసిలి

17. ఈ క్రింది వానిలో ప్రత్యక్ష పన్ను కానిదేది (     )

a) వృత్తి పన్ను b) సంపదపన్ను c) కస్టమ్స్ సుంకం d) ఆదాయపుపన్ను

18. ఏ వయస్సు లోపలి వారిని బాలలుగా పరిగణిస్తారు. (     )

a) 14 ఏళ్ల లోపు b) 16 ఏళ్ల లోపు c) 18 ఏళ్ల లోపు d) 20 ఏళ్ల లోపు

e. **ఈ క్రింది ఖాళీలను పూరించండి.** 5X½=2½

19. మధ్యధరా సముద్రపు దీపస్తంభంగా పిలవబడే అగ్నిపర్వతం........................

20. 2009 సం॥ నుండి ధరలను మదించుటకు ప్రభుత్వంచే ప్రవేశ పెట్టబడిన కొత్త సూచిక..................

21. ప్రతి సినిమా విడుదలకు ముందు................ బోర్డ్ నుండి ఆమోదం పొందాలి.

22. ఒక దేశం లేదా ప్రాంతం లేదా తనను తాను స్వతంత్రంగా నిర్వహించుకొనే స్వేచ్ఛను..................... అంటారు.

23. ఆవిరి శక్తిని మొదటిసారి...................... పరిశ్రమలో ఉపయోగించారు.

**II. పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించడం.** **10M**

24. ఈ క్రింది పేరాను చదివి క్రింది ప్రశ్నకు సమాధానం ఇవ్వండి. **1x10=10**

"దేశాలు ఎదుర్కొనే సంక్లిష్ట సమస్యలలో కొన్నింటిని పరిష్కరించడానికి ప్రజలందరి స్వేచ్ఛను, హక్కులను గౌరవించే ప్రజాస్వామ్యమే సరైన మార్గము" దీనిపై నీ అభిప్రాయమేమిటి?

(లేదా)

"భారతదేశంలో ప్రతీ సంవత్సరం రోడ్డు ప్రమాదాలలో 80,000 మంది చనిపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్న వారిలో ఇది 13%. రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్న వారిలో సగం కంటే ఎక్కువ మంది 15 నుండి 44 మధ్య వయస్సున్న వారు." దీనితో నీవు ఏకీభవిస్తున్నావా ? ఎందుకు?

**III. సమాచార నైపుణ్యాలు :** **15M**

25. ఈ క్రింది పట్టికను పరిశీలించి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి. 5x2=10

| సేవారంగ కార్యకలాపాలు | ప్రభుత్వ ఉద్యోగాలు | | ప్రైవేటు ఉద్యోగాలు | |
|---|---|---|---|---|
| | 1991 | 2010 | 1991 | 2010 |
| టోకు మరియు చిల్లర వర్తకం | 1.5 | 1.7 | 3.0 | 5.1 |
| రవాణా గిడ్డంగులు మరియు సమాచారాలు | 30.3 | 25.3 | 0.5 | 1.7 |
| బ్యాంకింగ్, భీమాసంస్థలు స్థిరాస్థి వ్యాపారం, ఇతరములు | 11.9 | 14.1 | 2.5 | 15.5 |
| సామాజిక మరియు సాంకేతిక వ్యక్తిగత సేవలు | 92.3 | 90.5 | 14.9 | 21.4 |

- 2010 సం॥ ఏ సేవారంగ కార్యకలాపం ఉద్యోగితను కల్పించింది? 1991లో పోలిస్తే 2010 నాటికి ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య ఏ సేవా రంగ కార్యకలాపాలలో తగ్గింది?
- 2010 సం॥ నాటికి ఏ సేవా కార్యకలాపాలలో ప్రైవేటు ఉద్యోగాల సంఖ్య గణనీయంగా పెరిగింది.
- 2010 నాటికి మొత్తం సేవా రంగం కార్యకలాపాలలో ప్రైవేటు ఉద్యోగుల సంఖ్యతో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంది?

26. ఈ క్రింది పట్టికలో ఇనుము, ఉక్కు టోకు ధరల సూచి వివిధ సం॥లలో ఏ విధంగా ఉందో చూపబడింది. ఈ పట్టిక ఆధారంగా బార్ గ్రాఫ్ గీయండి. 5x1=5

| సంవత్సరం | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 |
|---|---|---|---|---|---|---|
| ఇనుము-ఉక్కు టోకు ధరల సూచి | 100 | 105 | 119 | 137 | 124 | 136 |

**IV. సమాకాలీనాంశాలపై ప్రతి స్పందన – ప్రశ్నించడం:** **15M**

27. మీరు బాలికలు, మహిళలు, నేటి సమాజంలో వివిధ సమస్యలు ఎదుర్కోవడం గమనిస్తూనే ఉన్నారు. మీ ప్రాంతంలో మహిళల, బాలికల సమస్యలను ఏవైనా గమనించారా? వీటి పట్ల మీ ప్రతిస్పందన / అభిప్రాయం ఏంటో తెలియజేయండి.

1x10=10

28. ఇటీవల కాలంలో ఇంధనం ధరలు తరచుగా పెరుగుతున్నాయి. దీని ప్రభావం గురించి తెలుసుకునేందుకు నీవు ఏ ఏ ప్రశ్నలు అడుగుతావు. 5x1=5

(i) కూరగాయల వ్యాపారి (ii) స్కూటరిస్ట్ (iii) లారీ యజమాని (iv) ఒక బస్సు ప్రయాణికుడు (v) ఆటోడ్రైవర్

**V. పట నైపుణ్యాలు :** **10M**

29. కింది పటాన్ని పరిశీలించి ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి 5x1=5

1. వాస్కోడిగామ భారతదేశంలో చేరుకున్న మొదటి పట్టణమును గుర్తించండి.
2. మాజిలాన్ ఆసియా ఖండంలో చేరుకున్న మొదటి ప్రాంతాన్ని గుర్తించండి.
3. ఉత్తర అమెరికా ఖండపు ద్వీపాలను మొదటిసారిగా చేరుకున్న నావికుడు ఎవరు?
4. మడగాస్కర్ ద్వీపం ఏ ఖండం పరిధిలోకి వస్తుంది?
5. దక్షిణ అమెరికా, ఆఫ్రికా ఖండాలను వేరు చేసే మహా సముద్రము ఏది?

30. ఈ క్రింది ప్రదేశాలను యూరప్ పటంలో గుర్తించండి. **5x1=5**

1. మొదటగా పారిశ్రామికీకరణచెందినదేశం 2. నల్ల సముద్రము 3. సార్డీనియా

4. నార్వే 5. పోర్చుగల్

**VI. ప్రశంస – సున్నితత్వం :** **10M**

2x5=10

31. మయన్మార్‌లో ప్రజాస్వామ్యాన్ని తీసుకురావడంలో ఆంగ్ సాన్ సూకి చేస్తున్న పోరాటాన్ని నీవు ఎలా అభినందిస్తావు?

32. అన్ని ప్రభుత్వ విధానాలకన్నా ప్రజాస్వామ్యం ఉత్తమమయినదని నీవు ఎలా భావిస్తావు?

****